RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# ఉదయం




Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 13 ‖ సంచిక : 61 ‖ ఆదిలాబాద్ ‖ శుక్రవారం,జూలై 04, 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

# పైరసీపై కఠిన చర్యలు



హైదరాబాద్

సినీ పరిశ్రమలో పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. బుధవారం ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంకతో కలిసి సమాచార శాఖ ఎఫడిసి బోర్డు రూమ్ లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో వలు కీలక సమావేశాలు నిర్వహించామని, సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.


అవసరమైతే నూతన నిబంధనల రూపకల్పన కూడా చేస్తామని అయన వెల్లడించారు. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా , ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆన్లైన్ అనుమతుల ప్రొసెస్‌తో పాటు వీడియో పైరసీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని దిల్ రాజు పేర్కొన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరం కలిసి ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్. ప్రియాంక మాట్లాడుతూ సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష జరిపి,

సాధ్యసాధ్యాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇండస్ట్రీ సమస్యలపై ఎవరైనా తమ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తప్పకుండ తాము కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.



## వెల్‌కమ్ సార్...

శుక్రవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించబోయే కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుల సమ్మేళనంలో పాల్గొనేందుకు హైదరాబాద్ విచ్చేసిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




## పద్మ అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం

2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించబడే దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలు అయిన పద్మ విభూషణ్, పద్మ భూషణ్ మరియు పద్మశ్రీ అవార్డులకు భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ 15 మార్చి 2025 నుండి 31 జూలై 2025 వరకు నామినేషన్లను ఆహ్వానించింది. క్రీడా వర్గం కింద పైన పేర్కొన్న ప్రతిష్టాత్మక అవార్డుల కోసం క్రీడాకారుల నుండి నామినేషన్లు ఆహ్వానించబడ్డాయి మరియు క్రీడా వర్గం కింద పైన పేర్కొన్న ప్రతిష్టాత్మక అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి https://awards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా GOI జారీ చేసిన మార్గదర్శకాలను పరిశీలించాలని అభ్యర్థించారు – ఆన్‌లైన్ మోడ్ ద్వారా స్వీకరించబడిన నామినేషన్లు / సిఫార్సులు మాత్రమే పరిగణించబడతాయి.

## జూలై 5న బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా రాంచందర్ రావు బాధ్యతలు స్వీకరణ

హైదరాబాద్ జూలై 3 : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ రాంచందర్ రావు ఎన్నికైన తర్వాత జూలై 5 తేదీన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు.మొదటగా జులై 5 తేదీ ఉదయం 9 గంటలకు అసెంబ్లీ దగ్గర్లో ఉన్న గన్ పార్క్ లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారు.తర్వాత ఉదయం 10 గంటలకు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, బిజెపి రాష్ట్ర పదాధికారులు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారు.అనంతరం 11 గంటలకు భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తారు

# ఉత్తర ప్రదేశ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకనులను అడ్డుకుంటాం

- ♦ విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటాం అని తెలిపిన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీలు
- ♦ సంస్థలను ప్రైవేటు ఇస్తే కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతాం
- ♦ జులై 9న 27లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటారు




హైదరాబాద్ : తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ జేఏసీల ఆధ్వర్యంలో ఈరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కన్వెన్షన్ నిర్వహించడం జరిగింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో రెండు డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటు పరం చేస్తున్నందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా NCCOEEE (నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్) ఆధ్వర్యంలో జరిగిన మీటింగులో జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది. ఉత్తరప్రదేశ్ డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను ప్రైవేటీకరిస్తే దేశవాప్త సమ్మె చేయుడానికి వెనకాడబోమని హెచ్చరించారు.ఈ మీటింగ్ లో సుదీప్ దత్త, కన్వీనర్, నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ ఉ నేషనల్ జనరల్ సెక్రటరీ, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది మరియు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై ఈ ప్రక్రియను వేగవంతం చేయమని ఒత్తిడి చేస్తోంది. లాభదాయకమైన చండీగఢ్ ప్రైవేటీకరించబడింది మరియు వారు ఖ్రూ పై దాడి చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రైవేటీకరణ, సమాంతర లైసెన్సింగ్, జాతీయ ద్రవ్యీకరణ, స్మార్ట్ మీటరింగ్, అవుట్‌సోర్సింగ్ వంటి అనేక పద్ధతులలో ప్రైవేటీకరణ చేస్తున్నారు. తెలంగాణ విద్యుత్ రంగం కూడా సంక్షోభంలో ఉంది. ఎందుకంటే మార్కెట్ నుండి అధిక రేటుకు అధిక మొత్తంలో విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చింది మరియు దాని ఉత్పత్తి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయలేదు. ఉత్తరప్రదేశ్ లో గత ఏడు నెలల నుండి నిరవధికంగా విరామం ఇవ్వకుండా చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు అందిస్తున్న సహకారానికి అభినందనలు తెలిపారు. మోహన్ శర్మ, నేషనల్ జనరల్ సెక్రటరీ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్లో జరుగుతున్న విద్యుత్ వ్యవస్థ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చీజజూజుజుజు ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించలని నిశ్చయించుకుంది మరియు అన్ని విద్యుత్ కార్మికులు మరియు ఇంజనీర్లు ఒకేసారి ముకుమ్మడి సమ్మె చేయాలని నిర్ణయించింది.ఈ సమావేశం ప్రైవేటీకరణ వల్ల పేద వినియోగదారులపై కలిగే దుష్ప్రభావాన్ని మరియు ఆర్థికంగా వెనుకబడిన వారిపై పడే దుష్ప్రభావాన్ని చర్చించింది.ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఐపీఎఫ్) పాట్రన్ అశోక్ రావు గారు మాట్లాడుతూ విద్యుత్ విద్యుత్ ప్రైవేట్ ఇస్తే ధరలు సగటు మనిషికి అందుబాటులో ఉండవని విద్యుత్తు అత్యంత ఖరీదైన వస్తువుగా మారుతుందని రైతులకు మరియు సామాన్య పౌరులకు భారమవుతుందని తెలిపారు. ఎలాగైనా విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో–చైర్మన్ శ్రీధర్, కో–కన్వీనర్ బీసీ రెడ్డి మరియు అనిల్ కుమార్, చైర్మన్ రాధాకృష్ణ.ఆంధ్రప్రదేశ్ జేఏసీ చైర్మన్ కృష్ణయ్య, ఇంజనీర్ల సంఘం జనరల్ సెక్రటరీ కే నాగప్రసాద్, కన్వీనర్ రాఘవరెడ్డి, ప్రతాపరెడ్డి, కో చైర్మన్ శేషారెడ్డి పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ముఖ్య నేతల మౌనమెందుకు

- ♦ బీసీల ఓట్లు కావాలి కాని వాళ్లకు రాజకీయ రిజర్వేషన్లు వద్దా?
- ♦ మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ లోనే ల రిజర్వేషన్లపై స్పష్టతనివ్వాలి
- ♦ రైల్ రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతునివ్వాలి
- ♦ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ♦ రైల్ రోకో పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ ః



బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై కాంగ్రెస్ అగ్రనేతలు ఎందుకు నోరు విప్పడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్ రోకో పోస్టర్ ను గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, బీసీ సమాజం ఉద్యమాలకు దిగివచ్చి రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసన మండలిలో రెండు బిల్లులు ప్రవేశ పెట్టి పాస్ చేసిందన్నారు. ఈ బిల్లులు నెలల తరబడి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్నా కాంగ్రెస్ అగ్రనేతలు వాటిపై కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు.

మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో సభ్యులుగా ఉన్నా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఈ అంశంపై మాట్లాడలేదన్నారు. బీసీల ఓట్లు కావాలి కాని వాళ్లకు రిజర్వేషన్లు వద్దా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులు చట్టరూపం దాల్చేందుకు మద్దతునివ్వాలని కోరుతూ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖార్గేకు లేఖ రాశానని తెలిపారు. కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈనెల 8వ తేదీలోపు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తమ పార్టీని సమాయత్తం చేయడానికి ఏఐసీసీ మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ కు వస్తున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లు తేలకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై తేల్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండిపెండెంట్ కమిటీ ఆధ్వర్యంలో చేయించిన కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లులకు ఆమోదం తెలిపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతూ బుధవారమే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు లేఖ రాశానని తెలిపారు. ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకొని బీసీ బిల్లులకు ఆమోదం తెలిపేలా చేయాలని.. తద్వారా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలి విజయం సాధించాలని సూచించారు.

ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్ ను ఆపేస్తాం

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం ఈనెల 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని గుర్తు చేశారు. ఆ రోజున ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్ ను ఆపేస్తామని తేల్చిచెప్పారు. రైల్ రోకోకు ప్రతి ఒక్కరూ మద్దతునిచ్చి విజయవంతం చేయాలని కోరారు. దక్కన్ నుంచి ఢిల్లీకి వెళ్లే రైళ్లను ఆపి బీసీ రిజర్వేషన్ల సెగ ఢిల్లీకి తగిలేలా చేయాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు కాంట్రాక్టర్ల కోసమే చేపట్టారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. లేఖలు రాస్తే ప్రాజెక్టును ఆపలేరని.. రాష్ట్ర ప్రభుత్వంలో చంద్రబాబు



నాయుడు కోవర్టులు ఉన్నారని కూడా ఆయన అన్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం బనకచర్ల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న సంగతి కాంగ్రెస్ ఎమ్మెల్యేనే ఎత్తి చూపారని అన్నారు. తెలంగాణ హక్కులను కాలరాసే ఈ ప్రాజెక్టుపై ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేయాలన్నారు. రైల్ రోకోకు బీఆర్ఎస్ మద్దతునిస్తుందా అనే ప్రశ్నపై స్పందిస్తూ.. తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీని.. రైల్ రోకోకు బీఆర్ఎస్ మద్దతునిస్తుందని అన్నారు. యూపీఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



## కేసీఆర్ ప్రారంభించిన హరితహారంతో పచ్చటి స్వర్గధామంలా తెలంగాణ

ఒక చిన్న మొక్క నిశ్శబ్దంగా అడవికి జన్మనిస్తుంది అనడానికి తెలంగాణలో విజయవంతమైన హరితహారం నిదర్శనమన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు. కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా జూలై 3, 2015న మొదలైన హరితహారంతో తెలంగాణ పచ్చని స్వర్గసీమగా మారిందన్నారు. రాబోయే తరాలకు అద్భుతమైన పరిసరాలను అందించాలన్న కేసీఆర్ సంకల్పం పదేండ్ల స్వల్పకాలంలోనే హరితహారంతో సాకారమైందన్నారు. ఓవైపు కాలుష్య కోరల్లో చిక్కుకుని ఊపిరాడని నగరాల దుస్థితి తెలంగాణకు రాకూడదన్నదే హరితహారం లక్ష్యమన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన హరితహారం లక్ష్యం ఒక మొక్కను నాటడమో లేదంటే ఒక వనాన్ని సంరక్షించడమో కాదన్న కేటీఆర్, తెలంగాణలోని ప్రతీ మూలను పచ్చదనంతో నింపడమే అన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చూపిన పట్టుదలతో రాష్ట్రంలో పచ్చదనం 24% నుండి 33%కి పెరిగిందన్నారు. 19,472 గ్రామ పంచాయతీలు, 143 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో నర్సరీలు, ప్రకృతి వనాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిందని తెలిపారు. తమ ప్రభుత్వ కృషితో ఇవాళ తెలంగాణలో అటవీ విస్తీర్ణం 6.85 శాతం, చెట్ల విస్తీర్ణం 14.51 శాతం, పచ్చదనం 7.7 శాతం పెరిగిందన్నారు. మహత్తర ఆశయంతో కేసీఆర్ ప్రారంభించిన హరితహారం రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతాలకు కారణమవుతుందన్న నమ్మకం తనకు ఉందన్నారు కేటీఆర్.

# సంపాదకీయం

## నాణ్యత, నైపుణ్యాలు లేని చదువులేల?

పుస్తకాల బరువులు పెరుగుతున్నాయి. బట్టీచదువులతో జ్ఞానం విద్యార్థుల మస్తకాలను తాకడంలేదు. నేటి విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న హంగులు, ఆర్భాటాలు, ప్రచారాలు 'విగ్రహం పుష్టి- నైవేద్యం నష్టి' అనే సామెతను తలపిస్తున్నది. పిల్లల చదువులవలన తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోయశక్యం గాని విధంగా తయారైంది. చిన్న వయసు చదువుల పేరుతో నీరుగారిపోతున్నది. వ్యాపారంగా మారిన చదువుల వలన బాల్యం మొద్దుబారిపోతున్నది. నేటి చదువులు పుస్తకాలు మోయడానికి, బట్టీ పట్టి, ర్యాంకులు సాధించడానికే పరిమితం కావడం వలన ప్రతిభకు నిర్వచనం మారిపోయింది. ప్రపంచం విజ్ఞాన రంగంలో ఎంతో ముందుకు దూసుకుపోతున్నది. ఇతర గ్రహాలపై అన్వేషణ కొనసాగుతున్నది. భారతదేశం కూడా సూర్యచంద్రాదులపై పరిశోధనలు చేస్తున్నది. అంతరిక్షంలోను, అణు, సాంకేతిక రంగాల్లోను దేశం ముందుకు దూసుకుపోతుంటే, ఇంకా మన విద్యా వ్యవస్థలో పరిశోధనాత్మకతకు, సాంకేతికతకు తావివ్వకుండా కంఠస్థంతో విద్యార్థులు కాలం నెట్టుకురావడం దేనికి సంకేతం? కృత్రిమ మేధస్సు ఉగ్రరూతలూగిస్తూ ఉరకలేస్తుంటే, సాంఘిక మాధ్యమాలు వీక్షకులకు ఊపిరి సలపనీయడం లేదు. అంతరిక్షంలో అద్భుతాలు జరుగుతున్నాయి. స్పేస్‌వాక్ చేసి అంతరిక్షయానంలో ఎదురైన ఆటంకాలను అవలీలగా జయించి విజేతగా భూమికి అడుగిడిన సునీతా విలియమ్స్ సాహసాన్ని చూశాం. అంతరిక్షంలోకి అడుగిడిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు శుభాసీస్సులందించాం. విజ్ఞానం ఇంతగా వికసించి, గ్రహాంతరయానానికి దారులు వెదుకుతుంటే, ఇంకా మనం విద్యావ్యవస్థను మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకోలేక ఇబ్బందులుపడుతున్నాం. బట్టీ చదువులకు స్వస్తి చెప్పలేకపోతున్నాం. ఇంకా మార్కులు, ర్యాంకులంటూ మూస పద్ధతిలోనే పయనిస్తున్నాం. బండెడు పుస్తకాలను విద్యార్థులకు అంటగట్టి, ఫీజుల పేరుతో మోయలేని ఆర్థిక భారాన్ని తల్లిదండ్రులనెత్తిన పెట్టడం భావ్యమా? మారుతున్న కాలానికి అనుగుణంగా చదువుల్లో గుణాత్మకమైన మార్పురావాలి. విద్యార్థుల భవిష్యత్తుకోసం ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలి. విద్యాబోధనలో సులభమైన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వాటిని అందుకుని నాణ్యతా ప్రమాణాలగల విద్యను భావితరాలకు అందించాలి. విద్యార్థులకు ఉపాధ్యాయులకు మధ్య గల సంబంధం కేవలం తరగతి గదులకే పరిమితమయ్యే గురుశిష్యల సంబంధం మాత్రమే కారాదు. విజ్ఞానాన్ని ప్రపంచం నలుచెరగులా వ్యాపింప చేసి, అభివృద్ధికి ఆలంబనగా ఉండాలి. ఉపాధ్యాయులు నవప్రపంచ నిర్మాతలు. విద్యార్థులకు మార్గ నిర్దేశకులు. విశ్వానికి వెలుగురేఖలు ఉపాధ్యాయులు. అజ్ఞానమనే అంధకారంనుండి విజ్ఞానమనే వెలుగువైపు పయనింప చేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకే సాధ్యం. ప్రపంచ ప్రగతి సాధన ఉత్తమ విద్య ద్వారా మాత్రమే సాధ్యం. ఉత్తమ నాణ్యతా ప్రమాణాలను నెలకొల్పి, విద్యార్థుల్లో నైపుణ్యానికి ఉపాధ్యాయులు, విద్యావంతులు కృషి చేయాలి. కంఠస్థం చేయడం వలన కంఠశోష తప్ప ప్రయోజనం శూన్యం. దురదృష్టవశాత్తూ ఈనాటికీ ప్రపంచంలో చాలా మందికి విద్యావకాశాలు గగనకుసుమంలా మారాయి. కొన్నిదేశాల్లో స్త్రీలకు చదువుకునే స్వేచ్ఛ లేదు. మరికొన్ని దేశాల్లో కుటుంబాల ఆర్థిక స్తోమత సరిగా లేక, చదువుకునే అవకాశాలు మృగ్యమైపోతున్నాయి. బాలకార్మికులుగా, వీధిబాలల్లా మిగిలిపోతున్నారు. ఒకవైపు ఇలాంటి పరిస్థితులు తాండవిస్తుంటే మరొకవైపు నాణ్యత లేని విద్యవలన ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతున్నాయి. నైపుణ్యం లోపించిన చదువులవలన ప్రపంచ ప్రగతి సాధ్యం కాదు. ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంఉపాధ్యాయులు అంకితభావంతో కృషిచేసి, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి. విద్య ప్రాధాన్యతను పెంచే విధంగా సంస్కరణలు రావాలి. నిజమైన విద్యకోసం పాటుపడాలి. సాంకేతిక రంగాన్ని చెడిపోవడానికే వినియోగించుకునే ధోరణిలో మార్పురావాలి. వాస్తవ ప్రపంచానికి దూరంగా, రంగుల లోకంలో విహరిస్తూ పెనుభారంగా తయారైన యువత చాలా ప్రమాదకరం. ఊహల్లో తేలియాడే ప్రపంచానికై ఉగ్రరూతలూగుతున్న యువతను సంస్కరించాలి. తల్లిదండ్రుల దృక్పథంలో కూడా మార్పు రావాలి. తల్లిదండ్రులు ఒక స్థాయి వరకు తమ పిల్లలను తమ వద్దే పెరిగేటట్టు చూడాలి. బాహ్య ప్రపంచంలోని అనైతిక ధోరణులవలన కలిగే పర్యవసానాల గురించి తెలియచెప్పాలి. ఉపాధ్యాయులు కూడా తమ వృత్తి పట్ల అంకితభావం ప్రదర్శించాలి.

భావితరాలను మేధాశక్తి సుసంపన్నులు తయారు చేయడంలో వారిపట్ల గురుతరమైన బాధ్యత ఉంది. ఉపాధ్యాయుల ఆలోచనల్లోనే నిజమైన దేశనిర్మాణం ఆధారపడి ఉంది. విద్య అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. విద్య ద్వారా సాధించలేనిదంటూ ఏదీ లేదు. అలాంటి నాణ్యమైన విద్య దేశంలో ప్రతీ ఒక్కరికీ అందాలి. సక్రమమైన విద్యవలన విద్యావంతులు విభిన్నరంగాల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి దేశాభివృద్ధిని శిఖరాగ్ర భాగంలో నిలబెట్టగలరు. ప్రపంచగతిని మార్చగలరు. మనిషి మానసిక ఎదుగుదలకు, వ్యక్తిత్వ వికాసానికి విద్య అవసరం.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావాలి. విద్యార్థులను అన్నిరంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే మనం ఆశించిన నిజమైన దేశాభివృద్ధి, ప్రపంచాభివృద్ధి సాధ్యపడుతుంది. విద్యార్థులంతా చక్కని విద్యాసాధనతో విలువలతో కూడిన నవప్రపంచాన్ని సృష్టించాలి. వర్తమాన సమాజం తప్పటడుగులేస్తున్నది. తప్పటడుగుల దశలో పిల్లలను సరిదిద్దకపోవడమే ఇందుకు కారణం. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించాలంటే వారిలో విలువలను పెంపొందించాలి. 'సంపాదన కోసమే చదువు' అనే భ్రమను తొలగించాలి.

ఆహ్లాదకరమైన కుటుంబ వాతావరణంలో పిల్లలు పెరగాలి. కుటుంబ వాతావరణం సరిగా లేకపోతే బాలల భవితవ్యం ఆగమ్యగోచరమవుతుందన్న సత్యం గ్రహించాలి.

# జాతీయ పతాక రూపకర్త



భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే, భారత సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా, వివిధ దేశాల పర్యాటకునిగా, బహుముఖ ప్రజ్ఞ కలిగిన వెంకయ్యను భారతీయులంతా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం అనివార్యం. 1878 ఆగస్టు 2న కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లెలో, జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించుకొని, తన 19 వ ఏట ముంబై వెళ్లి సైన్యంలో చేరారు. మద్రాసులో ప్లేగు ఇనస్పెక్టరు శిక్షణ పూర్తి చేసి, కొంతకాలం బళ్లారిలో ప్లేగ్ ఇనస్పెక్టరుగా పనిచేసారు. అతని జ్ఞాన దాహం అంతులేనికి. శ్రీలంక వెళ్ళి కొలంబోలోని సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ ప్రత్యేక విషయంగా చదివి కేంబ్రిడ్జ్ సీనియర్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. కొంతకాలం రైల్వేలో గార్డుగా పనిచేసాడు. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి లాహోర్ లోని డి.ఎ.వి. కాలేజీలో చేరి, సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం సంపాదించారు. జపాన్ భాషలో అనర్గళంగా మాట్లాడే వెంకయ్య గారిని "జపాన్ వెంకయ్య" అని పిలిచేవారు. 1899 - 1902 మధ్య డచ్ సైన్యానికి వ్యతిరేకంగా, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. అక్కడే ఆయనకు స్వాతంత్రోద్యమ నిర్దేశకులు, భావిభారత జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. దక్షిణాఫ్రికాలో ఉండగా మహాత్మా గాంధీని కలిశారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన ఈ సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచింది. భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా మైకా, వజ్రాలపై ఆయన విస్తృత పరిశోధనలు జరిపారు. స్వదేశం వస్తూ అరేబియా, ఆఫ్ఘనిస్థాన్ లు చూచి వచ్చారు. గాంధీజీ పరిచయం అయిన నాటి నుండి జాతీయ జెండా ఎలా ఉండాలనే సమస్యనే తన అభిమాన విషయంగా పెట్టుకొని, దాని గురించి దేశంలో ప్రచారం ప్రారంభించారు. 1913 నుండి ప్రతి కాంగ్రెస్ సమావేశానికి హాజరై, నాయకులందరితోనూ జాతీయ పతాక రూపకల్పన గురించి చర్చలు జరిపారి.

1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. 1916 లో "నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్" పేరున 30 నమూనాలతో జాతీయ పుస్తక రచన గావించారు. ఈ గ్రంథానికి అప్పటి వైస్రాయ్ కార్యనిర్వాహక సభ్యుడైన కేంద్రమంత్రి సర్ బి.ఎన్.శర్మ ఉత్తేజకరమైన పీఠిక రాశారు. 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య తయారు చేసిన జాతీయ జెండానే ఎగుర వేశారు. 1919లో జలంధర్ వాస్తవ్యులైన "లాలా హన్స్ రాజ్" మన జాతీయ పతాకంపై రాట్నం చిహ్నముంటే బాగుంటుందని సూచించగా గాంధీజీ దాన్ని అంగీకరించారు. 1921లో అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలు బెజవాడలో జరిగాయి. గాంధీజీ వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు కలిగి, మధ్య రాట్నంగల ఒక జెండాను చిత్రించమని కోరారు. మహాత్ముడు సూచించిన ప్రకారంగానే, ఒక జెండాను సమకూర్చాడు వెంకయ్య. అనంతరం వచ్చిన ఆలోచనల మేరకు, సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన, తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయ పడగా, వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు. "మడత పెడితే పిడికెడే కానీ, కోటానుకోట్ల భారతీయుల ప్రియ వస్త్రం"గా "గాంధీజీ"చే, వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ పతాకం ప్రశంసా పాత్రమైంది. 1947, జూలై 22 వ తేదీన భారత రాజ్యాంగ సభలో నెహ్రూ జాతీయ జెండా గురించి ఒక తీర్మానం చేస్తూ, మునుపటి త్రివర్ణ జెండాలోని రాట్నాన్ని తీసేసి, దాని స్థానంలో అశోకుని ధర్మచక్రాన్ని చిహ్నంగా ఇమిడ్చారు. చిహ్నం మార్పు తప్పితే పింగళి వెంకయ్య రూపొందించిన జెండాకు నేటి జెండాకు తేడా ఏమీ లేదు. అశోకుని ధర్మచక్రం మన పూర్వ సంస్కృతికి సంకేతం. పింగళి వెంకయ్య 1906 నుంచి 1922 వరకు భారత జాతీయోద్యమం లోని వివిధ ఘట్టాలలో పాల్గొన్నారు. వందేమాతరం, హోమ్‌రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమంలాంటి ప్రసిద్ధ ఉద్యమాలలో ప్రధాన పాత్రధారిగా ఉన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఆయన బెంగుళూరు, మద్రాసు లలో "రైల్వే గార్డు"గా పనిచేశారు. ఆ తరువాత కొంత కాలము బళ్లారిలో "ప్లేగు అధికారి"గా ప్రభుత్వ ఉద్యోగము చేశారు. వెంకయ్యలో ఉన్న దేశభక్తి ఆయనను ఎంతో కాలము ఉద్యోగము చేయనివ్వలేదు. 1906 నుండి 1922 వరకు జాతీయోద్యమాలతో పాటు మునగాల పరగణా నడిగూడెంలో జమీందారు రాజా బహదూర్ నాయని రంగారావు కోరిక మేరకు, నడిగూడెంలో నివాసముండి, పత్తి మొక్కలలోని మేలు రకముల పరిశోధనలో వినియోగించారు. నడిగూడెంలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించాడు. ఈ పరిశోధనలలో "కంబోడియా పత్తి" అను ఒక ప్రత్యేక రకమైన పత్తి మీద విశేష కృషి చేశారు. ఆయన కృషిని ఆనాటి బ్రిటీషు ప్రభుత్వముకూడా గుర్తించడముతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరు వచ్చింది. తరువాత నెల్లూరు చేరి, 1924 నుండి 1944 వరకు అక్కడే ఉంటూ మైకా (అభ్రకం) గురించి పరిశోధన చేశారు. వజ్రకరూరు, హంపిలలో ఖనిజాలు, వజ్రాలు గురించి విశేషంగా పరిశోధనలు జరిపి ప్రపంచానికి తెలియని వజ్రపు తల్లిరాయి అనే గ్రంథం రాసి 1955లో దాన్ని ప్రచురించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత ప్రభుత్వం వెంకయ్యను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించింది. ఆ పదవిలో ఆయన 1960 వరకు పనిచేసారు. అయితే వెంకయ్య జీవిత చరమాంకం దయనీయ స్థితిలో ముగిసింది. 1960 లో భారత ప్రభుత్వం భూగర్భ ఖనిజాలు సంస్థ సలహాదారునిగా వెంకయ్యకు ఇచ్చే గౌరవ వేతనాన్ని సైతం నిలిపి వేసింది. వృద్ధాప్యంలో ఆర్థిక బాధలు ఆయనను చుట్టు ముట్టాయి. మిలటరీలో పని చేసినందుకు విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో, ఆయన గుడిసె వేసుకొని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. జీవితాంతం దేశం కొరకు, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వెంకయ్య చివరి రోజుల్లో తిండికి కూడా మొహం వాచి, నానా అగచాట్లు పడినట్లు ' త్రివేణి ' సంపాదకులు డా. భావరాజు నరసింహారావు పేర్కొన్నారు. అంతిమదశలో విజయవాడలో డా. కె.ఎల్.రావు, డా.టి.వి.ఎస్.చలపతిరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు మున్నగు పెద్దలు 1963 జనవరి 15న వెంకయ్యను సత్కరించి, కొంత నిధిని అందించారు. కన్నుమూసే ముందు ఆయన చివరి కోరికను వెల్లడిస్తూ " నా అంత్య దశ సమీపించింది. నేను చనిపోయిన తర్వాత త్రివర్ణ పతాకాన్ని నా భౌతిక కాయంపై కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకం తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి. ఇది నా తుది కోరిక " అన్నారు. ఆత్మాభిమానానికి మారుపేరైన వెంకయ్య, కడు పేదరికాన్ని అనుభవిస్తూ, 1963 జూలై 4న విజయవాడలో తుది శ్వాస వదిలారు. 1964 లో జూలైలో నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, వెంకయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించినా, విజయవాడ గాంధీ హాల్ నందు విగ్రహావిష్కరణ జరిగినా, భారతీయులు ఆచంద్ర తారార్కం గుర్తుంచు కోవలసిన పింగళి వెంకయ్యకు... రావలసిన గౌరవం రాకపోవడం నిజంగా బాధాకరం. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులో ట్యాంక్ బండ్ పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి ఆయన దర్శన భాగ్యం ప్రజలకు లభింపజేసి, కొంతలో కొంతైనా ప్రజలకు గుర్తుండేలా చేసింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...

### అమెరికా 249వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఇంగ్లాండ్ పాలనలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలు చేపట్టిన అమెరికన్ విప్లవ పోరాటం ఫలితంగా 04 జూలై 1776న స్వాతంత్ర్య పొంది స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవడం జరిగింది. ఈ మహాఘట్టాన్ని పురస్కరించుకొని 04/05 జూలై రోజున అమెరికాలోని 50 రాష్ట్రాలు సెలవు దినాన్ని పాటిస్తూ, 1812లో జరిగిన యుద్ధం అనంతరం "యూఎస్ ఇండిపెండెన్స్ డే" లేదా "అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం" ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. 1870 తర్వాత స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించబడింది. ఈ ఉత్సవాల్లో భాగంగా కవాతులు, వినోద కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, క్రీడలు, కుటుంబ కలయికలు, బాణాసంచా వెలుగులు, విహార యాత్రలు లాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొంటారు. 1776కు పూర్వం అమెరికాకు చెందిన 13 కాలనీలు బ్రిటీష్‌కు చెందిన కింగ్ జార్జ్-3 చక్రవర్తి పాలనలో ఉండేవి. అమెరికన్ల స్వాతంత్ర్య పోరాట ఫలితంగా 02 జూలై 1776న స్వాతంత్ర్య ప్రకటన చేసినప్పటికీ 04 జూలైన మాత్రమే సంతకాలు చేయడంతో అదే రోజున అమెరికన్లు తమ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

యూఎస్ జాతి పిత 'జార్జ్ వాషింగ్టన్:

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ చక్రవర్తి పాలనలో అమెరికన్లు దుర్భరమైన బానిస బతుకులు గడపడంతో జార్జ్ వాషింగ్టన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు జరగాలని చరిత్ర స్పష్టం చేస్తున్నది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత అమెరికన్లు తమదైన రాజ్యాంగంతో తొలి అధ్యక్షుడిగా 1789 - 97 మధ్య జార్జ్ వాషింగ్టన్ ఎంపిక కావడం, పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో జార్జ్ వాషింగ్టన్‌ను "అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతి పిత (ఫాదర్ ఆఫ్ యూఎస్)"గా గౌరవం ఇవ్వడం జరిగింది. తనకంటూ ఒక రాజ్యాంగం లేకుండానే 1776 నుంచి 1789 వరకు ఎనిమిది మంది అధ్యక్షులుగా సేవలు అందించినప్పటికీ 1987లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగ రచన కమిటీకి జార్జ్ వాషింగ్టన్ చైర్మన్‌గా వ్యవహరించి ప్రధాన భూమిక నిర్వహించారు. స్వాతంత్ర్యం పొందిన అమెరికాకు 47వ అధ్యక్షుడిగా నేడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద రీతుల్లో సేవలు అందిస్తున్నారు. జార్జ్ వాషింగ్టన్ ప్రభుత్వం 1792లో వైట్ హౌజ్ నిర్మాణం ప్రారంభించగా 1800లో జాన్ ఆడమ్స్ అధ్యక్షుడి కాలంలో పూర్తి కావడం, పాలనకు అందుబాటులోకి రావడం జరిగింది. నేడు 249వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న

అమెరికన్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేద్దాం.

# రాంచందర్ రావు నేతృత్వం బిజెపికు ఆశాజనకం

తెలంగాణ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ, భారతీయ జనతా పార్టీకి తగిన పునర్నిర్మాణం అత్యవసరమై ఉంది. బహుముఖ సమస్యలు, లోపాలు, విభేదాల మధ్య బీజేపీకి స్థిరతనిచ్చే నాయకత్వం కోసం అన్వేషణ కొనసాగింది. అటువంటి సమయంలో పార్టీకి నూతన అధ్యక్షుడిగా న్యాయవాది, రాజకీయ విశ్లేషకుడు, ఉద్యమ నేత ఎన్. రాంచందర్ రావు బాధ్యతలు చేపట్టడం ఒక ఆశాజనక పరిణామం. పౌరహక్కుల పరిరక్షణకు తన వృత్తి జీవితాన్ని అంకితం చేసిన ఆయన, ఇప్పుడు పార్టీ హక్కులను రక్షిస్తూ, క్యాడర్ చైతన్యాన్ని మేల్కొలిపే మార్గదర్శిగా మారే అవకాశముంది. రాంచందర్ రావు రాజకీయాల్లో నిబద్ధత, న్యాయబద్ధత, సంయమనం అనే మూల విలువలతో కొనసాగుతున్న నాయకుడు. ఆయన వృత్తి జీవితంలో న్యాయస్థానం వేదికగా న్యాయ పోరాటాలు చేసిన తీరు, ప్రజా సమస్యలపై తనదైన శైలిలో ప్రశ్నించిన తీరు, శాసన మండలిలో వాదనల్లో నిరూపించిన నైపుణ్యం... ఇవన్నీ ఆయన సామర్థ్యానికి నిదర్శనాలు. ఎలాంటి ప్రచారాలకీ, పదవులకీ గురి కాకుండా, స్వయంగా ఓ వృత్తిపరమైన, సేవా పూరితమైన వ్యాపకం ద్వారా రాజకీయ వేదికపైకి వచ్చిన ఆయనకి కలిగిన విశ్వసనీయత బీజేపీకి కొత్త శక్తిని సమకూర్చే అవకాశం ఉంది. రాష్ట్ర బీజేపీలో ముడిపడి ఉన్న వర్గీయ పోరాటాల నివారణ రాంచందర్ రావు ముందున్న తొలి సవాల్. పార్టీ కేంద్రానికి అత్యంత సన్నిహితంగా ఉన్న నేతల వర్గం, స్థానికంగా ప్రజల్లో మద్దతు గడించిన నేతల వర్గం మధ్య నెలకొన్న విభేదాలను సమర్థంగా సమతుల్యం చేయగల నేతగా ఆయనపై అంచనాలు ఏర్పడుతున్నాయి. ఎందుకంటే ఆయన ఎలాంటి వర్గానికీ వీరాభిమానిగా కాదు, బీజేపీ వ్యవస్థానికే శ్రద్ధగల వాడిగా గుర్తింపు పొందారు. ఎవరి అభిప్రాయాన్నయినా వినగల ఓర్పు, ఒత్తిళ్ల లోను సంయమనం పాటించే చిత్తశుద్ధి ఆయన ప్రత్యేకత. ఈ లక్షణాలు వర్గ పోరును పరిష్కరించడంలో ఆయన్ని దృఢమైన మధ్యవర్తిగా నిలబెట్ట గలవు. గత ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో టికెట్లు లభించక, ప్రచారంలో ప్రాధాన్యత రాకపోయిన నాయకులు, కార్యకర్తలు – వీరిలో ఏర్పడిన అసంతృప్తిని పరిష్కరించాల్సిన బాధ్యత కొత్త నాయకత్వంపై ఉంది. రాంచందర్ రావు వీరిని కలిసే దశలో నేరుగా స్పందించే వ్యక్తి. ఆయనకు బాధితుల బాధను అర్థం చేసుకునే సామర్థ్యమే కాదు, సంస్థాగత పరిష్కారాలను క్రమబద్ధంగా అమలు చేసే పరిపక్వత కూడా ఉంది. అందువల్ల అసంతృప్తులను మాటలతో కాదు, చర్యలతో చల్లార్చగల నేతగా ఆయన నుంచి పార్టీ కార్యకర్తలు ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ బీజేపీలో పెద్ద సమస్యగా మారిన అంశం క్యాడర్ నిరాసక్తత. కార్యకర్తలు అనిశ్చిత స్థితిలో ఉండడం, విభిన్న వర్గాలకు దూరంగా మారడం, ఆధునిక ప్రచార పద్ధతులకు లోబడిన కొందరు నాయకుల చేతుల్లో పార్టీ పరిమిత మవడం వల్ల గ్రాస్ రూట్ స్థాయిలో అసంతృప్తి తలెత్తింది. రాంచందర్ రావు నియోజకవర్గ స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు, బూత్ స్థాయిలో తిరిగి పనిచేసే స్వచ్ఛత కలిగిన గుణాత్మక కార్యాచరణను రూపొందించే సామర్థ్యం కలిగిన నేత. ఆయన వ్యక్తిగత జీవితంలో ఉండే క్రమశిక్షణను పార్టీలోకి చేర్చి, ఒక చక్కటి చైతన్యాన్ని నింపగలరన్న విశ్వాసం కార్యకర్తల్లో ఉంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలు – ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి చేరిన వారితో సామరస్యం నెలకొల్పడమన్నదీ ఓ సవాల్. పాతవారిని నిర్లక్ష్యం చేయకుండా, కొత్తవారిని ఆసక్తితో కలుపుకుంటూ... ఈ రెండు వర్గాల మధ్య సంభాషణకు వేదికగా ఉండగల నాయకుడు రాంచందర్ రావు. ఆయన మాట్లాడే తీరులో పొలిటికల్ శబ్దం కన్నా, సామరస్యాన్ని సూచించే సున్నిత భాష ఉంటుంది. అలాంటి చతురత రాజకీయాల్లో కొద్దిమందికే సాధ్యం. తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నప్పటికీ, బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడలేక. పోవడంలో ప్రధాన కారణం – రాజకీయ దూకుడు లేకపోవడమే. ఈ స్థితిని మారుస్తూ, నిరుద్యోగం, విద్యా, వ్యవసాయ సమస్యలపై బలమైన ఉద్యమాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాంచందర్ రావుపైనే ఉంది. ఆయన గతంలో న్యాయ వేదికలపై చేసిన ఉద్యమాలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్యమంలో పాల్గొన్న తీరు ఇప్పుడు బీజేపీ ఉద్యమాల్లో ప్రత్యక్షించాల్సిన మార్గాన్ని సూచిస్తాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పార్టీకి ఇప్పుడే వ్యూహాత్మక ప్రణాళిక అవసరం. బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ, సోషల్ మీడియా ప్రచార వ్యూహాలు, సామాజిక వర్గాల తత్వాల అర్థం, వాటిపై అవగాహన కలిగిన ప్రణాళికలు... ఇవన్నీ రాంచందర్ రావు వంటి పరిణతితో కూడిన నాయకుడి చేతిలో రూపొందితేనే విజయవంత మవుతాయి. రాంచందర్ రావు న్యాయవాది కాబట్టి, విశ్లేషణాత్మకంగా ఆలోచించే శైలి ఆయన రాజకీయ నిర్ణయాలకు కూడ అన్వయించ గలదు. పోటీదారుల గౌరవాన్ని నిలుపుతూ, వారిని సమర్థవంతంగా ఉపయోగించుకునే విధానాన్ని అమలు చేయగల నాయకుడిగా రాంచందర్ రావు వ్యవహరించ గలరన్న నమ్మకం ఉంది. పార్టీలో పోటీ తత్వాన్ని అంతరంగిక విభేదంగా కాక, బలంగా మార్చే శక్తిని ఆయన దృక్పథం కలిగించి చూపగలదు. ఎవరి వైపు మొగ్గు చూపక, పార్టీ ప్రయోజనాలకే పెద్దపీట వేసే నైతిక స్థైర్యం ఆయన వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. రాంచందర్ రావు కు గల ప్లస్ పాయింట్స్...ఆయన తక్కువ గొడవలతో, ఎక్కువ ప్రభావాన్ని చూపగల నాయకుడు. వాదనకు పదును, వ్యవహారానికి సంయమనం కలగలిపిన నాయకుడు. వర్గీయ సర్దుబాట్లకు అనువైన వ్యక్తిత్వం. న్యాయవాది శైలి ద్వారా వ్యవస్థాపిత రాజకీయం. ఢిల్లీ మద్దతుతో పాటు, రాష్ట్ర క్యాడర్‌కు అవగాహన ఉన్న వ్యక్తి. దూకుడు రాజకీయం కాకుండా, దృఢమైన వ్యవస్థాపక దిశలో పార్టీని నడిపించే శక్తి. ఇవన్నీ సమీక్షిస్తే, బీజేపీకి రాంచందర్ రావు నాయకత్వం ఒక వ్యూహాత్మక వనరుగా మారవచ్చునన్న అంచనాలు కొట్టిపారేయ లేనివి. పార్టీకి నూతన దిశ, క్యాడర్‌కి ప్రేరణ, ప్రజల్లో విశ్వాసం, రాజకీయ ప్రత్యామ్నాయంగా నిలవగల సామర్థ్యం – ఈ నాలుగు అంశాల సమ్మిళితి ఈ నాయకుడిలో కనిపిస్తుంది. ఈ సందర్భంగా బీజేపీ తన గమనాన్ని క్రమబద్ధత, క్రమశిక్షణ, ప్రజాసమస్యల పట్ల స్పందనలతో నింపుకుని ముందుకు నడిచే అవకాశాన్ని చేజార్చుకోకూడదు. నాయకత్వ మార్పు అపహాస్యం కాకూడదు. రాంచందర్ రావుతో ఆ అవకాశం ఇప్పుడు బీజేపీ ముందుంది. ఆ అవకాశాన్ని ఎంతవరకు వినియోగించు కుంటుందో? ఏ మేరకు సఫలీకృతం అవుతుందో! వేచి చూడాలి.

# యుగ పురుషుడు వివేకానందుడు

భారతదేశ సంస్కృతిని, ఆధ్యాత్మిక చింతనను, విదేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద. ఉపన్యాసాల ద్వారా భారత యోగ, వేదాంత శాస్త్రాలను ఖండాంతరాలు దాటించిన వ్యక్తి ఆయన. అమెరికాలోని చికాగోలో, ఇంగ్లాండులో ఆనాడు చేసిన ఆయన ప్రసంగాలను భారత సమాజం గర్వంగా గొప్పగా నేటికీ గుర్తు చేసుకుంటునే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో అడుగు పెట్టిన తొలి హిందూ సన్యాసి కూడా వివేకానందనే కావడం విశేషం. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం'...'లేవండి..మేల్కొండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి' వంటి వివేకానంద సూక్తులు ఇప్పటికీ ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన వివేకానందుని వ్యక్తిత్వాన్ని ఆయన జయంతి సందర్భంగా భారతీయులు ఏటా స్మరించుకుంటున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ భారత ప్రభుత్వం వివేకానంద జన్మదినాన్ని 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుతోంది. స్వామి వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12 తేదీన మకర సంక్రాతి రోజున ఒక బెంగాలీ కుటుంబంలో కలకత్తాలో జన్మించారు. జులై 4, 1902న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. చిన్న వయసులోనే ఎన్నో పాశ్చాత్య , తత్వ శాస్త్ర గ్రంథాలు, నవలలు, చరిత్రలు, అన్ని మతాల గ్రంథాలు, ఇలా ఎన్నో చదివే వారు. జీవించింది కేవలం 39 సంవత్సరాలే కానీ శతాబ్దాల పాటు చెరిగిపోని ముద్ర వేశారు. తూర్పు మరియు పశ్చిమ సంస్కృతుల మధ్య ఒక వారధి నిర్మించారు. మన దేశానికి ప్రపంచ దేశాల్లో గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన జీవితం మొత్తం మీద తనకంటూ చేసుకున్నది, దాచుకున్నది ఏది లేదు. ఆయన విదేశాలలో ఎలాంటి ముద్ర వేశారంటే ఇప్పటికి అమెరికాలో ఒక వీధికి "స్వామి వివేకానంద స్ట్రీట్" అని పేరు పెట్టుకున్నారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. మహాత్మా గాంధీ , సుభాష్ చంద్రబోస్, లోకమాన్య తిలక్, బిపిన్ చంద్ర పాల్ వంటి ఎంతోమంది స్వాతంత్ర యోధులకు వివేకానందుడే ఆదర్శం. . "మీరు ఇండియా గురించి తెలుసు కోవాలను కుంటే స్వామి వివేకానంద గురించి చదవండి" అన్నారు విశ్వకవి టాగోర్. ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి తద్వారా భారతీయ యువతకు దిశా నిర్దేశం చేశారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని, యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనేవారు. అందుకే "డబ్బు లేని వాడు కాదు... జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేదవాడు" అనే వారు వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా "గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతకమని" దేనికి భయపడవద్దని చెపుతుండే వారు. "ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూపాన్నే మార్చేస్తాను" అని స్వామీజీ తరచూ అనేవారు. మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను "నేషనల్ యూత్ డే" గా జరుపు కుంటారు. ఆయన తన ప్రసంగాలతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు. వ్యక్తి విజయవంతమైన జీవితం గడపడానికి కొన్ని సూత్రాలను వివేకానందుడు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనలతో వ్యక్తిలో నిస్వార్థమైన వైఖరులు ఏర్పడతాయని వివరించారు. సుఖదు:ఖాలు నాణేనికి రెండు పార్శ్వాలు లాంటివి. కాబట్టి సానుకూల దృక్పథంతో ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చుంటే సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. విశ్వంలో ప్రతి అంశం తార్కిక ఆలోచనలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి తార్కిక ఆలోచనలతో ప్రపంచాన్ని అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలి. ఎవరి సామర్థ్యంపై వారికి నమ్మకం ఉండాలి.

# బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి 10వేలు ఆర్థిక సహాయం అందించిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి జూలై 3 (వుదయం ప్రతినిధి):మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఐత రవి తల్లి ఎల్లమ్మ ఈ రోజు ఇంట్లో జరిపడి కాలుకు గాయమై హన్మకొండ గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సందర్భంగా, శ్రీనివాస్ రెడ్డి వారిని హాస్పిటల్ లో పరామర్శించి, డాక్టర్ కాలిప్రసాద్ తో మాట్లాడి మేరుగైన వైద్యం చేయాలి అని కోరి, ఫౌండేషన్ఆధ్వర్యంలో 10 వేలు రూపాయలు ఆర్థిక సహాయం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునవత్ నర్సింహా నాయక్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు కర్ర రవీందర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,ఐత రామ్ చందర్, సుధాకర్, పోగులకొండ వేణు, ఎండీ యూసఫ్, సంకినేని ఎల్లస్వామి, చిలువేరు సాయి గౌడ్, ఉబ్బని సింహాద్రి, పెద్దగోని జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో సమస్యలుంటే తక్షణమే పరిష్కరించాలి

**-ఎమ్మెల్యే జారే,అధికారులతో కలిసి మంత్రి తుమ్మల సమీక్ష**



జులై 3 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): అశ్వారావుపేట నియోజవర్గం అందం గా ఉండాలని,సమస్యలు ఉంటే ఎమ్మెల్యే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్ళాలని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.గురువారం గండుగులపల్లి లోని తన స్వగృహంలో అధికారులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి సమీక్ష నిర్వహించారు. సమీక్ష లో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, చెరువులు,ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న అశ్వారావుపేట ను తెలంగాణ గుమ్మంగా తీర్చి దిద్దాలని తుమ్మల కోరారు. అశ్వారావుపేట,దమ్మపేట తహసీల్దార్లు,విధ్యుత్, ఇరిగేషన్,ఆర్ అండ్ బి,అటవీ, పంచాయతీ రాజ్,పోలీస్ శాఖ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధ్యక్షులుఆలపాటి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుత రావు,కాసాని నాగ ప్రసాద్,కె వి సత్యనారాయణ, మన్యం అప్పారావు,ఎర్ర వసంతరావు,మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులను నియంత్రించాలి.

**-ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్.**



జులై 3 భూపాలపల్లి వుదయం ప్రతినిధి.రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భూపాలపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని చట్టాన్ని అమలు పూర్తిగా అమలు చేయకపోవడంతో ప్రైవేట్ స్కూలు యజమానాలు యజమానులు మితిమీరిన ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతేకాక అధిక ఫీజులను అరికట్టాలని, స్కూల్లో యూనిఫామ్స్ బుక్స్ అత్యధిక ధరలకు అమ్మకుండా చూడాలన్నారు. అదేవిధంగా ప్రైవేట్ స్కూళ్లలో సరియైన వసతులు లేవని, వాటిని గుర్తించి బెస్ట్ అవలేబుల్ స్కీం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. అదేవిధంగా బెస్ట్ అవలేబుల్ స్కీం పిల్లలకు అనేక రకాల ఇబ్బందులు ఉన్నాయని వాటిని అరికట్టాలన్నారు. ఈ విషయంలోడీఈఓ పూర్తి పర్యవేక్షణ చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని డిమాండ్ చేస్తున్నాం. అదే కాకుండా ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వమే ఉచిత బస్ సౌకర్యం కల్పించాలి స్కూల్ బస్సు పిల్లలకు గనుక వేస్తే వాళ్లు తప్పకుండా డ్రాప్స్ కాకుండా పిల్లలందరూ తూర్పు వస్తారు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని గుర్తు చేశారు. ఇక సాంఘిక సంక్షేమ గురుకులాలలో అనేక రకమైన సమస్యలు ఉన్నాయి మరి గౌల్దొడ్డి లో అత్యధిక ప్రతిభ కనబరిచే అక్కడ బైపీసీ గ్రూపు వాళ్ళు లేక వాళ్లకు అనేక ఇబ్బందులు పడుతున్నారు 60 మంది స్టూడెంట్స్ దాన్ని కూడా ప్రభుత్వమే పరిశీలించాలి దీని మీద రేవంత్ రెడ్డి కూడా స్పందించాలి ఖచ్చితంగా నీటు, ఐఐటి కోచింగ్ తప్పకుండా ఇవ్వాలి. విద్యార్థులకు ఇదంతా చేయాలంటే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేదని విద్యాశాఖ మంత్రి పదవీ తన దగ్గరే ఉంచుకున్నాడని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియంచాలని కేటాయించాలని అన్నారు. అంతేకాక విద్య సమస్యలు పరిష్కరించని పక్షంలో రాబోయే రోజుల్లో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా రాస్తా రోకో చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిని గౌలిదొడ్డి గురుకుల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చెందుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి బొజ్జపల్లి మహర్షి, లాపాక అరబిందో, శనిగరపు గణేష్ బోయిని ప్రసాద్ లాపాక శేషి పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**-బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ఆర్ రెడ్డి**



నారాయణపేట టౌన్ జూలై 03(వుదయం ప్రతినిధి) స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని నారాయణపేట భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి అన్నారు. నారాయణపేట నియోజకవర్గం దామరగిద్ద మండలంలోని గడిమున్కన్ పల్లి లో మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులను కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూఎక్కడ చూసినా బిఆర్ఎస్ చేసిన 10 సంవత్సరాల అభివృద్ధి కనిపిస్తుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటివరకు చేసింది ఏమీలేదు అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలలో కోతలు ఎగవేతలు తప్ప చేసింది ఇచ్చింది శూన్యం అన్నారు. ప్రజలు కాంగ్రెస్ కు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తగిన బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే లబ్ది కానీ ప్రజలకు ఏమీ లేదు అని అన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ ధైర్యంగా మీ ఊర్లోనే ఉండి ప్రజలలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూలు జల్లుతూ విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయు లు



వెల్దండ జులై 3 (వు దయం ప్రతినిధి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థిని లకు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వినూత్న రీతిలో పూలు జల్లుతూ స్వాగతం పలికారు అనంతరం విద్యార్థినిలచేత సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషితో పాఠశాలలో గతంలో కంటే 20 మంది విద్యార్థులను చేర్పించామని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ను తీర్చిదిద్దుతామని లక్ష్యంతో పాఠశాల లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా దాతల సహకారంతో అభివృద్ధి పరుస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి, మురళి తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# కామ్రేడ్ యాదగిరి యుగేందర్ త్యాగం మరువలేనిది




కొత్తగూడ జులై 03(వుదయం ప్రతినిధి ): అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కమిటీ సభ్యులు కామ్రేడ్ యాదగిరి యుగేందర్ అకాల మృతి పార్టీకి, పాకాల కొత్తగూడ ఉద్యమానికి తీరనిలోటు అని సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. ఇటీవలే అనారోగ్యంతో మరణించిన సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కమిటీ సభ్యులు యాదగిరి యుగంధర్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి, జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పాఖాల కొత్తగూడ కేంద్రంలో విప్లవ కార్యకర్తగా కొనసాగుతున్న కామ్రేడ్ యుగేందర్ అనేక ఆటుపోట్లను నిర్భంధాన్ని ఎదుర్కొన్నాడని అన్నారు. ఉద్యమ నాయకత్వం ఎడల ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించే కామ్రేడ్ యుగేందర్ మరణం పార్టీకి, పాఖాల కొత్తగూడ వుద్యమానికి తీరని లోటని ఆయనకు పార్టీ డివిజన్ కమిటీ తరపున విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని అన్నారు. కామ్రేడ్ యుగేందర్ ఆశయా సాధనకై ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఆడబిడ్డను అక్కున చేర్చుకుని అభయాస్తం అందించిన క్రిష్ణార్జునులు.

**-ఎమ్ పీ. రఘురాం రెడ్డి**
**-మంత్రి. పొంగులేటి. శ్రీనివాసరెడ్డి**



పాలేరు జులై 3 వుదయం ప్రతినిధి కూసుమంచి మండలం. కూసుమంచి మండలంలోని ధర్మాతండాలో మంచం మీద అచేతన స్థితిలో ఉన్న పరశు రాం కూతురు సింధు ఆరోగ్య పరిస్థితి గురించి సింధు తల్లి లలితను అడిగి తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా ధర్మతండాలో ఇటీవల మృతి చెందిన పరుశరామ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పరశు రాం కుమార్తె ఆరోగ్య పరిస్థితిని అతని భార్య లలితను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ముందు లలిత కన్నీటి పర్యాంతమై తన బాధను చెప్పుకున్నది. వెంటనే మంత్రి పొంగులేటి స్పందించి ఎంపీ రఘురాం రెడ్డి, తాను కలిసి స్వయంగా హైదరాబాద్ హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ల తో మాట్లాడి మీ కూతురుకి వైద్యం చేపిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాక ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ బిల్లులన్ని మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. అధైర్య పడకు అక్కా నేను అండగా ఉంటానని మీ కుటుంబ భాద్యత మేము చూసుకుంటా మని హామీ ఇచ్చారు.

# టీపీసీసీ నాయకులను కలిసిన డాక్టర్. మడికొండ శ్రీను.



పరకాల జులై 3 (వుదయం ప్రతినిధి): జై బాపూ, జై భీమ్, జై సం విధాన్ కార్యక్రమం వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి భాద్యులు పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏమ్మెల్యే క్యాంపు ఆఫీసులో జరిగిన ప్రత్యేక సమావేశంకు ముఖ్య అతిధులు గా విచ్చేసిన తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డిని మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మోత్కూరి ధర్మారావు గార్లను మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు డాక్టర్. మడికొండ శ్రీను.

# విద్యార్థులకు ఉచిత ల్యాప్టాప్ ల పంపిణీ

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి**



వెల్దండ జులై 3 (వు దయం ప్రతినిధి) కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (Girls) పాఠశాలకు తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(TASK) మరియు ఐక్యత ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా(ఎనిమిది)ల్యాప్టాప్ ల సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గురువారం విద్యార్థులకు అందజేశారు ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ మారుతున్న డిజిటల్ ప్రపంచంతో పోటీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా సన్నద్ధం కావాలని,వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించి,వారిలోని ప్రతిభను ప్రోత్సహించి,వారిలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి తన వంతు ప్రయత్నంగా ల్యాప్టాప్ లను అందజేస్తున్నాని,డిజిటల్ యుగంలో విద్యార్థులు మరింత సమగ్రమైన,మెరుగైన విద్యను పొందడానికి డిజిటల్ & కంప్యూటర్ తరగతులు సహాయపడుతాయని,విద్యార్థులు కంప్యూటర్ కోడింగ్ లాంటి తదితర కొత్త విషయాలపై పాఠశాల దశలోనే అవగాహన కల్పించాలని,కార్పొరేట్ విద్యాలయాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ముందుకు సాగాలని తదనుగుణంగా తన వంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. మా పాఠశాలకు ఎలాంటి సహాయం అడిగిన వెంటనే సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్పందించి, సహాయ సహకారాలు అందిస్తున్నారని,గతంలో విద్యార్తులకు వాష్ రూమ్స్ విషయంపై స్పందించి వెంటనే ఒక లక్ష రూపాయలతో వాటికి మరమత్తులు చేయించారని,అలాగే ఈరోజు మా విద్యార్థులు అడిగిన వెంటనే ఉచితంగా ల్యాప్టాప్ లను అందించి అన్ని విధాలుగా మా పాఠశాలను సహాయ,సహకారాలు అందిస్తూ మా విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నారని,వారికి మా పాఠశాల ఉపాధ్యాయుల బృందం మరియు విద్యార్థులు తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ రత్నం, ఉపాధ్యాయులు మురళితో పాటు సీనియర్ నాయకులు దశరథ్ నాయక్,లాలూ నాయక్, నర్సింగ్,రమేష్,రఘు,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు కొండల్ యాదవ్,రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తుల్ని త్వరగా గుర్తించి వెంటనే చికిత్స అందించాలి

**-ప్రతి ఒక్కరికి అభాకార్డులను క్రియేట్ చేయాలి**
**-సీజనల్ వ్యాధుల నివారణ కు ప్రజలను అప్రమత్తం చేయాలి**
**-జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కె.వి. స్వరాజ్యలక్ష్మి**



నాగర్ కర్నూల్ జూలై 03 (వుదయం ప్రతినిధి) అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులకు కళ్ళే ఎక్స్రే పరీక్షలు నిర్వహించి గుర్తించిన క్షయ వ్యాధిగ్రస్తులకు వెంటనే చికిత్స అందించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కె వి స్వరాజ్యలక్ష్మి పర్యవేక్షణ సిబ్బందికి సూచించారు. గురువారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ రేటులోని సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షయ వ్యాధి అనుమానితులను, పొగ మరియు మద్యపానం చేసే వారిని, తక్కువ బరువు ఉన్న వారిని, ఇంతకుముందు క్షయ వ్యాధి చికిత్స తీసుకున్న కుటుంబ సభ్యులను గ్రామాలలో నిర్వహించే ఆరోగ్య క్యాంపులకు తరలించి కళ్ళే, ఎక్స్ రే పరీక్షలు నిర్వహించి వెంటనే క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స ప్రారంభించాలని డి ఎం హెచ్ ఓ ., పర్యవేక్షణ సిబ్బందికి సూచించారు. గుర్తించిన క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతినెల పోషకాహార కిట్ ను అందజేయాలని, సంపూర్ణ చికిత్స తీసుకునే విధంగా క్షేత్ర సాయి సిబ్బంది ఫాలో అప్ చేయాలని తెలియజేశారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికి అభకార్డ్(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) లను జనరేట్ చేయాలని, అబాకార్డు ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే దోమ కాటు వ్యాధి లేని డెంగ్యూ, చికున్ గున్య, మలేరియా వ్యాధుల నివారణ చర్యల గురించి , ప్రతి శుక్రవారం ప్రజలందరూ వారి ఇంటిలో డ్రై డే పొడి దినం పాటించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలి. ఆరు బయట నీరు నిలవకుండా, దోమలు పెరగకుండా గ్రామపంచాయతీ సెక్రటరీ గారి సహకారం తీసుకోవాలి. గత సంవత్సరం డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించాలని , ఇతర శాఖల సహకారం తీసుకోవాలని తెలియజేశారు. గర్భం దాల్చిన వారందరిని 12 వారాలు లోపు నమోదు చేసుకోవాలని, ముఖ్యంగా గర్భవతులలో రక్తహీనతను అరికట్టాలని, తప్పనిసరిగా తాలూకా మరియు జిల్లా కేంద్ర ఆసుపత్రులలో ఉన్న గైనకాలజిస్ట్ చే పరీక్షించాలని, హెల్ప్ డెస్క్ సహకారం తీసుకోవాలని పరిరక్షణ సిబ్బందికి డి ఎం హెచ్ ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవికుమార్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డిపిఓ రేనయ్య, ఏపీవోలు ఆర్ శ్రీను, విజయ్ కుమార్, నిరంజన్, మినహాజ్, మంగమ్మ, ఏ ఎస్ ఓ శివ, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పంటల భీమా అమలు చేసి రైతును రక్షించాలి.

**ఆర్డీవో కు వినతి పత్రం అందజేసిన వరికేల కిషన్ రావు.**



పరకాల జులై 3 (వుదయం ప్రతినిధి): రైతుల రక్షణ కొరకు పంటల బీమా అమలు చేసి వారి భద్రతకు తోడ్పడాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రోజున రైతులతో కలిసి పరకాల ఆర్డిఓ కే. నారాయణ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ పంటల సీజన్ ప్రారంభమైన ఇంతవరకు పంటల బీమా అమలు లేక రైతులు తీవ్ర నష్టపోతున్నారని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే రైతులు అప్పులు తీర్చలేక, యజమానికి కౌలు చెల్లించలేక, తదుపరి పంటలకు పెట్టుబడి లేకుండా, కుటుంబ ఖర్చులకు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒకసారి పంట నష్టపోయిన రైతు తిరిగి స్థిర పడటానికి మూడు నాలుగు వంటకాలాల సమయం పడుతుందని, అలాంటి పరిస్థితుల్లో పంటల బీమా రైతుకు ఒక రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పంట రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో రైతులకు మంచి సంకేతాలు పంపిందని, అదే స్ఫూర్తితో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరి పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చౌల రామారావు, రవీందర్ రఘు కానూరు వీరస్వామి రైతులు పాల్గొన్నారు.

# నేత్రాలు దానం చేసిన కందుకూరి తిరుపతి.



బెల్లంపల్లి, జులై3 (వుదయం ప్రతినిధి) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీలో ఓ ఇంటి పైకప్పు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి కందుకూరి తిరుపతి అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి, తన కుటుంబ సభ్యుల అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తన నేత్రాలు దానం చేసిన కందుకూరి తిరుపతి కుటుంబ సభ్యులు.

# హైదరాబాద్ లో జరుగుచున్న కాంగ్రెస్ పార్టీ హిరంగ సభను జయప్రదం చేయండి.

**-ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు. టి.కృష్ణ ముదిరాజ్. కాకరవాయి.**



పాలేరు జులై 3 (వుదయం ప్రతినిధి):తిరుమలాయపాలెం మండలం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు టి. కృష్ణా గురువారం మీడియా తో మాట్లాడుతూ రాజ్యాంగ ఆవశ్యకతను మారుమూల గ్రామాల్లోకి చేరవేయడమే లక్ష్యంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు.పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ ల పై బి ఆర్ ఎస్ చేసే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని సెంటిమెంట్ తో మరోమారు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు.దేశంలో ఎక్కడ లేని విధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు మరియు అభివృధి పనులు పరుగులు పెడుతున్నాయని, త్వరితగతిన అమలు అవుతున్నాయని నేడు 4 వ తేదీ శుక్రవారం, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అనే కార్యక్రమం ద్వారా ఈ దేశానికి ఒక గొప్ప సందేశాన్ని ఇవ్వబోతున్నామని దాన్లో భాగంగానే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హైదరాబాద్ లో పర్యటించనున్నారని తెలిపారు . తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు,ఖమ్మం ఎం పి. రామసహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి , మరియు ఖమ్మం జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి పార్టీ అధ్యక్షులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు సభకు హాజరై విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు తవడబోయిన.కృష్ణ ముదిరాజ్ ఒక ప్రకటన లో తెలిపారు.

# ఖర్గే సభను విజయవంతం చేయాలి.

**-నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్.**



పరకాల జులై 3 (వుదయం ప్రతినిధి):పరకాల నియోజకవర్గం అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానూసారం ఈ నెల 4 వ తేదీన హైదరాబాద్ లోని ఎల్ బి స్టేడియంలో నిర్వహించబోయే గ్రామా కాంగ్రెస్ అధ్యకుల సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే విచేస్తున్న సందర్భంగా సభకు నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్ని గ్రామాల అధ్యక్షులు బూత్ సభ్యులు క్రియశిలక కార్యకర్తలు ప్రజలు భారీగా తరలిరావాలని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్ మండల ప్రధానకార్యదర్శి డా.మలహాల్ రావు అన్నారు, పరకాల పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మండల సమన్వయ కమిటీ సమావేశం లో పాల్గొన్న అనంతరం..ఈ సందర్బంగా అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని ఎల్ బి స్టేడియంలో మధ్యాహ్నం 3:00గంటలకు సభ ప్రారంభం అవుతుందన్నారు,ఉదయం 9:00 గంటలకు నడికూడ మండలం బస్సు స్టాండ్ నుంచి నాయకులు,కార్యకర్తలు చేరుకోవాలన్నారు, భారీ ఎత్తున్న వాహనాల్లో హైదరాబాద్ ఎల్ బి స్టేడియానికి తరలుదామన్నారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకు వివరించాలని సమయం తక్కువగా ఉన్నందున్న స్వచ్చందగా గ్రామా శాఖ అధ్యక్షులు,బూత్ స్థాయి సభ్యులు,క్రియాశీలక కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని,ఈ మహాసభను ఘన విజయంగా మార్చేందుకు మనమందరం సమిష్టగా కృషి చేద్దాం అన్నారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు పెద్దబోయిన రవీందర్ యాదవ్,పర్నెం మల్లారెడ్డి,పర్నెం తిరుపతి రెడ్డి,గోల్కొండ సాధనందం,చాడ తిరుపతి రెడ్డి,పాడి ప్రతాప్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ కరుణకర్ మరియు తదితరులు పాల్గొన్నారు...

# ఎస్సీ ఎస్టీ కేసులో బాధితులకు నష్టపరిహారం అందించాలి నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



నారాయణపేట టౌన్ జూలై 03(వుదయం ప్రతినిధి) ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం త్వరగా అందించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్ గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి బాధితులకు నష్టపరిహారం బడ్జెట్ వచ్చిన వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రతీ మూడు నెలలకోసారి జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గత నెల 11 న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కీ వెంకటయ్య అధ్యక్షతన స్థానికంగా జరిగిన సమావేశంలో సూచించిన అంశాలను అందరూ పాటించాలన్నారు. ప్రతి నెలా చివరి సోమవారం గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమస్య ఉన్నప్పుడు వెంటనే అధికారులు స్పందించాలని ఆమె తెలిపారు. కాగా అంతకుముందు సమావేశంలో డిఎస్పీ నల్లపు లింగయ్య 2023 నుంచి 2025 వరకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలను వెల్లడించారు. సీ సెక్షన్ అధికారిని మాట్లాడుతూ 2023 లో నమోదైన 32 కేసులకు గాను 16 కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించడం జరిగిందని, 2024 లో నమోదైన 34 కేసుల్లో ఒక కేసుకు మాత్రమే నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, 2025 లో ఇప్పటి వరకు నమోదైన 10 కేసులలో బాధితులకు బడ్జెట్ లేని కారణంగా నష్టపరిహారం ఇంకా చెల్లింపు జరగలేదని తెలిపారు. చివరగా షెడ్యూల్ కులాలు, తెగల అభివృద్ధి శాఖ అధికారి ఉమావతి మాట్లాడుతూ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ లు ఎక్కడా లేరని వివిధ శాఖల అధికారుల సర్వే ఆధారంగా కేంద్రానికి నివేదిక పంపించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ ఖలీల్,డిపిఓ బిక్షపతి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జనార్ధన్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, స్థానిక తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# మడుపల్లికి చెందిన పారా అంజలి అనుమానస్పద మృతి



మధిర జూలై 3 (వుదయం ప్రతినిధి) మధిర మున్సిపాలిటీ పరిధిలో మడుపల్లి గ్రామానికి చెందిన పారా కిషోర్ -లక్ష్మి దంపతుల కుమార్తె అంజలి 9-9-2024 న సిరిపురం గ్రామానికి చెందిన తడికమల్ల. రాము అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వివాహం చేసుకున్నప్పటి నుండి మానసికంగా శారీరకంగా వేదిస్తూ ఉండటంతో గురువారం ఉదయం 10గంటల సమయం లో అంజలి ఆత్మహత్య చేసుకుంది.తన కూతురి మృతిపై అనుమానం ఉందని తగు విచారణ చేసి న్యాయం జరిపించండి అని తల్లితండ్రులు పారా కిషోర్, లక్ష్మి లు మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసినారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి

**-నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



నారాయణపేట టౌన్ జూలై 03(వుదయం ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంట వెంటనే నిర్మాణాలను ప్రారంభిస్తే దశలవారీగా డబ్బులు వారి వారి ఖాతాల్లో జమ అవుతాయని, ఆలస్యం చేస్తే డబ్బులు జమ కావడం కూడా ఆలస్యమే జరుగుతుందన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 11 వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి హౌసింగ్ అధికారులు వేసిన మార్కింగ్ ను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారురాలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి నిర్మాణాన్ని మధ్యలో ఆపకుండా, ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పట్టణంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు మున్సిపల్, హౌసింగ్ అధికారులు ఎక్కడ జాప్యం లేకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. అయితే తమ వార్డుకు వచ్చిన కలెక్టర్ తో ఆ వీధికి చెందిన పలువురు మహిళలు నీటి సమస్య తీర్చాలని మొర పెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను పిలిచి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, వార్డు ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి.

**-మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం.**



పరకాల జులై 3 (వుదయం ప్రతినిధి): హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామం శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు.గత మూడు రోజుల క్రితం బాలికల వసతి గృహంలో ఉరివేసుకొని బలవన్మరణం చెందిన ఏకు శ్రీవాణి మృతి గల కారణాలను పాఠశాల ఉపాధ్యాయులను నుండి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనుకోని సంఘటన జరగడం బాధాకరమని,పూర్తిస్థాయిలో ఎంక్వయిరీ చేసి లోపాలని గుర్తించి ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.అనంతరం శ్రీవాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# జన్నారంలో వరల్డ్ మెకానిక్ డే



జన్నారం, జూలై 3(వుదయం విలేకరి) జన్నారం పట్టణంలో మెకానిక్ దినోత్సవాన్ని టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు.గురువారం రోజున ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జన్నారం పట్టణ టూవీలర్ మెకానిక్ అధ్యక్షుడు బాలిన మధు మెకానిక్ లకు సంబంధించిన జెండాను ఎగరవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్ సోదరులందరూ ఐకమత్యంగా ఉండాలని,ప్రభుత్వం మెకానిక్ ల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మార్కండేయ, ప్రధాన కార్యదర్శి రహీం,ప్రచార కార్యదర్శి ఇమ్రాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, బీసీ సంఘం అధ్యక్షులు కోడూరు చంద్రయ్య, కడార్ల నర్సయ్య,మెకానిక్ లు రాము,బి.నరేష్,టీ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లికి ప్రతేక పూజలు



కుకునూర్ పల్లి 03జూలై/వుదయం: కుకునూరు పల్లి మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో వారాయి నవరాత్రుల పురస్కరించుకొని ఈరోజు సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో కుకునూరుపల్లి మహిళామణులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి పూజలో కుంకుమార్చన లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారుఅమ్మవారి ఇట్టి కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా విభాగం మరియు ముదిరాజ్ కుల బాంధవులు మహిళా మణులుఅమ్మవారి భక్తులు పాల్గొని కుంకుమార్చన నిర్వహించడం జరిగినది వైదిక కార్యక్రమాలు నిర్వహించిన వారు శివ గోవింద శర్మ మరియు ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొనడం జరిగినది

# సమాచారం లేకుండా సర్వే నిర్వహించడంతో రైతుల ఆందోళన

జయశంకర్ భూపాలపల్లి జులై 03(వుదయం ప్రతినిధి) తమకు సమాచారం లేకుండా తమ భూముల్లో అధికారులు సర్వే నిర్వహించడం ఏంటి అని రైతులు ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేశారు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులలో భాగంగా మహాదేవపూర్ శివారులో అధికారులు రైతుల భూములలో సర్వే నిర్వహిస్తుండగా రైతులు గురువారం అడ్డుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం మంథని నియోజకవర్గం లో సాగునీరు అందించడానికి చేపట్టిన చిన్న కాలేశ్వరం పనుల్లో భాగంగా కాలువ పనులు చేపట్టడానికి నిర్వహిస్తున్న సర్వేను రైతులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ భూముల సాగుకు తగినంత నీరు లభిస్తుందని తమకు కాలువ అవసరం లేదని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు దీంతో తాసిల్దార్ రామారావు మాట్లాడుతూ తమకు పై అధికారుల నుండి ఆదేశాలు ఉన్నాయని ప్రస్తుతం సర్వే మాత్రమే నిర్వహిస్తున్నామని మీకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా జిల్లా కలెక్టర్ కు తెలియజేయాలని అన్నారు.లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు ద్వారా పనులను చేపట్టాల్సి వస్తోందని అన్నారు.దీంతో రైతులు తమ భూములలో ఎలాంటి పనులు నిర్వహించడానికి వీల్లేదంటూ తమ భూములను తీసుకుంటూ తమనే బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలు రైతులు మాట్లాడుతూ మహాదేవపూర్ శివారులో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధించిన కాల్వ అవసరం లేదని కాల్వతో భూములు కోల్పోవడం తప్ప రైతులకు ఉపయోగం లేదని పలుమార్లు అధికారుల దృష్టికి మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అయినప్పటికీ భూముల్లో అధికారులు సర్వే చేయడం పై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు మహాదేవపూర్ శివారులో పంట భూముల్లో 50 ఫీట్ల లోపు భూమిలో నీరు ఉంటుందని కాల్వ ఏర్పాటు చేయడం వల్ల బంగారం లాంటి పంటచేనులన్నీ పంట పొలాలుగా మారుతాయని దానితో రైతులు నష్టపోవడం తప్ప లాభం లేదని ప్రభుత్వం రైతుల అభివృద్ధిని కోరుకుంటుందా లేక రైతుల పతనాన్ని కోరుకుంటుందో అర్థం కాని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు చొరవ తీసుకొని మహాదేవపూర్ శివారులోని పంట చేనులలో వచ్చే కాల్వ పనులను నిలిపివేయాలని కోరుతున్నామని అన్నారు.



# బిసి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు- శంకుస్థాపన చేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



హాసన్ పర్తి, జులై 4 (వుదయం ప్రతినిధి) : హాసన్ పర్తి మండలం బీమారం 55 వ డివిజన్ లో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య బిసి కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధుల నుండి 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సంకల్పం గట్టిగా ఉంటే ఎంతటి పని అయినా సాధించవచ్చని అందుకు ఈ కమ్యూనిటీ హాల్ ఒక నిదర్శనమని అన్నారు. జర్నలిస్ట్ నాయకుడు సుభాష్ జ్ఞాపకార్థంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసుకుని, త్వరలో ప్రారంభించుకో బోతున్నామని తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ కోసం సుభాష్ ఎంతగానో కృషి చేశాడని వారి సంకల్పం వల్లే సాధ్యం అయిందన్నారు. సుభాష్ ఇప్పుడు మన మధ్యలో లేక పోవడం బాధాకరమని అన్నారు. మరో రెండు నెలల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సుభాష్ కుటుంబ సభ్యులు వారి వ్యక్తిగతంగా సహాయం కొరకుండా అందరికి ఉపయోగపడేలాగా వారి జ్ఞాపకార్థంగా కమ్యూనిటీ హాల్ ఉండాలని కోరుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సుభాష్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని భగవంతున్ని ప్రార్థించారు. ఇటీవల పలువురు జర్నలిస్ట్ ల ఆకాల మరణాలు తనను ఎంతో బాధించాయని ఎంపీ అన్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా పని చేస్తున్న జర్నలిస్టు సోదరులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రజిత- వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నెంబర్ 254 లోగల ప్రభుత్వ భూమి లో ఐ. టీ. ఐ.కళాశాల నిర్మిశీచాలని అఖిలపక్షాల డిమాండ్.


**-రెవిన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖల మంత్రి వర్యులకి వినతిపత్రం అందజేసిన అఖిలపక్ష పార్టీలు.**



పాలేరు. జులై 3 (వుదయం ప్రతినిధి): తిరుమలాయపాలెం మండల అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రివర్యులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, ఖమ్మంలోని క్యాంప్ ఆఫీస్ నందు కలిసి, తిరుమలాయపాలెం మండలం నకు,45 కోట్లతో ఐటిఐ కళాశాలను మంజూరు చేపించినందుకు, మండల ప్రజల తరఫున, అఖిలపక్ష పార్టీల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం మండలం వెనకబడి ఉన్నది, కావున తిరుమలాయపాలెం మండలం నకు మంజూరైన ఐటిఐ కళాశాలను, ఖమ్మం టూ వరంగల్ హైవే పక్కన గల సర్వే నెంబర్ 254 లో య.9.11 గుంటల,ప్రభుత్వ స్థలం ఉన్నది ఇట్టి ఐటిఐ.కళాశాల ను రోడ్డు వైపున నిర్మించడం వలన మండలంలోని చుట్టుపక్కల గ్రామాల,ప్రజల కు, విద్యార్థులకు., కాలేజీ స్టాఫ్ నకు, రోడ్డు రవాణా సౌకర్యం సులభ తరం అవుతుందని, రోడ్డు వైపున మరి కొంత మందికి ఉపాధి దొరుకుతుందని, ప్రభుత్వ కార్యాలయం చుట్టూ,నూతన ఐటిఐ కళాశాల ఉండటం కూడా, మండలంనకు స్పెషల్ అట్రాక్షన్ అవుతుందని. తిరుమలాయపాలెం మండల అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనికి స్పందించిన మంత్రి , రోడ్డు వైపున నిర్మిద్దాం అనేది కూడ మా ఆలోచనే,అక్కడే నిర్మిద్దామని హామీ ఇచ్చినారు.ఈ కార్యక్రమ%శీ% లో, బి.ఎస్.పీ పాలేరు అసెంబ్లీ అధ్యక్ష, కార్యదర్శి, ఎన్నబోయిన రమేష్ యాదవ్, కొమ్ము పూలే, , బి ఆర్ ఎస్ మండల. నాయకులు గుగ్గిల అశోక్, గద్దల మన్మధరావు, ఎమ్. ఎస్. పీ , ఎమ్ ఆర్ పీ ఎస్ మండల నాయకులు, పగిడిపల్లి బాబు, వంగూరి మధు, ధర్మసామాజ్ పార్టీ నుండి కొమ్ము నితీష్ మహారాజ్, నేలమర్రి యేసు బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

జన్నారం, జూలై 3(వుదయం విలేకరి) ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ జెడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్ కోరారు.గురువారం రోజున అంతర్జాతీయ ప్లాస్టిక్ నిషేదిత దినోత్సవం సందర్భంగా రాఘవేంద్ర లిటిల్ హన్స్ పాఠశాల విద్యార్థులు జన్నారం పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుదాం అంటూ ఫ్లకార్డులు ప్రదర్శించారు.అలాగే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో



రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ లు పంపిణీ



మధిర జూలై 3 (వుదయం ప్రతినిధి) మధిర పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన యూనిఫామ్, టై, బెల్టులను మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ కె షమీం అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలంగాణలో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతోటి ప్రతి నియోజకవర్గంలో 200 కోట్లు ఖర్చుపెట్టి అన్ని వసతులతో ఈ ప్రాంతంలో ఉన్న పేద విద్యార్థులందరూ చదువుకునే విధంగా గురుకుల పాఠశాలను నిర్మాణం చేయటం జరుగుతుంది అన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ మెదటి సంవత్సరం %-% 58 స్కూళ్లు, రూ.11,600 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, గురుకుల విద్యార్థులకు డైట్ ఛార్జీలు 40%, కాస్మొటిక్ ఛార్జీలు 200% రాష్ట్ర ప్రభుత్వం పెంచడం జరిగింది, పేద విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్టాండర్స్‌తో విద్య, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ హబ్‌లుగా అభివృద్ధి చేయటం, గ్రామీణ యువతకు గ్రీన్ స్కిల్స్ శిక్షణ, ఇవన్నీ తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధిఆలోచనల్లో భాగం అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే %-% రాష్ట్ర భవిష్యత్తు అని మెరుగైన విద్య కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని, మన నియోజకవర్గంలో ఎరుపాలెం మండలంలో ఇంకో గురుకుల పాఠశాలకు ఏర్పాటు కు ప్రణాళిక సిద్ధం చేశారు. మధిర పట్టణంలోని జూనియర్ కాలేజ్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేస్తున్నారని అన్నారు, మల్లు భట్టి విక్రమార్క మధిరకు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, పాలిటెక్నిక్ కాలేజ్, గురుకుల పాఠశాలలు మధిర నియోజకవర్గం లో ఏర్పాటు చేశారు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గురుకుల పాఠశాల విద్యార్థులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి కార్పొరేట్ హాస్పిటల్లో ఉచితంగా వైద్యం చేయించటం కోసం ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, భూణావత్ వెంకటరమణ నాయక్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, ఐఎన్టియుసి అధ్యక్షుడు షేక్ బాజీ, మైనార్టీ నాయకులు షేక్ గౌసుద్దీన్, పట్టణ డివిజన్ కమిటీ అధ్యక్షులు బొల్లెద్దు రాజేంద్ర, మైలవరపు చక్రి ,తిరువేదుల రమేష్ అధ్యాపక సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



జయశంకర్ భూపాలపల్లి జులై 03(వుదయం ప్రతినిది) మహదేవపూర్ మండలంలో గురువారం పలు గ్రామాలలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పలు కుటుంబాలను పరామర్శించారు మహదేవపూర్ మండల కేంద్రంలో భీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న కుమారుని పరామర్శించారు అదేక్రమంలో అన్నారం గ్రామంలో నగునూరి రాజేందర్ కు ఇటీవల శస్త్ర చికిత్స జరుగగా వారిని, కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కొండ పోచయ్య ను, ములుకల పోసక్క ఇటీవల మరణించగ వారి కుటుంబాన్ని, తోడేటి మొండయ్య కు ఇటీవల శస్త్ర చికిత్స జరుగగా వారిని, అనారోగ్యంతో బాధపడుతున్న చంద్ పాషా ను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు మరోవైపు మద్దులపల్లి గ్రామంలో చకినాల మల్లేష్ ఇటీవల మరణించగ వారి కుటుంబాన్ని పరామర్శించి టిఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, టిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ ఇన్చార్జ్ కేదారి గీత, నాయకులు ఆనకారి ప్రకాష్, పెండ్యాల మనోహర్, మల్లారెడ్డి, మొండయ్, అలీమ్ ఖాన్, మంచినీళ్ల శ్రీనివాస్, వంశీ వర్ధన్ రావు, తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు రుణమాఫీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం పై హర్షం వ్యక్తం చేసిన మునగాల రైతులు



మధిర జూలై 3 (వుదయం ప్రతినిధి) మధిర మండలం కృష్ణాపురం మునగాల రెవిన్యూ పరిధిలోని రైతులకు రెండు కోట్ల యాభై ఒక్క లక్షల 88 వేల రూపాయలు రుణమాఫీ అందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి గ్రామ రైతులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణాపురం మాజీ సర్పంచ్ కర్నాటి రామారావు మాట్లాడుతూరైతన్నకు వెన్నుదన్నుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తున్నది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజా ప్రభుత్వం రెండు లక్షలు లోపు రుణాలను మాఫీ చేస్తూ రైతుల వ్యక్తిగత బ్యాంకుఖాతాలో డబ్బులను జమ చేశారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేసే ప్రతి అడుగు రైతు సంక్షేమం వైపే ప్రభుత్వం ఇచ్చిన పంట పెట్టుబడి సాయంతో విత్తనాలు, ఎరువులు, దున్నకం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నది. సకాలంలో ఎరువులు, విత్తనాలు, పంట పెట్టుబడి, నాణ్యమైన విద్యుత్, పంట కొనుగోళ్లు రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ ప్రభుత్వం రైతుల రుణమాఫీ విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నది. ఎవరూ ఊహించని విధంగా రైతాంగానికి రుణమాఫీ చేశారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పోచేపల్లి శంకర్, కొత్తపల్లి నాగేశ్వరరావు, వేల్పుల చెంచయ్య, పోచపల్లికోటేశ్వరరావు, నలమల రాము, శ్రీనివాసరావు, తాడినేని రాంబాబు, తిరుమల గోపి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం



జయశంకర్ భూపాలపల్లి జులై 03(వుదయం ప్రతినిధి) డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం మహాదేవపూర్ మండల డిటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు డిటిఎఫ్ మహాదేవపూర్ మండల శాఖ వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సూరారం, బొమ్మాపూర్, అంబటిపల్లి,రాపల్లి కోట గ్రామాలలోని జడ్పీహెచ్ఎస్ తోపాటు ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుని ఉపాధ్యాయల వద్దనుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు కార్యక్రమంలో డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు,మహదేవపూర్ జోన్ బాధ్యులు బొమ్మన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్స్ పదవి విరమణ బెనిఫిట్స్ పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,అదేక్రమంలో మండల అధ్యక్షులు మడక మధు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్లో 15% నిధులు కేటాయించాలని అన్నారు, మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సారంగపాణి మాట్లాడుతూ కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని వృత్తి నిబద్ధత సామాజిక బాధ్యతలో భాగంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు డిటిఎఫ్ సంఘంలో చేరి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యావ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సిహెచ్ మొండయ్య, మేకల ఎర్రయ్య ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు

# జీపీఎస్ పాఠశాలలను సందర్శించిన డీటీడీవో సౌజన్య



వరంగల్ జులై3 (వుదయం ప్రతినిధి ) :ఖానాపురం మండలంలోని పలు గిరిజన గ్రామాలలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలను వరంగల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సౌజన్య సందర్శించారు. ఈసందర్భంగా సౌజన్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా విద్యార్థులు శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హజరయ్యేలా విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. ఖానాపురం మండలంలోని గొల్లగూడెంతండా ,కోమటిపల్లితండా ,వజీనపల్లి,నర్సంపేట శివారు వడ్డెరకాలనీలో జీపీఎస్ పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేశారు. గొల్లగూడెం తండాలో లబ్ధిదారుడు నిర్మిస్తున్న ఇందిరమ్మఇంటిని పరిశీలించారు. కోమటిపల్లితండాలో విద్యార్థులతో పాటు మధ్యాహ్నభోజనం చేశారు. ఈకార్యక్రమంలో డిటిడీఓ ఎస్ ఆర్ పి తెజావత్ గంగయ్య , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలి.



పరకాల జులై 3 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల మండలం పట్టణం,నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశీలకులుగా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చీట్ల సత్యనారాయణ,రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి మోత్కూరి ధర్మారావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...జూలై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగనున్న ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గారి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ మండల అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళన బహిరంగ సభలో పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. దేశంలోనే తొలిసారిగా గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షులతో ఏఐసిసి అధ్యక్షుడు నేరుగా సమావేశం కానుండడం ఎంతో విశిష్టమైన ఘటనగా అని అన్నారు. సభకు హాజరయ్యే గ్రామ, మండల, నాయకులు సమన్వయంతో ముందుగానే రావాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

**-జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ర్యాలీ.**

**-రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర.**

**-రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యం.**

**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**

కోరుట్ల జూలై 03 (వుదయం ప్రతినిధి) రాజ్యాంగ పరిరక్షణ ప్రతి భారతీయ కర్తవ్యం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు అన్నారు మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో సిరిపూర్ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రతిజ్ఞ చేయించి సిరిపూర్ గ్రామంలో స్థానిక నాయకులు గ్రామ ప్రజలతో కలిసి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విచ్చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పౌరులందరికీ సమాన హక్కులు అవకాశాలు బాధ్యతలు కల్పించింది భారత రాజ్యాంగమని దేశ స్వాతంత్రం అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన రాజ్యాంగ రక్షణ కమిటీ ఎన్నో పరిశోధనలు ఇతర దేశాల రాజ్యాంగాలను పరిశీలించిన అనంతరం మన దేశానికి సుపరిపాలన అందించాలని భారత రాజ్యాంగాన్ని తయారు చేసిందని మన రాజ్యాంగం నేడు ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు కానీ నేడు బిజెపి ప్రభుత్వ పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని మహాత్మా గాంధీ పేరు వినిపించకుండా ఉండాలని రాజ్యాంగాన్ని మార్చాలని మళ్లీ దేశంలో చతుర్ వర్ణ వ్యవస్థను తీసుకువచ్చి మనువాదాన్ని బలవంతంగా దేశ పౌరులపై వృద్దాలని ఉద్దేశంతోటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టిది అన్నారు ఈ దేశంలో నివసిస్తున్న ప్రతిపరుడు నేడు భారత రాజ్యాంగాన్ని బిజెపి నుండి కావలసిన అవసరం ఎంతైనా ఉందని దీనికోసం కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ప్రజలందరూ ఏకతాటిపై వచ్చి రాజ్యాంగ పరిరక్షణ కోసం నడుము బిగించాల్సిన అవసరం ఉందన్నారు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను వరుస క్రమంలో నెరవేర్చుకుంటూ వస్తుందని ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి గ్రామాభివృద్ధికి తోడ్పడాల్సిందిగా ఈ సందర్భంగా జువ్వాడ కృష్ణారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సిరిపూర్ గ్రామంలో పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భావిస్తామని సార్వభౌమత్వ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ నిర్మించుకోవడానికి సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన భావ ప్రకటనను అంతస్తులను అవకాశాల్లోనూ మానవత్వాన్ని కల్పించడానికి కులమత ప్రాంత వర్మ లింగ ధనిక పేద లాంటి ఏ రకమైన భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు బాధ్యతలు రాజ్యాంగ కల్పించిందని ఇటీవల పరిమాణాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ సమాజంలో అసాధ్యలే నెలకొల్పుతున్నాయని విభేదాలు సృష్టిస్తూ రాజకీయ మనగడ కోసం విద్వేషాలు రెచ్చగొడుతున్నాయన్నారు ఇలాంటి తరుణంలో శాంతి అహింసను మూల సూత్రాలుగా మనకు బోధించే మహాత్ముడి స్ఫూర్తిగా మనసులంతా ఒకటే అంటూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించడానికి డాక్టర్ బాబాసాహెబ్ ఆశయాలను అమలు చేస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో అంకితభావంతో అహర్నిశలు కృషి చేయాలన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రచించింది కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షించేది కూడా కాంగ్రెస్ పార్టీ యేనన్నారు అలాంటి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ఇంటింటికి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ 200 రూపాయల వరకు ఉచిత విద్యుత్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం రైతు రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు కావున రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించాలన్నారు కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేసే పార్టీ అని అన్నారు కాంగ్రెస్ పార్టీ చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు తో పాటు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అంతడుపుల నర్సయ్య స్థానిక మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి మహిపాల్ నల్ల శ్రీనివాస్ సోమ నాగార్జున కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు సిరిపూర్ గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# కుల మతాలకు అతీతంగా బిజెపి ప్రభుత్వ పాలన



జయశంకర్ భూపాలపల్లి జులై 03(వుదయం ప్రతినిధి) కులమతాలకు అతీతంగా భారతీయ జనతా పార్టీతోపాటు బీజేపీ ప్రభుత్వం పాలన కొనసాగుతుందని దానివల్లనే ముచ్చటగా మూడోసారి దేశ ప్రధానిగా బీసీ బిడ్డ అయిన నరేంద్ర మోడీ కి భారతదేశ ప్రధానిగా కొనసాగే అవకాశాన్ని కల్పించారని భారతీయ జనతా పార్టీ మహాదేవపూర్ మండల సీనియర్ నాయకుడు యాదవ సంఘం సీనియర్ నాయకులు కన్నెబోయిన ఐలయ్య యాదవ్ అన్నారు గురువారం మహాదేవపూర్,మండలకేంద్రంలో ఆయన పాత్రికలతో మాట్లాడుతూ బిజెపి పార్టీ బీసీలను మోసం చేసిందని బీసీ సంఘం డివిజన్ నాయకుడు విజయగిరి సమ్మయ్య అనడం బిజెపి పార్టీ తరపున ఖండిస్తున్నామని అన్నారు బిజెపి పార్టీ అన్ని కుల,మత, సంఘాలను కలుపుకుపోయే పార్టీగా రాష్ట్రంలోనే కాకుండా దేశ నాలుగు మూలల అవతరించిందని అన్నారు. బిజెపి పార్టీపై బురదజల్లే ప్రయత్నం కొన్ని దుష్టశక్తులు చేస్తున్నాయని అన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన పార్టీయే బిజెపి పార్టీ అని, ఒక బీసీ బిడ్డను దేశానికే ప్రధానమంత్రిగా చేసినటువంటి పార్టీ బిజెపి పార్టీ అని గుర్తు చేశారు. అంతేకాకుండా గతంలో రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేసినటువంటి బండి సంజయ్ ఒక బీసీ బిడ్డ అనే విషయాన్ని పార్టీపై ఆరోపణలు చేసే బీసీ సంఘం వారు గుర్తు చేసుకోవాలని తెలిపారు. పార్టీ ఎక్కడ కూడా రాష్ట్ర అధ్యక్షుడిని బీసీలను చేస్తామని చెప్పిన దాఖలాలు లేవని అన్నారు. సంఘాల పేరుతో పప్పం గడుపుకునే కొంతమంది నాయకులు మా బిజెపి పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి ఆలోచనలు మానుకోవాలని హెచ్చరిస్తున్నామన్నారు. మీరు పని చేసే పార్టీలో ఎంత మంది బీసీ బిడ్డలు గ్రామస్థాయి నుండి మొదలుకుంటే రాష్ట్ర స్థాయి వరకు ఎంతమంది ఉన్నారో అందులో ఎంతమందికి అవకాశం కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. మీ పార్టీలో రాష్ట్ర అధ్యక్షుడు గాని, వర్కింగ్ ప్రెసిడెంట్ గాని, కనీసం మండలి చైర్మన్ లనైనా బీసీలకు అవకాశం కల్పించారా అని ప్రశ్నించారు. బిజెపి పార్టీకి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులైన రామచంద్ర రావుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. మరోసారి బిజెపి పార్టీ పై బురదజల్లే విధంగా ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు.

# విలేకరి మాడ నర్సయ్య ను పరామర్శించిన టిడబ్ల్యూజేఎఫ్ నేతలు



హనుమకొండ, జూలై 3(వుదయం జిల్లా ప్రతినిధి) : ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన హనుమకొండ టివి-5 విలేఖరి మాడ నర్సయ్యను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షులు టి.వి రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్ గురువారం ఆయన గృహంలో పరామర్శించారు. ఇటీవల హనుమకొండ పట్టణంలో ప్రమాదవశాత్తు గాయపడి గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందినట్లు తెలిపారు. వారి చేయి విరగడంతో డాక్టర్లు ఆపరేషన్ చేశారని, ఆయన ప్రస్తుతం హనుమకొండ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. మాడ నర్సయ్య త్వరగా కోలుకోవాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆశాభావం వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు.

# సీడ్ పత్తిపై రైతులకు అవగాహన సదస్సు లో పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి



(గద్వాల జులై 3 వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో గురువారం సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో సిడి పత్తి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీడ్ పత్తిపై వస్తున్న పుకార్లపై మాట్లాడడం జరిగింది. అనంతరం మేము రైతులకు ఇచ్చిన కంపెనీలలో క్రిస్టల్ ర్యాలీస్, మైకో, నూజివీడు, శ్రీరామ, కావేరి, నార్త్ సిడి కంపెనీ వెరైటీలు రైతులకు ఇచ్చాను. మేము ఇచ్చిన కంపెనీలలో రైతులకు సీడ్ పత్తి పీకి వేయమని ఏ రైతుకు చెప్పలేదు, ఒక ఎకరాకు రెండు క్వింటాలు తీసుకుంటామని ఎక్కడా చెప్పలేదు. ఫెయిల్ అయిన రైతులతో 80 నుండి 89% జి ఓ టి వచ్చిన ఫెయిల్ అయితే రైతులు రీ జి ఓ టి పెట్టి మళ్లీ ఒకసారి కంపెనీ ద్వారా మాట్లాడి రైతులకు న్యాయం చేయవలసిందిగా కోరుతున్నాము. రైతులకు మా దగ్గర దాదాపు 25 సంవత్సరాలు పైగానే వందలాది మంది రైతులు సీడ్ పత్తి పండిస్తున్నారు. ఏదైనా కొద్ది శాతంతో ఫెయిల్ అయిన విత్తనాలను కంపెనీ వారితో మాట్లాడి దానికి తగిన విధంగా కన్సిడర్ ఇప్పిస్తున్నాము. సీడ్ పత్తి కర్ణాటక వెళుతుందని అనవసరంగా రైతులలో ఆందోళన కలిగిస్తున్నారు. మన గద్వాల జిల్లాలో జిన్నింగ్ డేల్డింగ్ పర్మిషన్ లేనందున కర్ణాటక వైపు రైతులు మగ్గుచూపుతున్నారు. ఒకప్పుడు మన జిల్లాలోని డిలీటింగ్ ఉండేది,ఇక్కడ కొందరు అభ్యంతరం తెలపడంతో అక్కడకు వెళ్లడం జరిగింది. తిరిగి గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో కంపెనీ వారితో మాట్లాడి త్వరలోనే ఉన్న జిల్లాకే జిన్నింగ్ డిలీటింగ్ తీసుకో చే ప్రయత్నంలో ఉన్నామని తెలియజేస్తున్నాము, మేము ఇచ్చే కంపెనీలలో రైతులకు ఎలాంటి నష్టం లేదు, రైతులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి మాకు పెట్టుబడి సాయం లేకున్నామేము పండిస్తామని రైతులు ముందుకు వస్తున్నారు. అయినా మేము కంపెనీ వారితో మాట్లాడి రైతులకు కంపెనీ ద్వారా కొంత వరకు పంట పెట్టుబడి ఇప్పించడానికి ప్రయత్నం చేస్తున్నాము, ఇక్కడికి వచ్చిన రైతులను మీ పత్రిక రిపోర్టర్లు కూడా తెలుసుకోవాల్సిందిగా కోరుతున్నాము. మేము ఇచ్చే కంపెనీ వల్ల ఎక్కడ రైతులను సీడ్ పత్తి పీకి వేయమని గాని రెండు క్వింటాలు తీసుకుంటామని గానీ చెప్పలేదని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులతో మాట్లాడగా రైతులు ఈ సిడి పత్తి వల్లనే మా కుటుంబాలు చాలా వరకు బాగుపడ్డాయి. సీడి పత్తి లేకపోతే మేము ఇంత డెవలప్ అయ్యే వారం కాదు అని రైతులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు గజ్జలన్న, ఉప్పరి నాగరాజు, బుర్ర నరసింహులు, తిమ్మప్ప, లక్ష్మన్న, రాముడు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరం

**-మంగనూరు గ్రామంలో లో సమగ్ర ఆరోగ్య శిబిరం విజయవంతం**

**-లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి. ప్రసన్న**



నాగర్ కర్నూల్ జూలై 03 (వుదయం ప్రతినిధి) జిల్లాలోని బిజినపల్లి మండల పరిధిలోని లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గురువారం నాడు మంగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి. ప్రసన్న గారు సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఆరోగ్య స్థితిని సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం ద్వారా తెలుసుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈరోజు నుంచి నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈరోజు ఈ ఆరోగ్య శిబిరంలో 142 మందికి 7 రకాల పరీక్షలు రక్తపోటు మధుమేహ , పరీక్షలతో పాటుగా టీబి కళ్ళే మరియు ఎక్స్రే, హిమోగ్లోబిన్ మరియు సుఖ వ్యాధులైన హెచ్ఐవి, సిఫిలిస్,హెపటైటిస్ -బి హెపటైటిస్ -సి వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చిరు వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య అవగాహన, మందులు అందజేశారు. ఈ పరీక్షల ద్వారా వారి ఆరోగ్యస్తాయి తెలుస్తుందని, కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లాదిశా మేనేజర్ రమేష్ రాజ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు అబ్దుల్ సలీం,పి.జ్యోతి,ఆశా కార్యకర్తలు శారద కృష్ణవేణి పద్మ బాలమణి అనిత నాగమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంథని మరింత వెనకబడేలా మంథని ఎమ్మెల్యే ఆలోచనలు

**మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



జయశంకర్ భూపాలపల్లి (మంథని)జులై 03(వుదయం ప్రతినిధి) మంథని మరింత వెనకబడేలా మంథని ఎమ్మెల్యే ఆలోచనలు ఉన్నాయి అని రింగ్ రోడ్ పేరుతో ప్రజాధనాన్ని వృధా చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. గురువారం మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి సమీపంలో రెండు రోజుల క్రితం రింగ్ రోడ్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేసిన స్థలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూచిరాజ్‌పల్లి సమీపంలో మంథనికి చెందిన సీఎల్ రాజంకు సంబంధించిన భూమి రియల్ ఎస్టేట్‌లో మంత్రి సోదరుడి వాటా ఉందని, ఈ రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించేందుకే మంథని ఎమ్మెల్యే రింగ్ రోడ్‌ను తీసుకువచ్చారని ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. రూ.300కోట్లతో చేపట్టే ఈ రింగ్ రోడ్‌తో మంథని ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని, దీని ద్వారా మంథనికి నష్టమే జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోందని, నియోజకవర్గంలో 38కిలోమీటర్ల మేర నిర్మాణానికి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ హైవే ద్వారా గోదావరి నది అవతలి నుంచి అడవిశ్రీరాంపూర్ దాకా వెళ్లే అవకాశం ఉందన్నారు.అయితే ఈ హైవేలో నాలుగు చోట్ల ఇంటర్ చేంజ్‌లు వస్తున్నాయని, అడవిశ్రీరాంపూర్, బేగంపేట, పుట్టపాక, పోతారంలో ఇంటర్ చేంజ్‌లు ఏర్పాటు చేస్తున్నారని, ఈ క్రమంలో రింగ్ రోడ్‌తోప్రయోజనం ఏంటని ఆలోచన చేయాలన్నారు. హైవే నిర్మాణం జరిగితే పెద్దపల్లి నుంచి వచ్చే వాళ్లు హైవేద్వారా గోదావరినది అవతలికి వెళ్లే అవకాశాలు ఉన్నాయని, రింగ్ రోడ్డు మాత్రం శివ్వారం వరకు మాత్రమే ఉంటుందని, మళ్లీ చెన్నూర్‌లాంటి ప్రాంతాలకు వెళ్లాలంటే 20నుంచి30కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వివరించారు. కేవలం తమ్ముడి రియల్ ఎస్టేట్ దందా కోసమే ప్రభుత్వ, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసేందుకు చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికే మంథనిలో వ్యాపారాలు సాగడం లేదని బాధపడుతున్న క్రమంలో వచ్చే ఒక్కరిద్దరు కూడా రాకుండా పోతారని ఆయన తెలిపారు. రింగ్ రోడ్ పేరుతో రైతుల నుంచి భూములు లాక్కుంటారని, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రైతుల నుంచి భూములు ఎలా గుంజుకున్నారో అదే రీతిలో ఇక్కడ కూడా జరుగుతుందని ఆయన అన్నారు. ఒకవైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుంటే పక్కనే రింగ్ రోడ్డు నిర్మాణం ఎందుకు చేస్తున్నారనే విషయాన్ని కనీసం ప్రజలకు వివరించడం లేదన్నారు. రింగ్ రోడ్ పేరుతో వృధా చేసే రూ.300కోట్లతో మంథనిని అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చని, తద్వరా మంథనికి మరింత వెలుగులు వస్తాయన్నారు. కూచిరాజ్‌పల్లి నుంచి బస్‌డిపో మీదుగా రింగ్ రోడ్డు నిర్మించే అవకాశం ఉందని, తద్వార గొల్లగూడెం, బోయిన్‌పేట అభివృద్ధిలోకి వస్తాయన్నారు. కేవలం రూ.100కోట్లతో ఇంటర్నల్ రింగ్‌రోడ్లు నిర్మిస్తే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా 50ఏండ్ల క్రితం నిర్మించిన అడవిసోమన్‌పల్లి బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, అక్కడ మరో బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలు సులభతరం అవుతాయని, మంథని మండలం ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మాణం చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇలాంటి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ఉన్నా కేవలం సీఎల్ రాజం రియల్ ఎస్టేట్ భూముల కోసమే రింగ్ రోడ్ తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. మేధావులైన మంథని ప్రజలు గొప్పగా ఆలోచన చేయాలని మన కళ్ల ముందే రూ.300కోట్లు ప్రజాధనం వృధా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రహించాలన్నారు. అభివృద్ధి పనుల పేరుతో మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆలోచన లేకుండా చేపట్టిన అభివృద్ధి పనులపై నిలదీయాలని, సమాజానికి నాలుగో స్థంభమైన పత్రికలు సైతం ఇలాంటి విషయాలపై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రేపటి భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలని అన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అడ్డుకోవడం లేదని కేవలం ప్రజలకు ఉపయోగపడే రీతిలో అబివృద్ధి చేయాలనే ఆకాంక్ష మాత్రమే తమదని ఆయన ఈసందర్బంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పుట్ట మధు అభిమానులు పాల్గొన్నారు.

# రాష్ట్రం లో సమగ్ర సాంస్కృతిక విధానం తీసుకు రావాలి.

**-ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్.**



తిరుపతి, జూలై 03(వుదయం ప్రతినిధి).మనిషి జీవన విధానం ఆలోచనలు, ఆచారాలు, అలవాట్లు, కట్టుబాట్లు, మతం ,సాంప్రదాయాలు, కళా సాహిత్యాలు, స్వరూపమే సంస్కృతి అని దీనిని చాటి చెప్పేందుకు సమగ్ర సాంస్కృతిక పాలసీని ప్రభుత్వం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా సమితి ఆధ్వర్యంలో రెండో రోజు పాటల శిక్షణ తరగతులు సందర్భంగా జిల్లా కార్యదర్శి జె నాగరాజు అధ్యక్షత న ముగింపు సభ జరిగింది. ఈ సభ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ 1943 లో ముంబాయి నగరంలో ఆవిర్భవించిన ఇప్టా నాటి నుంచి నేటి వరకు కళ కళ కోసం కాదు ప్రజల కోసం అనే నినాదంతో సమాజాన్ని సరైన మార్గం లో నడిపించేందుకు కృషి చేస్తుందన్నారు . ప్రజల కష్టాల నుంచి పుట్టినవే ప్రజా కళలని ఆ కళల ద్వారా ప్రజల కష్టాల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కూడా సంస్కృతి లో భాగమే నన్నారు. సమాజం లోని అభ్యుదయ భావాలు కలిగిన వారంతా కమ్యూనిస్టు భావాలు కలిగిన వారేనని అన్నారు. రాష్ట్రంలో అనేక కళా సంస్థలు ఉన్నాయని ఆ కళాకారులకు తగిన ప్రాధాన్యత లేకపోవడం బాధాకరమన్నారు . రాష్ట్ర అధ్యకులు చంద్ర నాయక్ మాట్లాడుతూ పాట పదునైన ఆయుధమని ఆ పాట ను ఆగస్టు లో ఒంగోలు జరుగుతున్న సిపిఐ రాష్ట్ర మహాసభలలో పాడాలని దేశంలో జరుగుతున్న దోపిడీ అవినీతి అరాచకాలకు వ్యతిరేకంగా సమాజాన్ని మార్పు కోసం పాటే ప్రధానమని తెలియజేశారు . గ్రామ గ్రామాన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి విస్తరణకు జిల్లా కమిటీ పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రజా ఉద్యమాలకు ముందుంటారని పాట లేని ఉద్యమం ఎక్కడా చూడలేమని అన్నారు అలాంటి ప్రజానాట్యమండలి కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అన్ని ప్రజాసంఘాలపై ఉంటుందని ఈ కళాశాల బతికించుకోవడానికి మేము కూడా సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా ఇన్చార్జి ఎస్ గుర్రప్ప మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రెండు రోజులపాటు శిక్షణ శిబిరంలో పాల్గొని మంచి పాటలు నేర్చుకున్న కళాకారులు అందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత జిల్లా కళాకారులు హరిబాబు డప్పుసూరి నాగభూషణం ప్రజా చైతన్య జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారాయణదాసు, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జులై 03(వుదయం ప్రతినిధి) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎన్.కొత్తపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. లబ్ధిదారులు జంగా రాణి, నాలుక రామ్మూర్తి, తరగంప కరుణలత ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు, ఇప్పటి వరకు ఎంతవరకు పూర్తి చేశారు, ఏవైనా సాంకేతిక లేదా సామగ్రి సంబంధిత సమస్యలున్నాయా?, ఇసుక ఎక్కడి నుండి తీసుకుంటున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. మండలంలోని కాల్వపల్లి వద్ద ఉన్న ఇసుక స్టాక్‌పాయింట్ నుండి ఇసుక అందుబాటులో ఉందని, లబ్ధిదారులు అక్కడినుండే తీసుకోవచ్చని స్పష్టం చేశారు.ఇంటి నిర్మాణం పనులను దశలవారీగా పూర్తి చేస్తూ సంబంధిత ఫోటోలు, వివరాలను వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలించారు. వర్షాలు వల్ల మురుగు నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రం చేయాలని సూచించారు. ప్రతి కుటుంబం తప్పని సరిగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమలు వ్యాప్తి జరుగకుండా నియంత్రణ చర్యలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఎంపిడిఓ నాగరాజు, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ శాఖ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**మున్సిపల్ కమిషనర్ సుష్మ.**




పరకాల జులై 3 (వుదయం ప్రతినిధి): సైబర్ నేరస్థులు చేసే కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరకాల మున్సిపల్ కమిషనర్ కొడారి సుష్మ సూచించారు. పరకాల పురపాలక సంఘం నుండి ఆన్లైన్ చెల్లింపుల కోసం ట్రేడ్ లైసెన్స్ పొందేందుకు, వ్యాపార లైసెన్సుల కోసం, ఇంటి పన్ను, ఇతరత్ర ఎలాంటి బకాయిల కోసం మున్సిపల్ అధికారుల నుండి ఫోన్ కాల్స్ చేయడం జరగదన్నారు. వ్యాపారస్తులు, గృహ యజమానులు అప్రమత్తంగా ఉండి మున్సిపల్ అధికారుల పేరుతో ట్రైడ్ లైసెన్సు, మున్సిపల్ బకాయిలు చెల్లించాలని వచ్చే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ శాఖ పేరుతో వచ్చే నకిలీ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసు అధికారులను గాని, మున్సిపల్ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాను బోధించాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జులై 03(వుదయం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.గురువారం ఆయన భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎన్.కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠాలు చదివించారు. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి పెరిగేలా, అభ్యసనా సామర్థ్యాలు మెరుగయ్యేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అదనపు సమయం కేటాయించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్, పిల్లలను చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 5వ తరగతిలో నలుగురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరిన సందర్భంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో వ్యత్యాసం ఏంటని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచిగా విద్యాభ్యాసం జరుగుతుందని, ఉపాధ్యాయులు మంచిగా పాఠాలు భోదిస్తున్నారని తెలుపుగా విద్యార్థులను అభినందించారు.పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పూర్తి సంఖ్యలో పుస్తకాలు అందేలా చూడాలని సూచించారు.అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, కేంద్రంలో చిన్నారుల నమోదు సంఖ్య, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అంగన్ వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, మాతృ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అంగన్‌వాడి కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఆరోగ్య సమసమాజానికి కృషి చేయాలని సూచించారు. అంగన్ వాడి నుండే బాల్యం బలోపేతం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంపిడిఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు.ఎస్ఐ మేడ ప్రసాద్

**-అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందండి.**



పినపాక నియోజకవర్గం జులై 03( వుదయం ప్రతినిధి)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గం పహాడ్ మండల పరిధిలో,ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన మండలంలోని నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది.కావున కాలి నడకన మరియు వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని బూర్గంపహాడ్ సబ్ ఇన్స్పెక్టర్ మేడ ప్రసాద్ సూచించారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. బూర్గంపహాడ్ పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉంటాము అన్నారు ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు మరియు చెరువులు,వాగులు,నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు. వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి బూర్గంపహాడ్ పోలీసులు 24ఐ7 అందుబాటులో ఉంటారుఅని బూర్గంపహాడ్ ఎస్సై తెలిపారు.ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు. ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా బూర్గంపహాడ్ ఎస్ఐ మేడ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

**-పునఃశ్చరణ తరగతులతో నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు**

**-ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్**



కరీంనగర్ జులై 03(వుదయం విలేఖరి): అత్యవసర పరిస్థితుల్లో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, 108 సిబ్బందికి పునః చ్ఛరణ తరగతులతో మరింత నాణ్యమైన వైద్యం అందిస్తారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ పేర్కొన్నారు.గురువారం కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో 108 సిబ్బందికి నిర్వహిస్తున్న పునఃశ్చరణ తరగతుల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పునఃశ్చరణ తరగతులతో సిబ్బంది మరింత మెరుగైన వైద్యం అందించేందుకు దోహదపడు తుందని అన్నారు. ఈఎంఆర్ఐ ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన బోధకులతో గత మూడు రోజులుగా పునఃశ్చరణ తరగతులను సిబ్బందికి నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ తరగతులతో అత్యవసర వైద్య రంగంలో కొత్తగా వచ్చిన మార్పులను సిబ్బంది అన్వయించుకుంటు ఎటువంటి అత్యవసర పరిస్థితిలోనైనా క్షతగాత్రులను రక్షించేందుకు ఈ తరగతులు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ డిస్టిక్ మేనేజర్ సయ్యద్.ఇమ్రాన్,పెద్దపల్లి, జగిత్యాల మేనేజర్ కుమార స్వామి,సిరిసిల్ల మేనేజర్ అరుణ్,ట్రెయినర్స్ మహేష్, గజేందర్ ,108 పైలెట్స్,ఈఎంటి లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల బాలల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి,

-శారీరక మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందించాలి,
-తెలకపల్లి మండలంలో భవిత కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలన,
-విద్యా సదుపాయాలు, ప్రత్యేక పరికరాలు వసతులపై సమీక్ష
-ప్రత్యేక అవసరాల బాలలకు మరింత మెరుగైన సేవలపై దృష్టి,
-ప్రత్యేక అవసరాల బాలలకు ప్రభుత్వం అండగా,
-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,



నాగర్ కర్నూల్ జూలై 03(వుదయం ప్రతినిధి) భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు మెరుగైన విద్యతోపాటు, ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ భవిత కేంద్రం ఐ ఆర్ పి టీచర్లను ఆదేశించారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం తెలకపల్లి మండల కేంద్రంలోని భవిత (ప్రత్యేక అవసరాల బాల బాలికల జిల్లా వనరుల కేంద్రం) కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం పరిశీలించారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు అందిస్తున్న విద్యా సదుపాయాలు, కల్పించిన వసతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,మాట్లాడుతూ.... ప్రత్యేక అవసరాల బాలల పట్ల సానుభూతితో కూడిన దృష్టితో కార్యక్రమాలు చేపట్టాలి. వాళ్లకు నాణ్యమైన విద్యతో పాటు, శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలు అందించాలి. వీటి ద్వారా వారికి ఇతర పిల్లల సరసన ఉండే విధంగా అభివృద్ధి కల్పించాలి, అని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం భవిత కేంద్రంలో 20, మంది విద్యార్థులు థెరపీకి అవసరమైన పరికరాల ఇటీవలే రెండు లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన పరికరాలను కలెక్టర్ పరిశీలించారు .విద్యార్థులకు నాణ్యమైన సేవలందించేందుకు సంబంధిత శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అక్కడి బోధనాసిబ్బంది, థెరపీ సిబ్బందితో చర్చించారు. వారి నుండి భవిత కేంద్ర పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాలున్న బాల బాలికలకు అన్ని విధాలుగా అండగా ఉండేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారి బోధనకు అవసరమైన ఉపకరణాలు, టెక్స్ బుక్స్, స్పెషల్ కౌన్సిలింగ్, టెక్నాలజీ ఆధారిత సదుపాయాలు అందించేందుకు కృషి కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, వారి ఎదుగుదలకు తోడ్పాటున అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు కలెక్టర్ వెంట జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్, తహసిల్దార్ జాకిర్ ఆలి, యంఈఓ శ్రీనివాస్ రెడ్డి భవిత కేంద్రం కోఆర్డినేటర్, బాల నరసింహ, ప్రత్యేక అవసరాలు ఉపాధ్యాయుడు శేఖర్, ఉన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద మహిళ వైద్యానికి ఆర్థిక సహాయం అందజేసిన.

-ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి.



జులై 3 భూపాలపల్లి వుదయం (ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనపర్తి గ్రామానికి చెందిన సాదు కృష్ణవేణి భర్త వినీత్ వీరిది నిరుపేద కుటుంబం కృష్ణవేణి గత కొంతకాలం నుండి తలలో రక్తం గడ్డ కట్టిన సమస్యతో బాధపడుతూ ఉండడంతో వారి కుటుంబం ఆమె కోసం అప్పు చేసి ఆమెతలకు ఆపరేషన్ చేయించారు మళ్లీ నెల తర్వాత మందుల కోసం హాస్పటల్ కు వెళ్లడానికి వారి దగ్గర డబ్బులు లేకపోవడంతో అప్పుగా డబ్బుల కోసం ఎవరిని అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో బాధపడుతూ ఉండగా ఆ ఊరిలోని కొందరు జయశంకర్ ఫౌండేషన్ గురించి చెప్పడంతో వెంటనే వారు జయశంకర్ ఫౌండేషన్ వారికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో వెంటనే స్పందించిన చైర్మన్ అయిలి మారుతి వారి ఇంటికి వెళ్లి ఆమె వైద్యానికి 5000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అలాగే వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో మరియు ఆ ఊరి మాజీ సర్పంచ్ అన్నారపు సువర్ణ రాజు, ఆకుల ప్రతాప్, సాధు సలేందర్, తోట ఈదయ, గోశాల వివేక్, మొర్రి గణేష్, మరియు తదితర సభ్యులు పాల్గొన్నారు .

## ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం చర్యలు తీసుకోవాలి,

-ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలి
-రక్త నమూనాల సేకరణ పై కలెక్టర్ అసంతృప్తి,
-ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, మందుల నిల్వలు తప్పనిసరి,
-ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్,



నాగర్ కర్నూల్ జూలై 03 (వుదయం ప్రతినిధి) జిల్లాలోని తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేందుకు వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. రక్త పరీక్షల కేంద్రంలో రక్ష పరీక్షల రిపోర్టులు రక్త నమూనాలను కలెక్టర్ పరిశీలించారు. రక్త నమూనాల సేకరణ అంశాలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. రక్త నమూనా సేకరణ మరియు రక్త పరీక్షలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవల కొరకు వచ్చే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. వైద్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడారు. అక్కడి వైద్య సేవల గురించి తెలుసుకొని, అందుబాటులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు విన్న ఆయన, ఆరోగ్య కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు ఎదురైతే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని, తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటాం అని కలెక్టర్ తెలిపినారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ జాకిర్ ఆలి, ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

-మాజీ సర్పంచ్ ముక్తాల శేఖర్ ముదిరాజ్



వెల్దండ జులై 3 (వు దయం ప్రతినిధి) మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామ పరిధిలోని గొల్లోనిపల్లి గ్రామంలో దుబ్బ మోహన్ అనారోగ్యంతో మరణించడం జరిగింది. కుప్పగండ్ల మాజీ సర్పంచ్ శ్రీ మొక్తాల శేఖర్ గారు వారి కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతి తెలపడం జరిగింది. అలాగే 4.000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది వారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. నాగయ్య గౌడ్. గోరేటి. దశరథం దుబ్బ దేవయ్య. ఎండి అన్వర్. హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

## నిధానపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ పాదయాత్ర




మధిర జూలై 3(వుదయం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిధానపురం గ్రామం నుండి పాదయాత్ర ప్రారంభించారు. మదిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మనువాదరాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మతవాదుల నుండి దేశాన్ని కాపాడుకోవాలని పరిస్థితి ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహ రావు, క్లస్టర్ ఇంచార్జ్ లు నిడమానూరు వంశీ కృష్ణ, చిలువేరు బుచ్చిరామయ్య, మార్కెట్ డైరెక్టర్ అద్దంకి రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు,నిధానపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండా వీరారెడ్డి, మాజీ సర్పంచ్ బాధా కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్, అమర్వాది సత్యనారాయణ రెడ్డి, వెంపటి రమేష్, జెట్టి ప్రకాష్, దూదేకుల జానీ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్ గా పదోన్నతి పొందిన వి.లక్ష్మీనారాయణను

-ఘనంగా సన్మానించిన జర్నలిస్టులు



గద్వాల జూలై 03 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్గా పనిచేస్తూ జిల్లా అడిషనల్ కలెక్టర్ గా వి.లక్ష్మీనారాయణ కి పదోన్నతి పొందిన శుభ సందర్భంగా గురువారం పాత్రికేయులు కాశపోగు జాన్, ఇస్మాయిల్, ముకుందరావు, వెంకటేష్ గౌడ్, సాషనూర్ విజయ్, లక్ష్మీ నారాయణ, చారి, బిజ్వారం ఎస్.తిరుమలేష్, తాటికుంట తిరుమల్, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అడిషనల్ కలెక్టర్ వి.లక్ష్మీ నారాయణ ను శాలువతో పాటు పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో

-స్థానిక ఎమ్మార్వో కి వినతి పత్రం



జులై 3 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): దమ్మపేట మండల పరిధిలో అన్యాకాంతమైన ప్రభుత్వ భూములను సర్వే చేసి భూమి లేని నీరు పేదలకు పంచాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ దమ్మపేట మండల అధ్యక్షులు సున్నం శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కు మెమొరండం ఇవ్వడం జరిగింది,వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 15000 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాకాంతం అయి ఉన్నదని, ప్రభుత్వ భూములపై భూ బకాసురులు పాగావేసి ఉన్నారని, ఏజెన్సీ ప్రాంతం 5th ™షెడ్యూల్ ఏరియా,1/70 యాక్ట్ అమలులో ఉన్న ఏరియాలో... భూ అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసిన కబ్జా రాయుళ్లు పై చర్యలు తీసుకోవాలి, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి భూమి లేని నీరు నిరుపేదలకు ఇవ్వాలని, దమ్మపేట మండలం ముష్టిబండ-వడ్లగూడెం గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 114 భూమిలో సుమారు 2000 ఎకరాలు పైన కబ్జా గురై ఉన్నది,గుట్టలను, కొండలను పిప్పి చేస్తూ వ్యవసాయ భూములుగా మారుస్తున్నారు,అధికారులలో ఎలాంటి స్పందన లేదు,ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా కూడా స్పందన లేదు, అని వారన్నారు

## మృతి రాలి కుటుంబానికి 5 వేల ఆర్థిక సహాయం

-కాంగ్రెస్ నాయకులు దుబ్బ తండ శ్రీనివాస్ నాయక్



వెల్దండ జులై 3 (వు దయం ప్రతినిధి) మండల పరిధిలోని పోచమ్మ గడ్డ తండా గ్రామపంచాయతీకి చెందిన డాడీ శాంతి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు దుబ్బ తండ శ్రీనివాస్,మృతి చెంది న శాంతి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలోబాలు నాయక్ మున్న నాయక్ దేశ నాయక్ కిషన్ నాయక్ సంధ్య నాయక్ గోపియా నాయక్ విమల్ నాయక్ శ్రీను మైపాల్ నాయక్ తదితరు లు పాల్గొన్నారు.

## మొబైల్ పోతే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయండి


-జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



గద్వాల జులై 03 (వుదయం ప్రతినిధి) మొబైల్ ఫోన్ యజమానులు తమ ఫోన్ పోగొట్టుకుంటే చింతించవద్దని, తక్షణమే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ సిబ్బంది రికవరీ చేసి అప్పగించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు తెలిపారు. జిల్లాలో సెల్ పోన్ యజమానులు పోగొట్టుకున్న 52 సెల్ పోన్ లను జిల్లా ఎస్పీ సెల్ పోన్ యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైన తమ మొబైల్స్ దొంగతనం జరిగిన, పోగొట్టుకున్న చింతించాల్సిన అవసరం లేదని, అలాగని అజాగ్రత్తగా ఉండకూడదు అని అన్నారు. దొంగతనం, పోగొట్టుకున్న సెల్ ఫోన్ల ఆచూకీ కోసం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా పరిధిలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు 853 సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయగా ఇందులో 413 సెల్ ఫోన్లను గుర్తించి అందులో ఇప్పటి వరకు 260 సెల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందజేయడం జరిగిందని, సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్ ( https://www.ceir.gov.in) నందు బ్లాక్ చేసి, సంబందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మొగిలయ్య, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆదివాసీలపై అక్రమ దాడులు ఆపాలి.

-అడవుల్లో నివాసం ఆదివాసీల హక్కు.
-జీవిత అవసర వస్తువులను, సెల్ఫోన్లను ఎత్తుకెళ్లే హక్కు ఫారెస్ట్ అధికారులకు ఎక్కడిది.
-సిపిఐ (ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు.



జులై 3 భూపాలపల్లి (వుదయం ప్రతినిధి): అడవుల్లో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవించడం ఆదివాసుల హక్కు అని, ఆదివాసులపై ఫారెస్ట్ అధికారుల అక్రమ దాడులు ఆపాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు డిమాండ్ చేశారు మహా ముత్తారం మండలంలోని ఆదివాసులపై పారెస్ట్ అధికారులు చేస్తున్న దాడులను ఉద్దేశించి గురువారం బంధు సాయిలు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి సర్కారు కార్పొరేటు మతోన్మాద ఆదివాసి ప్రజా వ్యతిరేక విధానాల అనుసరిస్తూ దాడులు చేస్తున్న కారణంగా చతిస్గఢ్ లోని ఆదివాసీలు బతుకు జీవుడా అంటూ పొట్ట చేత పట్టుకొని తెలంగాణలోని అటవీ ప్రాంతాలలో గూడాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారని, అదే మాదిరిగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహా ముత్తారం మండలం పెగడపల్లి రేంజ్ పరిధిలోని పేగడపల్లి గ్రామ సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా వలసదివాసులు నివాసం ఉంటున్నారని వారు అన్నారు, వేరొక రాష్ట్రం నుంచి వచ్చిన వారు ఇక్కడ ఉండడానికి వీలు లేదు అనే కారణంగా ఫారెస్ట్ అధికారులు పదేపదే వారిపై దాడులు చేస్తూ వారి గుడిసెలను కూల్చివేస్తూ, వారిని విపరీతంగా కొడుతూ, వారి పంట సామాగ్రిని, అదేవిధంగా బట్టలు, సెల్ ఫోన్లు ఇతర జీవితాల వస్తువులను మొత్తం ఎత్తుకెళ్తూ ఇవ్వకుండా నరకయాతన పెడుతూ ఇబ్బందుల గురిచేస్తు చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు, వలస ఆదివాసీలు భారత పౌరులు కాదా, వారికి జీవించే స్వేచ్ఛ హక్కు లేదా వారు ఎక్కడికి పోయి బతకాలి అని ప్రశ్నించారు, భారత రాజ్యాంగమే ఆదివాసీలకు ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించిందని వారిపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు.వెంటనే ఆదివాసీలపై పారేస్తా అధికారుల అక్రమ దాడులు ఆపాలని వారి నుండి ఎత్తుకెళ్లిన వస్తువులు సామాగ్రిని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## భూభారతి రెవెన్యూ గ్రామ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి,

-ప్రభుత్వ సూచనలు ప్రకారం చర్యలు తీసుకోవాలి,
-రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారం,
-రైతులకు భరోసా కల్పించేందుకు కృషి,
-భూమి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,



నాగర్ కర్నూల్ జూలై 03 (వుదయం ప్రతినిధి)భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన చేసి ప్రతి దరఖాస్తును శాశ్వత పరిష్కారానికి రెవిన్యూ అధికారులు చర్యలు వేగవంతంగా చేపట్టాలని నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూభారతి రెవెన్యూ చట్టం ద్వారా సామాన్య రైతులకు ప్రజలకు భూ సమస్యల పరిష్కారం నిమిత్తం మొదటగా రాష్ట్రంలోని కొన్ని మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని, భూ సమస్యల పరిష్కారానికై ఇటీవలే నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల అర్హమైన అన్నింటికి సానుకూలంగా పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. భూ రికార్డులలో పేరు తప్పులు, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త ఆర్. ఓ. ఆర్ 2025 చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూభారతి పోర్టల్ లో దరఖాస్తుల నమోదు ప్రక్రియను పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాలలో గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించి భూ సమస్యలు ఉన్న రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు, ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం సంబంధిత వారికి నోటీసులు అందించి విచారణ చేసి పరిష్కారం చెయ్యాలని ఆయన తాసిల్దారుకు సూచించారు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 15, వ తేదీ లోపు భుభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి 525 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులన్నీటిని ఆన్లైన్లో పొందుపరచడం జరిగిందని, దరఖాస్తుల పరిష్కారానికి దరఖాస్తుదారులకు నోటీసులు అందజేయడం జరిగిందని తెలకపల్లి తహసిల్దార్ జాకీర్ అలీ జిల్లా కలెక్టర్కు వివరించారు.




# బిజినెస్



## ఈ టైమ్‌లో బ్యాంకు లోన్ తీసుకుంటే పండగే..



పండుగలు వచ్చినప్పుడల్లా బ్యాంకులు వ్యక్తిగత రుణాలపై కొత్త ఆఫర్లు ఇస్తుంటాయి. దీపావళి, న్యూ ఇయర్ వంటి సమయాల్లో 'ప్రాసెసింగ్ ఫీజు లేదు' అంటూ ఆకర్షణీయమైన ప్రకటనలు చూస్తుంటాం. అయితే, బ్యాంకులు ఇలా ఊదరగొట్టడం వెనుక పెద్ద ప్లానే ఉంటుంది. భారతదేశంలో వ్యక్తిగత రుణ ఆఫర్లు ఎప్పుడూ ఒకేలా ఉండవు. తరచుగా ఇవి మారుతాయి. షేర్లు కొనడం, అమెజాన్ లో షాపింగ్ చేసినట్లే, సరైన సమయంలో రుణం కోసం దరఖాస్తు చేస్తే చాలా డబ్బు ఆదా చేసుకోవచ్చు. పండుగల సందడి రుణ వడ్డీ రేట్లను ఎలా ప్రభావితం చేస్తుంది. వ్యక్తిగత రుణ ఆఫర్లు సీజన్‌ను బట్టి మారుతాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ త్రైమాసిక లక్ష్యాలను చేరుకోవడానికి, పండుగల అమ్మకాలను పెంచడానికి ప్రయత్నిస్తాయి. అందుకే అక్టోబర్‌లో కనిపించే లోన్ ఆఫర్ మార్చి వచ్చేసరికి మారిపోతుంటుంది. దీపావళి, దసరా, క్రిస్మస్, న్యూ ఇయర్ వంటి పండుగల సమయంలో బ్యాంకులు ప్రత్యేక ఆఫర్లు ఇస్తాయి. వడ్డీ రేట్లు తగ్గించడం, ప్రాసెసింగ్ ఫీజులు లేకుండా చేయడం, త్వరగా లోన్ ఇవ్వడం, క్యాష్‌బ్యాక్ లేదా గిఫ్ట్ వోచర్లు ఇవ్వడం, తిరిగి చెల్లింపులో వెసులుబాట్లు కల్పించడం జరుగుతుంది. పెళ్లిళ్ల సీజన్ (జనవరి-మార్చి): పెళ్లిళ్లకు చాలా ఖర్చు అవుతుంది కాబట్టి, ఈ సమయంలో వ్యక్తిగత రుణాలకు డిమాండ్ పెరుగుతుంది. బ్యాంకులు తమ కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లు, ఎక్కువ మొత్తం లోన్లు, త్వరగా డబ్బు అందించడం వంటివి చేస్తాయి. ఆర్థిక సంవత్సరం చివరిలో (జనవరి-మార్చి): ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో బ్యాంకులు తమ లక్ష్యాలను పూర్తి చేయడానికి దూకుడుగా ఉంటాయి. ఈ సమయంలో అవి మరింత సరళంగా వ్యవహరిస్తాయి. ఫీజులు మాఫీ చేయడం లేదా అదనపు ప్రయోజనాలు ఇవ్వడం జరుగుతుంది. ఇవి కాకుండా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రేట్లను తగ్గించినప్పుడు లేదా ఆర్థిక పరిస్థితులు మెరుగుపడినప్పుడు కూడా రుణ వడ్డీ రేట్లు తగ్గుతాయి. డిజిటల్ లెండర్స్ (ఆన్‌లైన్ లోన్ ఇచ్చే సంస్థలు) పోటీ కూడా బ్యాంకులపై ఒత్తిడి పెంచి, మెరుగైన ఆఫర్లు ఇచ్చేలా చేస్తుంది. పండుగ ఆఫర్లు ఉన్నప్పటికీ, వ్యక్తిగత రుణం మంజూరు చేసేటప్పుడు, దాని ధరను నిర్ణయించేటప్పుడు బ్యాంకులు కొన్ని ముఖ్యమైన విషయాలను పరిగణనలోకి తీసుకుంటాయి. పండుగ ఆఫర్ ఉందనో, ఆర్థిక సంవత్సరం చివరి భాగమనో కనిపించిన వెంటనే ఏ లోన్‌నైనా తీసుకోవద్దు. తెలివిగా వ్యవహరించండి.

పరిశోధన చేయండి: వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లు, ఫీజులు, నిబంధనలను పోల్చండి. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి నిజ-సమయ ఆఫర్లను చూడండి. ఆఫర్లు ఆకర్షణీయంగా ఉన్నా, వాటికి కఠినమైన క్రెడిట్ స్కోర్ షరతులు ఉండవచ్చు. అర్హత ప్రమాణాలను ఎప్పుడూ చదవండి. తక్కువ వడ్డీ రేటు మొదటి కొన్ని నెలలకు మాత్రమే వర్తించవచ్చు, లేదా పెద్ద మొత్తంలో రుణాలకే ఉండవచ్చు. దాచిన ఛార్జీలు, ఆఫర్ తర్వాత రేట్లు వంటివి గమనించండి. మీకు తొందర లేకపోతే, పండుగల సీజన్ లేదా ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో వచ్చే ఆఫర్‌ల కోసం వేచి ఉండండి. కొద్ది రోజులు ఆగితే వేల రూపాయలు ఆదా చేసుకోవచ్చు.

## రోజు రోజుకు పెరుగుతున్న బంగారం ధరలు



నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,650 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,890 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,170 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. బంగారం కొనాలనుకునే వారికి వరుస షాక్‌లు తగులుతున్నాయి. గత వారం రోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదు. వారం క్రితం స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 93 వేల దగ్గర ట్రేడ్ అయింది. వారం రోజుల్లోనే ఊహించని విధంగా .

. 98 వేలకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో కొనసాగుతున్న పరిస్థితులు చూస్తుంటే బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. బంగారం కొనాలనుకునే వారు ముందుగానే జాగ్రత్త పడాలని, ధరలు తగ్గినపుడు కొని పెట్టుకోవటం ఉత్తమమని ట్రేడ్ నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,650 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,890 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,170 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,900 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,660 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,180 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. మొన్నటి వరకు బంగారం ధరలు తగ్గినా వెండి ధరలు మాత్రం పెరుగుతూ పోయాయి. కానీ, ఈ రోజు వెండి ధరలు తగ్గాయి. నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 12000 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,20,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాముల వెండిపై 10 రూపాయలు, కేజీ వెండిపై 100 రూపాయలు తగ్గింది. 100 గ్రాముల వెండి ధర నేడు 11990 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,19,900 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## తగ్గనున్న జిఎస్‌టి భారం?




మధ్యతరగతి ప్రజలకు శుభవార్త, మధ్యతరగతి, అల్పాదయవర్గాలవారు ఎక్కువగా వినియోగించే వస్తువులు, ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. జీఎస్టీ విధానాన్ని మరింత సరళతరం చేసే లక్ష్యంతో 12శాతం జిఎస్టీస్లాబ్‌లో ఉన్నవస్తువుల్లో కొన్నింటిపై పన్ను పూర్తిగా తొలగించడం, 5శాతానికి తగ్గించాలని కేంద్రం ఆలోచిస్తోంది. మధ్యతరగతి, బలహీన వర్గాల వారు ఎక్కువగా ఉపయోగించే వస్తువులపైనే దృష్టి పెట్టారు. పన్నుతగ్గనున్న వస్తువులలో టూత్‌పేస్ట్, టూత్‌పౌడర్, గొడుగులు, కుట్టుమిషన్లు, ప్రెషర్ కుక్కర్లు, వంట పాత్రలు, ఎలక్ట్రిక్ ఐరన్‌లు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం గల వాషింగ్ మిషీన్లు, సైకిళ్లు, 1000 రూపాయలకన్నా ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ వస్తువులు, 500 నుంచి 1000 రూపాయలలోపు ధరఉంటే చెప్పులు, స్టేషనరీ వస్తువులు, టీకాలు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణా లు, వంటి చాలా వస్తువులు ఉన్నాయి. ఈ చర్య వల్ల ప్రభుత్వం పై రూ.40 వేలకోట్ల నుంచి 50 వేల కోట్ల భారం పడుతుంది. అయితే ఈ భారాన్ని భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వస్తు వినియోగం పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు వచ్చింది. దీనివల్ల తక్కువ ధరలు అమ్మకాలు పెరుగుతాయని, చివరికి పన్ను బేస్, దీర్ఘకాలిక జిఎస్టీ వసూళు పెరుగుతాయని కేంద్రం నమ్ముతోంది.కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ మధ్య ఓ ఇంటర్‌వ్యూలో జీఎస్టీ రేట్లలో మార్పులు చేసే ప్రతిపాదన ఉందని సూచనప్రాయంగా తెలిపారు. ప్రభుత్వం హేతుబద్ధంగా ఆలోచిస్తోందని, చాలా వస్తువులపై పన్ను తగ్గించడం ద్వారా మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే అవకాశం ఉందని తెలిపారు.

## సిబిల్ స్కోర్‌పై ఆర్బీఐ కీలక నిర్ణయం.. ఇక రుణాలు తీసుకునే వారికి ప్రయోజనం




బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలంటే ప్రతి వ్యక్తికి సిబిల్ స్కోర్ అవసరం. సిబిల్‌ను బట్టే బ్యాంకులు రుణాలు అందిస్తాయి. అయితే ఇది వరకు బ్యాంకులు 15 లేదా నెల రోజులకోసారి సిబిల్ స్కోర్‌ను అప్‌డేట్ చేసేవి. కానీ ఇప్పుడు నియమాలు మారనున్నాయి. గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు లేదా ఆటో రుణాలు తీసుకునే వారికి రిజర్వ్ బ్యాంక్ అనుకూలమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కంపెనీలు 15 రోజులకు ఒకసారి అప్‌డేట్ చేసే సిబిల్ స్కోర్ సమాచారాన్ని ఇప్పుడు రియల్ టైమ్‌లో ఇవ్వాల్సి ఉంటుందని ఆర్‌బిఐ తన ఇటీవలి ఉత్తర్వులో పేర్కొంది. ఆర్‌బిఐ ఈ నిర్ణయం వల్ల రుణం తీసుకునేవారికి పెద్ద ప్రయోజనం లభిస్తుందని భావిస్తున్నారు. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ వంటి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు (సిఐసిలు) పక్షం రోజులకు ఒకసారి (15 రోజులు) కాకుండా నిజ సమయంలో డేటాను అందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) డిప్యూటీ గవర్నర్ కోరారు. సిఐబిల్ డేటాను వేగంగా పంపడం వల్ల అందరికీ వ్యవస్థపై నమ్మకం, సామర్థ్యం, పారదర్శకత పెరుగుతుందని ఆయన అన్నారు.

CIBIL స్కోర్‌లకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పుడు రియల్ టైమ్‌లో అందించాలని RBI తన తాజా ఉత్తర్వులో పేర్కొనడం గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు లేదా ఆటో రుణాలు తీసుకునే వారికి కొంత ఉపయోగంగా ఉంటుంది.

## రీ కేవైసీకి యూనియన్ బ్యాంక్ మెగా క్యాంపెయిన్

Union Bank of India

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మార్గదర్శకాల ప్రకారం అధిక రిస్కు కలిగిన ఖాతాదారులు రెండేండ్లకోసారి నో యువర్ కస్టమర్ (కేవైసీ) డాక్యూమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతి ఖాతాను కస్టమర్ వృత్తి ఆధారంగా తక్కువ,
మధ్యమ, అధిక రిస్క్‌గా వర్గీకరించాల్సి ఉంటుందని తెలిపింది. తక్కువ రిస్క్ కలిగిన ఖాతాదారులు 10 సంవత్సరాలకు ఒకసారి, మధ్యమ రిస్క్ కస్టమర్లు 8 సంవత్సరాలకు, అధిక రిస్క్ కస్టమర్లు 2 సంవత్సరాలకు ఒకసారి కెవైసిని సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, రీ కెవైసి పోర్టల్, కార్పొరేట్ వెబ్‌సైట్‌లో కెవైసిని అప్‌డేట్ చేసుకోవాలని తెలిపింది. లేదా వాట్సాప్ బ్యాంకింగ్ 9666606060కు హై అని పంపడం ద్వారా డాక్యూమెంటేషన్ సమర్పించవచ్చని పేర్కొంది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రదేశాలు, శాఖలలో కస్టమర్లు రీ-కేవైసీ నవీకరించడానికి ఒక మెగా క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కేవైసీ నవీకరణ కోసం సమీప శాఖను సందర్శించాలని లేదా బిజినెస్ కరస్పాండెంట్స్‌ను సంప్రదించాలని సూచించింది.

## మలబార్ గోల్డ్ తయారీ యూనిట్ ప్రారంభం

MALABAR
GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE

ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ మహేశ్వరంలోని ఐపి జనరల్ పార్క్‌లో తమ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. దీనిని గురువారం ముఖ్య అతిథి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభిం చనున్నారు. అదే విధంగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎంపి అహ్మద్ హాజరు కానున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఈ యూనిట్‌ను దాదాపు 3.7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. దాదాపు 750 కోట్ల పెట్టుబడుల వ్యయం చేస్తోన్నట్లు ఇది వరకు ఆ సంస్థ పేర్కొంది. సంవత్సరానికి 10 టన్నుల బంగారు ఆభరణాలు, 1.5 లక్షల క్యారెట్ల వజ్రాల ఆభరణాలు, 180 టన్నుల సామర్థ్యంతో అత్యాధునిక బంగారు శుద్ధీకరణ చేయాలని నిర్దేశించుకుంది. మలబార్ గోల్డ్‌కు 13 దేశాల్లో 370 పైగా షోరూంలున్నాయి. తెలంగాణలో ఈ ఏడాది జనవరి నాటికి 23 స్టోర్లతో 1000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉంది. తెలంగాణతో పాటు భారత్‌లో 9 యూనిట్లు కలిగి ఉంది. కతర్, దుబారు, షార్జా, బహ్రెయిన్‌లో 5 యూనిట్లున్నాయి.

# జాతీయం – అంతర్జాతీయం

## జాతీయ క్రీడా విధానానికి కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్రమంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పరిశోధనాభివృద్ధి,ఆవిష్కరణల రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణ( ఆర్‌డిఐ) పథకానికి ఆమోదం తెలిపింది.ఈ పథకానికి రూ.లక్ష కోట్లు కేటాయించడానికి పచ్చజెండా ఊపింది. ఆర్‌డిఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ లేదా వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ లేదా రీ ఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్షమని కేబినెట్ సమావేశం అనంతరం మీడియాకు వివరాలను వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ప్రైవేటు రంగం నిధుల విషయంలో ఎదుర్కొంటున్న అడ్డంకులు, సవాళ్లను అధిగమించడమే ఈ పథకం లక్షమని మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి అధ్యక్షతన ఉన్న అనుసంధాన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్ పాలక మండలి ఆర్‌డిఐ పథకానికి దిశానిర్దేశం చేస్తుందని వైష్ణవ్ తెలిపారు. దేశంలో క్రీడా



మౌలిక సదుపాయాలు పెంచడం, క్రీడాకారుల పమగ్రాభివృద్ధే లక్ష్యంగా జాతీయ క్రీడా విధానం2025కే కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. అట్టడుగు స్థాయినుంచి ఉన్నతస్థాయి వరకు ప్రతిభను ప్రోత్సహించడం, కోచింగ్‌కు ప్రాప్యతను మెరుగుపర్చ డం, దేశ క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం పాలసీ లక్షమని మంత్రి తెలిపారు. క్రీడల్లో యువ అథ్లెట్లు ప్రపంచ వేదికలపై పోటీ పడి విజయం సాధించేందుకు క్రీడాపాలసీ అవకాశం కల్పిస్తుందన్నారు.

## మాజీ ప్రధానికి ఆరు నెలల జైలు శిక్ష

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ), బుధవారం ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే మొదటిసారి.ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం ప్రకారం, జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్ నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్-1కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. షేక్ హసీనా ప్రస్తుతం కేవలం కోర్టు ధిక్కరణ కేసులోనే కాకుండా, అంతకంటే తీవ్రమైన ఆరోపణలను కూడా ఎదుర్కొంటున్నారు.



గత ఏడాది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనల సమయంలో అమానవీయ రీతిలో నేరాలకు పాల్పడ్డారంటూ ఆమెపై అధికారికంగా అభియోగాలు నమోదయ్యాయి. నిరసనకారులపై షేక్ హసీనా 'పద్ధతి ప్రకారం దాడులు' చేయించారని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదిక ప్రకారం, 2024 జూలై 15 నుంచి ఆగస్టు 15 మధ్య జరిగిన ఆ హింసాత్మక ఘటనల్లో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, తనపై మోపిన అన్ని ఆరోపణలను షేక్ హసీనా మొదటి నుంచి ఖండిస్తూ వస్తున్నారు. ఈ ఆరోపణలపై వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాది అమీర్ హుస్సేన్ మీడియాకు తెలిపారు. 2024 ఆగస్టులో దేశవ్యాప్త ఆందోళనలతో అవామీ లీగ్ ప్రభుత్వం అనూహ్యంగా కూలిపోవడంతో షేక్ హసీనా బంగ్లాదేశ్ విడిచిపెట్టి భారతదేశానికి చేరుకున్నట్టు కథనాలు వచ్చాయి.

## దౌత్యపరంగా భారత్‌కు ఎదురుదెబ్బ !



న్యూఢిల్లీ : ఐక్యరాజ్య సమితిలో కీలక పదవి చేపట్టకుండా పాకిస్తాన్‌ను నివారించడంలో ప్రధాని మోడీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ బుధవారం విమర్శించింది. "భారత్‌కు ఇది ప్రధానమైన దౌత్యపరమైన ఎదురు దెబ్బ" అని వ్యాఖ్యానించింది. జులై మాసానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను చేపడుతున్నట్లు పాకిస్తాన్ మంగళవారం వెల్లడించింది. ఐక్యరాజ్య సమితికి అధికార కేంద్రంగా భద్రతా మండలి పనిచేస్తుంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్య దేశంగా పాకిస్తాన్‌కు రెండేళ్ళ పదవీకాలం ఈ ఏడాది జనవరి నుండి ప్రారంభమైంది. అందులో భాగంగానే ఈ అధ్యక్ష పదవి కూడా చేపడుతోంది. దీనికి తోడు తాలిబన్ ఆంక్షల కమిటీకి కూడా పాకిస్తాన్ అధ్యక్షత వహించనుంది. ఐక్యరాజ్య సమితి తీవ్రవాద వ్యతిరేక కమిటీ ఉపాధ్యక్షురాలిగా కూడా చేయనుంది.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జివాలా ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, తీవ్రవాద దేశమైన పాక్ ఇప్పుడు అంతర్జాతీయ సెక్యూరిటీ బ్రోకర్‌గా మారిందని విమర్శించారు. 'దెయ్యం ఇప్పుడు కుర్చిలో కూర్చుంది.' అని ఆయన వ్యాఖ్యానించారు. తీవ్రవాద దేశంగా రుజువైన, ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న, వారిని పెంచి పోషిస్తున్న, భారత్‌కు తీవ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న పాకిస్తాన్ ఇప్పుడు అంతర్జాతీయ నాయకత్వ పదవులకు ఎగబాకింది. ఒకపక్క ఆ దేశం పాల్పడుతున్న ఉగ్రవాదాన్ని భారత్ అనుభవిస్తుండగానే ఇది చోటు చేసుకుందని సూర్జివాలా విమర్శించారు. పహల్గాం దాడి జరిగిన కొద్ది వారాలకే ఇలా జరగడం పట్ల మోడీ ప్రభుత్వం మౌనంగా, నిష్క్రియాపరత్వంగా వుండడాన్ని ప్రశ్నించారు. పైగా ఐక్యరాజ్య సమితి తీవ్రవాద నిరోధక కమిటీ ఉపాధ్యక్షురాలిగా గతనెల 4న పాక్ బాధ్యతలు చేపట్టడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదంపై అంతర్జాతీయ తీర్మానాలను పదే పదే ఉల్లంఘించినా ఈ పదవులు వరించడాన్ని ఆయన ప్రశ్నించారు.

## భారత్, చైనాలపై 500శాతం పన్నులు..



భారత్, చైనాలపై అమెరికా పన్నుల పిడుగు వేయాలనే యోచనలో ఉంది. రష్యా ఆయిల్, విద్యుత్ ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకుంటే భారత్, చైనా దిగుమతులపై 500 శాతం అమెరికా పన్నులను విధించనుంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ట్రంప్ రష్యాను టార్గెట్‌గా చేసుకునే సుంకాలు అత్యధికంగా విధించే సెనేట్ బిల్లుకు ఆయన ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని అమెరికా సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఆదివారం ఎబిసి న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యా –ఉక్రెయిన్ యుద్ధంలో పెద్ద ముందడుగు వేశారు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌తో చర్చలు జరపడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే.. ఈ సెనెట్ బిల్లు ప్రవేశపెట్టాలని తనను కోరినట్లు గ్రాహమ్ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అయితే ఈ రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలిపివేయాలని చర్యల్లో భాగంనే ట్రంప్ ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు గ్రాహమ్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే యుద్ధానికి సహకరిస్తున్న భారత్ చైనాలపై బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. 'మీరు రష్యా నుండి ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ.. ఉక్రెయిన్‌కు సహాయం చేయకపోతే.. అమెరికాలోకి వచ్చే మీ ఉత్పత్తులపై 500 శాతం సుంకం ఉంటుంది. భారత్, చైనా పుతిన్ చమురులో 70 శాతం కొనుగోలు చేస్తాయి. వారు పుతిన్ చేస్తున్న యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి' అని గ్రాహమ్ ఈ ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే ఈ బిల్లు కాంగ్రెస్‌లో అమోదం పొంది చట్టమైతే దానిపై సంతకం చేయాలా వద్దా అని ట్రంప్ నిర్ణయించుకోవచ్చు అని గ్రాహమ్ నొక్కి చెప్పారు. రష్యాపై ఆంక్షల్ని విధించే ఈ బిల్లుకు 84 మంది సెనేటర్లు మద్దతివ్వనున్నారు. ఈ బిల్లు రష్యా, చైనాలపై ఎకానమీ బంక్ బస్టర్‌గా నిలుస్తుంది.

## ఇన్ఫోసిస్‌లో కామాంధుడు.. వాష్‌రూమ్‌లో సీక్రెట్ గా..

బెంగళూరు: ఇన్ఫోసిస్ ఆఫీసులో ఓ కామాంధుడు.. సీక్రెట్ గా మహిళా ఉద్యోగుల వీడియోలను రికార్డు చేస్తూ దొరికిపోయాడు. నగరంలోని ఇన్ఫోసిస్ హెలిక్స్ విభాగంలో సీనియర్ అసోసియేట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగి స్వాప్నిల్ నాగేష్ మాలి, కంపెనీ క్యాంపస్‌లోని మహిళల వాష్‌రూమ్ లోపల ఒక మహిళా సహోద్యోగిని చిత్రీకరించారనే ఆరోపణలతో అరెస్టు అయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్ఫోసిస్‌లో టెక్నికల్ టెస్టింగ్ లీడ్‌గా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి.. జూన్ 30 (సోమవారం) ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆఫీసు IQE విభాగం మూడవ అంతస్తులోని మహిళల రెస్ట్‌రూమ్‌లో ఉన్నప్పుడు రహస్యంగా వీడియో తీసేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన జరిగింది. బాధితురాలు వాష్‌రూమ్‌లో ఉన్నప్పుడు.. ప్రక్కనే ఉన్న గది స్టాల్‌లో ఆమె ఏదో అనుమానాస్పద ప్రతిబింబం, కదలికను గమనించింది. దీంతో టాయిలెట్ సీటుపై లేచి నిల్చుని చూడగా.. పక్క స్టాల్‌లోని టాయిలెట్‌పై నిలబడి, మొబైల్ ఫోన్ పట్టుకుని ఆమెను రికార్డ్ చేస్తున్న వ్యక్తిని చూసి షాక్ అయ్యింది. వెంటనే కేకలు వేస్తూ వాష్‌రూమ్ నుండి బయటకు వచ్చి సహోద్యోగులకు సమాచారం ఇచ్చింది. ఆఫీస్ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని స్వాప్నిల్‌ను పట్టుకున్నారు. అతని మొబైల్ ఫోన్‌ను తనిఖీ చేయగా.. బాధితురాలి వీడియో ఫుటేజ్‌ను గుర్తించారు. HR సూచనల మేరకు స్వాప్నిల్ క్షమాపణలు చెప్పి వీడియోను తొలగించాడు. తర్వాత ఈ ఘటనపై తన భర్తతో కలిసి బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. అతడిని వదిలేస్తే.. మళ్లీ ఇలాంటి చర్యలు పునరావృతం కావచ్చని, ఆఫీస్ లోని ఇతర మహిళలకు హాని కలిగించవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేసింది. దీంతో స్వాప్నిల్‌ను అరెస్టు చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


## పార్లమెంటు భద్రతా ఉల్లంఘన కేసులో ఇద్దరు నిందితులకు బెయిల్

న్యూఢిల్లీ : భారత పార్లమెంటులో 2023 డిసెంబర్‌లో చోటు చేసుకున్న భద్రతా ఉల్లంఘన కేసుకు సంబంధించి నిందితులకు బెయిల్ లభించింది. ఇద్దరు నిందితులు నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, జస్టిస్ హరీశ్ వైద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. అనంతరం నిందితులు నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఒక్కొక్కరికి రూ.50 వేల వ్యక్తిగత బాండ్, అంతేమొత్తానికి ఇద్దరు పూచీకత్తుపై న్యాయస్థానం వారికి బెయిల్‌ను మంజూరు చేసింది.

ఈ సంఘటనకు సంబంధించి మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వవద్దనీ, సోషల్ మీడియా పోస్టులు చేయొద్దని ధర్మాసనం వారిని ఆదేశించింది. గతంలో ట్రయల్ కోర్టు వారి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. అయితే, దానిని సవాలు చేస్తూ నిందితులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం నుంచి వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. '2001 పార్లమెంటు ఉగ్రదాడి' రోజు 2023, డిసెంబర్‌లో లోక్‌సభలో ఒక పెద్ద భద్రతా ఉల్లంఘన చోటు చేసుకున్నది. నిందితులు సాగర్ శర్మ, డి.మనోరంజన్‌లు జీరో అవర్ సమయంలో పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభ చాంబర్‌లోకి దూకారు. డబ్బాల నుంచి పసుపు వాయువును విడుదల చేసి, నినాదాలు చేశారు. ఆ తర్వాత కొంత మంది ఎంపీలు వారిని నిరోధించే యత్నం చేశారు. దాదాపు అదే సమయంలో మరో ఇద్దరు నిందితులు అమోల్ షిండే, ఆజాద్‌లు పార్లమెంటు వెలుపల 'తానాషాహి నహీ చలేగి(నియంతృత్వం పని చేయదు)' అనే నినాదాలు చేస్తూ తమ వెంట తెచ్చుకున్న డబ్బాల నుంచి వాయువును వదిలారు.

## థాయిలాండ్ తాత్కాలిక ప్రధానిగా సూర్య జుంగ్రుంగ్రియాంగ్కిట్

థాయిలాండ్ దేశ తాత్కాలిక ప్రధానిగా ఉప ప్రధాని సూర్య జుంగ్రుంగ్రియాంగ్కిట్ బాధ్యతలు స్వీకరించారు. 24 గంటలపాటు ఆయన ప్రధాని పదవిలో ఉంటారు.కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భర్తీ చేయబడే ముందు ఆయన 24 గంటల పాటు పదవిలో ఉంటారని ఎఎఫ్ పి వార్తా సంస్థ వెల్లడించింది. థాయిలాండ్ రాజకీయాల్లో పెనుమార్పుల కారణంగా ఈ నిర్ణయం జరిగింది. థాయిలాండ్ ప్రధాని పెటోంగ్టార్న్ షినవత్రాను మంగళవారం రాజ్యాంగ న్యాయస్థానం సస్పెండ్ చేసిన తర్వాత సూర్య జుంగ్రుంగ్రియాంగ్కిట్ కు పదవి చేపట్టే ఛాన్స్ వచ్చింది.కంబోడియాతో జరిగిన దౌత్య వివాదంలో మాజీ ప్రధాని థాక్సిన్ షినవత్రా కుమార్తె పెటోంగ్టార్న్ పినవత్రా కేబినెట్ నీతి నియమాలను ఉల్లంఘించిందని కోర్టు భావించింది. దేశ భద్రతకు సంబంధించిన విషయాలను పొరుగుదేశం కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్ తో ఆమె చర్చించడంతో దేశవ్యాప్తంగా రాజకీయదుమారం చెలరేగింది. పెటోంగ్టార్న్ కంబోడీయా మాజీ నాయకుడు హున్ సేన్ ను మామ అని, థాయిలాండ్ మిలిటరీ కమాండర్ ను ప్రత్యర్థి అని అభివర్ణించినట్లు ఆడియో రికార్డింగ్ లీక్ కావడంతో వివాదం ముదిరింది. మే నెలలో సరిహద్దు ప్రతిష్టంభన



సందర్భంగా చేసిన ఈ వ్యాఖ్యలు ఆగ్రహానికి కారణమయ్యాయి. థాయ్ మిలిటరీని అణగుదొక్కుతున్నారనే ఆరోపణలకు దారితీశాయి. పెటోంగ్టార్న్ పినవత్ర సస్పెన్షన్ తో అమెకుటుంబం రాజవంశంతో ఇప్పటికే ఎదుర్కొంటున్న సమస్యలకు మరింత తోడు అయింది. ఆమె తండ్రి థాక్సిన్ పినవత్రా ప్రస్తుతం కోర్టులో రాజ పరువునష్టం ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.ఒకరోజు ప్రధాని పదవి చేపట్టిన సూర్య జుంగ్రుంగ్రియాంగ్కిట్ ఇప్పటివరకూ థాయిలాండ్ రవాణా శాఖమంతిగా, డిప్యూటీ ప్రధానిగా ఉన్నారు.

కేబినెట్ పనర్వ్యవస్థీకరణ ప్రక్రియ మొదలైంది. గురువారం కొత్త అంతర్గత శాఖమంత్రి, ఉప ప్రధానిగా ఫుంతం వెచాయాచాయ్ ప్రమాణస్వీకారం చేస్తారు.

## అజిత్ కుమార్ కుటుంబానికి సారీ చెప్పిన సిఎం

చెన్నై: శివగంగా అజిత్ కూమార్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోన్ చేశారు. అజిత్ కూమార్ తల్లికి సిఎం క్షమాపణలు చెప్పారు. జరగకూడని ఘటన జరిగిందని, ఆమెను ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఘటనకు కారణం అయిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే వారందరినీ అరెస్టు చేయించామని, కుటుంబానికి అండగా ఉంటానని సిఎం హామీ ఇచ్చారు. అజిత్ కుమార్ లాకప్ డెత్ కేసును సిబిఐకి బదిలీ చేస్తూ తమిళనాడు సర్కార్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నాయి. లాకప్ డెత్ కేసులో తమిళనాడు ప్రభుత్వ తీరును హైకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. లాకప్ డెత్ కేసులో ఐదుగురు పోలీస్ అధికారులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. తిరుప్పవనమ్‌లోని శివగంగాలో ఓ దేవాలయంలో అజిత్ కుమార్(27) సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. బంగారు ఆభరణాలను అజిత్ ఎత్తుకెల్లాడనే అనుమానం అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని చితకబాదారు. అజిత్‌ను నిర్మానుష్య ప్రదేశానికి పోలీసులు లారీలతో తీవ్రంగా కొట్టడంతో దెబ్బలు తాళలేక ఘటనా స్థలంలోనే చనిపోయాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో



వైరల్‌గా మారింది. దీంతో పోలీసుల తీరుపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బానిసత్వం కంటే చీకటి గదిలోనే ఉంటా

పాకిస్థాన్ పాలకులు నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పార్లమెంట్ చేసిన ఓ చట్ట సవరణను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో ఆయన స్పందించారు. ఈ బానిసత్వాన్ని అంగీకరించడానికి బదులు జైల్లో చీకటి గదిలో జీవించడానికి ఇష్టపడతానని అన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్నివిధాలా అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని తన మద్దతుదారులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. "ప్రజాస్వామ్యంలో నాలుగు అంశాలకు



చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఓటుహక్కు, చట్టబద్ధ పాలన, నైతికత, స్వేచ్ఛాయుత మీడియా, ఇటీవల చేసిన ఇరవై ఆరవ రాజ్యాంగ సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. జులై 6 తరువాత ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని, దేశం మొత్తానికి ముఖ్యంగా పీటీఐ కార్యకర్తలకు, మద్దతు దారులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ బానిసత్వాన్ని అంగీకరించడం కంటే జైల్లో చీకటి గదిలోనే జీవిస్తా " అని ఇమ్రాన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పైనా ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓ నియంత అధికారం లోకి వస్తే అతడికి ఓట్లు అవసరం లేదని, ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో పాలన కొనసాగిస్తాడని విమర్శించారు.

అక్కడి న్యాయవ్యవస్థ పైనా ఇమ్రాన్ మాట్లాడారు. కోర్టుల్లో ఎంపిక చేసిన న్యాయమూర్తులే ఉంటున్నారని, స్వతంత్రంగా వ్యవహరించే వాళ్ళు శక్తిహీనులుగామారిపోతున్నారని అన్నారు. దేశంలో వాక్ స్వాతంత్ర్యం కనుమరుగవుతోందన్న ఇమ్రాన్ నిజాయితీ గల జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

# చక్కని ఆరోగ్యం

## గుండెను కాపాడుతున్న వెల్లుల్లి..?



వెల్లుల్లి లేనిది వంటిల్లే ఉండదు. చాలా వరకు ప్రతి ఒక్కరి ఇంట్లో వెల్లుల్లి ఉంటుంది. ఇంది వంట్లో వేయడం వలన ఆహారపదార్థాలకు మంచి రుచిని ఇవ్వడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మరీ ముఖ్యంగా వెల్లుల్లి ఎక్కువగా తినడం వలన ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందంట.వెల్లుల్లి లేనిది వంటిల్లే ఉండదు. చాలా వరకు ప్రతి ఒక్కరి ఇంట్లో వెల్లుల్లి ఉంటుంది. ఇంది వంట్లో వేయడం వలన ఆహారపదార్థాలకు మంచి రుచిని ఇవ్వడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. మరీ ముఖ్యంగా వెల్లుల్లి ఎక్కువగా తినడం వలన ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందంట. వెల్లుల్లి రక్తపోటును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అధిక రక్తపోటు గుండెపోటు, స్ట్రోక్‌లకు ప్రధాన ప్రమాద కారకం.దీని వల్లనే చాలా మంది గుండె పోటుకు గురి అవుతున్నారు. అయితే వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం లేదా సప్లిమెంట్ రూపంలో తీసుకోవడం వలన ఇది రక్తనాళాల నుంచి రక్తప్రవాహాన్ని మెరుగు పరిచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుందంట. వెల్లుల్లిలోని సారం, సిస్టోలిక్, డయాస్టొలిక్ రక్తపోటును తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లిని ఆహారంలో చేర్చుకోవడం వలన ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడమే కాకుండా, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. అంతే కాకుండా ఇది ధమనులను శుభ్రపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువలన ప్రతి ఒక్కరూ, ప్రతి రోజూ తమ ఆహారంలో వెల్లుల్లిని చేర్చుకోవడం వలన ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుందని చెబుతున్నారు నిపుణులు. వెల్లుల్లి కేవలం రుచిని పెంచేది మాత్రమే కాదు, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే ఔషధ గుణాలకు కూడా ప్రసిద్ధి చెందింది. వెల్లుల్లిలోని అల్లిసిన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతే కాకుండా కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడానికి రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడతాయి. అందుకే వెల్లుల్లిని తప్పని సరిగా తీసుకోవాలి. వెల్లులి ఆహారంలో చేర్చుకోవడం వలన ఇది హృదయ సంబంధ వ్యాధులను దూరం చేయడమే కాకుండా, ఇందులో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాల కూడా పుష్కలంగా ఉంటాయి. వెల్లుల్లిలో విటమిన్లు సి, బి6, మాంగనీస్,సెలీనియం పుష్కలంగా ఉన్నాయి, ఇవన్నీ మెరుగైన రోగనిరోధక పనితీరుకు దోహదం చేస్తాయి. వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జలుబు,ఫ్లూ వచ్చే అవకాశం తగ్గుతుంది.

## గుండెపోటు.. ప్రధాన కారణం ఆహారమేనా?



ప్రస్తుతం చాలా మంది గుండె పోటుతో మరణిస్తున్నారు. దీంతో వైద్యులు మంచిపోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే రోజూ వారీ ఆహారపు అలవాట్లే గుండే పోటు ప్రమాదాన్ని నిశ్శబ్దంగా పెంచుతున్నాయని చెబుతున్నారు కార్డియాలజిస్ట్ నిపుణులు. కాగా,గుండెపోటు రాకుండా ఉండాలంటే? మనం ప్రతి రోజూ తీసుకునే ఆహారమే మన గుండెపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసినటువంటి ఆహారపదార్థాల వలన తెలియకుండానే మనమే గుండె సమస్యలను కొనితెచ్చుకుంటున్నామంట. మరీ ముఖ్యంగా అధిక ఉప్పు, అధిక చక్కెరలు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతున్నట్లు కార్డియాలజిస్ట్ నిపుణులు చేసిన ఓ సర్వేలో వెల్లడైనట్లు తెలుపుతున్నారు. కాగా ఏ ఆహారాలకు దూరం ఉండాలంటే? అల్ట్రా-ప్రాసెస్డ్ స్నాక్స్, ప్రాసెస్ చేసిన ఫుడ్, భోజనం గట్ బాక్టీరియాను అంతరాయం కలిగిస్తాయంట. అంతే కాకుండా ఇది గుండెపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అధికంగా ప్రాసెస్ చేసిన ఫుడ్ తినడం వలన జబ్బులు,జీవక్రియ సమస్యలు ఎక్కువగా వస్తాయని అందుకే సాధ్యమైనంత వరకు వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. ఎర్ర మాంసం , గుడ్లను కూడా ఎక్కువగా తీసుకోకూడదంట. ఈ ఆహారాలు TMAO స్థాయిలను పెంచుతాయి, దీని వలన చెడు కొలెస్ట్రాల్ పెరిగిపోయి, గుండెకు రక్తప్రవాహం సరిగా జరగదంట. అందువలన ఇది గుండెపోటుకు కారణం అయ్యే అవకాశం చాలా ఎక్కువగా ఉన్నందున, వీలైనంత వరకు ఈ రకం ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. కొంత మంది ఆహారంలో ఉప్పును ఎక్కువగా తీసుకుంటుంటారు. అయితే ఇలా తీసుకోవడం ఏమాత్రం మంచిది కాదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. ఉప్పు అధికంగా తీసుకోవడం వలన ఇది రక్తపోటు పెరగడానికి కారణం అవుతుందంట. ఇది గుండె ఆరోగ్యానికి అస్సలే మంచిది కాదని, వీలైనంత వరకు మాసంహారంల, లేదా ఎలాంటిఆహార పదార్థాలు తిన్న అందులో ఉప్పు అధిక మొత్తంలో లేకుండా చూసుకోవాలంట. స్విట్స్ తినడం ఎవరికి ఇష్టం ఉండదు. చాలా మంది ఎంతో ఇష్టంగా స్వీట్స్ తింటుంటారు. ఇక చాలా మంది రాత్రి డిన్నర్ చేసిన తర్వాత స్వీట్స్ తినడానికి ఎక్కువ ఇంట్రెస్ట్ చూపుతారు. కానీ ఇది ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు అని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. దీని వలన రక్తంలో చక్కర స్థాయిలు విపరీతంగా పెరుగుతారంట. అంతే కాకుండా దీని వలన త్వరగా బరువు పెరిగే ఛాన్స్ ఉన్నదంట.

## రక్తదానం చేయాలనుకుంటున్నారా?



రక్తదానం ఓ గొప్ప దాతృత్వ కార్యం. ఒక రక్తపు చుక్క విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకే అవసరమైన సమయాల్లో రక్తదానం చేసేందుకు లక్షలాది మంది ముందుకొస్తుంటారు. అయితే మీరు కూడా రక్తదానం చేస్తారా? రక్తదానం చేసే ముందు కొన్ని ఆహారాలు తప్పక తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. రక్తదానం ఓ గొప్ప దాతృత్వ కార్యం. ఒక రక్తపు చుక్క విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకే అవసరమైన సమయాల్లో రక్తదానం చేసేందుకు లక్షలాది మంది ముందుకొస్తుంటారు. అయితే మీరు కూడా రక్తదానం చేస్తారా? రక్తదానం చేసే ముందు కొన్ని ఆహారాలు తప్పక తినాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

బీట్‌రూట్‌లో నైట్రేట్లు, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచి రక్తాన్ని ఆరోగ్యంగా చేస్తాయి. అందువల్ల రక్తదానం చేసే ముందు బీట్‌రూట్ తీసుకోవడం మంచిది. అలాగే సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో ఇనుము శోషణను పెంచుతుంది. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. రక్త ప్రసరణను నిర్వహించడానికి సహాయపడుతుంది. గుడ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్, విటమిన్ బి12 వీటిలో పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. రక్తదానం చేసిన తర్వాత వచ్చే అలసట, నీరసాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. పాలకూరలో ఐరన్, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి.

ఇవి హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి. అందుకే రక్తదానం చేయడానికి ఒకటి లేదా రెండు రోజుల ముందు పాలకూర తీసుకోవడం మంచిది. బాదంలో ప్రోటీన్, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అవి రక్తదానం చేసిన తర్వాత అలసటను నివారిస్తాయి. నీరు ఎక్కువగా తాగాలి. మన శరీరంలో సగం రక్తం నీటితో తయారవుతుంది. రక్తదాన ప్రక్రియలో మీరు కొంత ద్రవాన్ని కోల్పోయినప్పుడు, రక్తపోటు తగ్గవచ్చు. దీనివల్ల తల తిరుగుతున్నట్లు అనిపించవచ్చు. కాబట్టి నీరు ఎక్కువగా తాగాలి.

## రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించండి..!



రొమ్ము క్యాన్సర్ ఒక ప్రాణాంతక వ్యాధిగా ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతం అవుతుంది. ప్రతి మహిళా తన శరీరంలో జరిగే మార్పులను గమనించడం ఎంతో అవసరం. రొమ్ము క్యాన్సర్ కు సంబంధించి కనిపించే ముఖ్యమైన లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రొమ్ము క్యాన్సర్ అనేది మహిళల్లో సర్వసాధారణంగా కనిపించే ఆరోగ్య సమస్య. వయసుతో సంబంధం లేకుండా ఎంతో మందిని ఇది ప్రభావితం చేస్తోంది. లక్షణాలను ముందుగానే గుర్తించి.. సరైన వైద్య సహాయం తీసుకుంటే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే ప్రతి మహిళా తన శరీరంలో జరిగే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. రొమ్ము క్యాన్సర్‌కు ముందు కనిపించే కొన్ని ముఖ్యమైన లక్షణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. రొమ్ముల్లో ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా చిన్న చిన్న వాపులు కనిపించడం సాధారణం కాదు. ఇలాంటి అసాధారణ మార్పు కనిపిస్తే వెంటనే డాక్టర్ ను కలవడం మంచిది. రొమ్ము చర్మం సాధారణంగా సాఫీగా ఉండాలి. కానీ ఒక్కసారిగా చర్మం లోపలికి లాగబడటం, చిన్న గుంతలుగా మారడం కనిపిస్తే అది హెచ్చరిక కావచ్చు. ఇలాంటి మార్పులు గమనిస్తే వెంటనే డాక్టర్ కి చూపించాలి. అప్పుడప్పుడు వచ్చే నొప్పి సాధారణమే అయినా.. నెలసరి సమయం కాకుండా రొమ్ముల్లో ఏదైనా ప్రత్యేకమైన భాగంలో అనుకోని నొప్పి వస్తుంటే అది ముఖ్యమైన విషయం. ఇది రొమ్ము క్యాన్సర్ కు సూచన కావచ్చు. రొమ్ముల్లోని ముఖ్యమైన భాగం నిపుల్. కొన్ని సందర్భాల్లో ఇది లోపలికి ముడుచుకుపోవడం. ఆకారం మారడం వంటి మార్పులు వస్తే అవి సాధారణంగా కనిపించకపోవచ్చు. అలాంటి మార్పులను గుర్తించిన వెంటనే డాక్టర్ ను సంప్రదించాలి. ఇన్ఫెక్షన్లు లేనప్పటికీ రొమ్ము చర్మంపై ఎరుపు రంగు రావడం, పొడిబారడం కూడా రొమ్ము క్యాన్సర్ సూచన కావచ్చు. ముఖ్యంగా ఇవి నిపుల్ చుట్టూ గానీ.. రొమ్ముపై గానీ కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. బిడ్డకు పాలు పట్టినప్పుడు కాకుండా లేదా ప్రసవం జరగని మహిళల్లో కూడా నిపుల్ నుంచి ఏదైనా ద్రవం లేదా రంగుతో కూడిన స్రావం వస్తే.. అది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. ఇలాంటి మార్పు గమనించిన వెంటనే డాక్టర్ ను సంప్రదించడం చాలా ముఖ్యం. ఒకవేళ రొమ్ము లోపల గడ్డలా ఉండటం గానీ లేదా చంక భాగంలో గట్టిగా ఉండే మార్పు కనిపిస్తే కూడా అది ఒక ప్రాథమిక సంకేతం కావచ్చు. అన్ని గడ్డలు క్యాన్సర్ కు సూచన కావు.. కానీ నిర్ధారణ కోసం వైద్య పరీక్షలు అవసరం. రొమ్ము క్యాన్సర్ పై అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ప్రతి మహిళ నెలకు ఒక్కసారైనా స్వయంగా తన శరీరంలో మార్పులు గమనిస్తూ ఉండాలి. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే డాక్టర్ సలహా తీసుకోవాలి. మొదటి దశలోనే ఈ వ్యాధిని గుర్తిస్తే నయం అయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

## ఈ మొక్కలు మీ ఇంట్లో ఉంటే...

### చక్కటి ఆరోగ్యం, మెరిసే అందం మీ వెంటే..!



శతాబ్ధాల కాలం నుంచి మన ఆయుర్వేదంలో ఎన్నో రకాల మొక్కలను పలు రకాల చికిత్సలకు మెడిసిన్‌గా వాడుతున్నారు. ఇవన్నీ మన శరీర ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో కొన్నింటిని మనం ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. ప్రకృతిలో లభించే అనేక రకాల మొక్కలు, చెట్లు ఆయుర్వేద ఔషధాలుగా పనిచేస్తాయి. శతాబ్ధాల కాలం నుంచి మన ఆయుర్వేదంలో ఎన్నో రకాల మొక్కలను పలు రకాల చికిత్సలకు మెడిసిన్‌గా వాడుతున్నారు. ఇవన్నీ మన శరీర ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో కొన్నింటిని మనం ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. పుదీనా: పుదీనా ఆకులు.. వీటి వాసన చూస్తేనే మూడ్ అంతా రిఫ్రెష్ అయిన ఫీలింగ్ కలుగుతుంది. వంటల్లోనూ మంచి రుచి, వాసన అందించడానికి పుదీనాను వాడుతుంటారు. పుదీనా వంటల టేస్ట్ పెంచడానికే కాదు.. మన ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది. రోజూ కొన్ని పుదీనా ఆకులు మన ఆహారంలో భాగంగా తీసుకుంటే.. అనేక ఆరోగ్య ప్రయోజనాలు సొంతం చేసుకోవచ్చని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా టీ, సాస్, స్వీట్లు మొదలైన వాటికి రుచి, సువాసన కోసం దీన్ని కలుపుతారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, ఉబ్బరం తగ్గిస్తుంది.కరివేపాకు: పప్పు, సాంబారు వంటి అన్ని వంటకాల్లో కరివేపాకు వాడతారు. కరివేపాకు ఆకులలో క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పోషకాలతోపాటు విటమిన్-సి, విటమిన్-బి, విటమిన్-ఇలు అధికం. రోజూ దీన్ని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల బోలెడన్ని ప్రయోజనాలు పొందుతారు. మధుమేహులకు ఇది సరైన ఆహారం. నాడీసంబంధిత వ్యాధుల్నీ, క్యాన్సర్లనీ అడ్డుకుంటుందట. ఇందులో ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.లెమన్ గ్రాస్: సువాసనతో కూడిన మొక్క లెమన్ గ్రాస్. దీన్ని టీ, సూప్, థాయ్ వంటకాల్లో వాడతారు. ఈ మొక్క ఔషధ గుణాలతో నిండి ఉంది. యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్. ఇన్ఫెక్షన్, బ్యాక్టీరియా నుండి శరీరాన్ని రక్షిస్తుంది. లెమన్ గ్రాస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా లభిస్తాయి. రక్తంలో బ్యాడ్ కొలెస్ట్రాల్ లెవల్స్ ను కూడా తగ్గిస్తుంది. ఈ లెమన్ గ్రాస్‌లో అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి శరీరంలోని ఇమ్యూనిటీ వ్యవస్థను పటిష్ట పరుస్తుంది. వ్యాధులు, రోగాలతో పోరాడే శక్తిని ఇస్తాయి.

గిలోయ్: రోగనిరోధక శక్తిని పెంచే గుణాలకు ప్రసిద్ధి చెందినది గిలోయ్. ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. తిప్పతీగ లో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. వీటిని మెడిసిన్స్ తయారీలో కూడా ఉపయోగిస్తారు. తిప్పతీగ ఆకులను రోజుకు రెండు తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తిని బాగా పెంచి ఎక్కువ వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. డయాబెటిక్ సమస్యలు ఉన్నవారు తిప్పతీగ చూర్ణం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం తీసుకుంటే షుగర్ లెవెల్స్ ను కంట్రోల్ లో ఉంచుకోవచ్చు.తులసి: హిందూ మతంలో తులసికి ప్రత్యేక ప్రముఖ్యత ఉంటుంది. వారిలో దాదాపు ప్రతి ఒక్కరి ఇంటి ముంగిట తులసి చెట్టు కనిపిస్తుంది. ఎందుకంటే తులసి చెట్టును లక్ష్మీదేవి స్వరూపంగా భావిస్తారు. అందుకే ప్రతిరోజూ తులసి చెట్టుకు నీరు పోసి ఉదయం, సాయంత్రం దీపాలు వెలిగిస్తారు. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. అయితే, తులసి మొక్క కేవలం మతపరమైన ప్రాముఖ్యతలకు మాత్రమే కాదు..పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుందని ఆయుర్వేదం చెబుతుంది. తులసికి అనేక ఔషధ గుణాలున్నాయి. ఇది మీ శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది, దగ్గును తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

# సినిమా






## ‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్‌లో బాలకృష్ణ!

తెలుగు యువతను విశేషంగా ఆకట్టుకున్న సినిమాలలో ‘ఈ నగరానికి ఏమైంది?’ ఒకటి. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ని అందుకుంది. అయితే ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకుల ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా సీక్వెల్‌ను ప్రకటించాడు దర్శకుడు తరుణ్ భాస్కర్. ‘ఈ%చీ%ఈ రిపీట్’ అనే టైటిల్‌తో ఈ సీక్వెల్ రాబోతుండగా.. విశ్వక్ సేన్, సాయిసుశాంత్‌రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఈ సీక్వెల్‌లో కూడా హంగామా చేయనున్నారు. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో నటుడు నందమూరి బాలకృష్ణ (%దీుశ్రీఖనితీఅంష్ట్రఖు%) అతిథి పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. విశ్వక్ సేన్‌కి బాలయ్య అంటే ప్రత్యేక అభిమానం. ఇప్పటికే ఈ విషయాన్ని చాలాసార్లు పలు ఇంటర్వ్యూలో చెప్పుకోచ్చాడు. అయితే ఈ రిలేషన్‌తోనే బాలయ్యని ‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్‌లో నటించమని విశ్వక్ అడిగినట్లు తెలుస్తుంది. దీనికి బాలయ్య కూడా ఒకే చెప్పినట్లు సమాచారం. అయితే ఇది నిజమో కాదో తెలియాలంటే సినిమా వచ్చేవరకు ఆగాల్సిందే. సురేష్ ప్రొడక్షన్ బ్యానర్‌పై డి.సురేశ్‌బాబు, సృజన్ యరబోలు నిర్మిస్తున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నాడు.

## అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని మరెవరూ టచ్ చేయలేరు..

పుష్ప2 సినిమా అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని ఆకాశానికి చేర్చిందనేది తెలిసిందే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనేక మంది టాప్ స్టార్స్ ఉండగా ఒక్కసారిగా వీరందరినీ మన బన్నీ దాటేశాడు. తన తదుపరి సినిమాకి ఏకంగా రూ. 300కోట్ల రెమ్యునరేషన్ అందుకుంటున్నాడనే వార్త టాప్ బాలీవుడ్ స్టార్స్‌కి కూడా దిమ్మదిరిగిపోయేలా షాక్ ఇచ్చింది. ఓ వైపు ఎంతో కాలంగా ఇంటర్నేషనల్ స్టార్స్‌గా వెలుగొందుతున్న ఎందరో బాలీవుడ్ హీరోలు, మరోవైపు ఇటీవలే గ్లోబల్ స్టార్స్‌గా మారిన దక్షిణాది హీరోలు.. మరి వీరందరిలో భవిష్యత్తులో బన్నీని బీట్ చేయగల హీరో ఎవరు? అనే ప్రశ్నలు చర్చలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ స్టార్‌డమ్‌ని బీట్ చేయడం ఇప్పట్లో మరెవరికీ సాధ్యం కాదు ఓ టాప్ డైరెక్టర్ తేల్చేయడం విశేషం. ఆయన కూడా సాదా సీదా హిందీ సినిమాల దర్శకుడేమీ కాదు అనేక హిట్ చిత్రాలు అందించిన అగ్రగామి బాలీవుడ్ దర్శకుడు మధర్ భండార్కర్ తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ అభిప్రాయం వ్యక్తం చేయడం సంచలనంగా మారింది. “సమీప రోజుల్లో, ఎవ్వరూ కూడా అల్లూ అర్జున్ దక్కించుకున్న క్రేజ్‌ను కనీసం తాకలేరు. ఆయన నిజమైన పాన్‌ఇండియా స్టార్” అని మధుర్ భండార్కర్ అన్నారు. అంతేకాదు.. పుష్ప సినిమా కోసం అల్లు అర్జున్ ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన తీరు. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ భారీగా మాస్ ఆకర్షణను సంపాదించి పెట్టిందని ప్రాంతాలకతీతంగా అల్లు అర్జున్‌ను ప్రేక్షకులతో కనెక్ట్ చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు. పుష్ప సినిమా విజయం గతంగా మారిపోయినా ఇప్పటికీ అల్లు అర్జున్‌ను ప్రశంసిస్తున్న వారి జాబితా అంతకంతకూ పెరిగిపోతుండడం విశేషం. బన్నీని ఆకాశానికి ఎత్తేస్తున్న బాలీవుడ్ ప్రముఖుల్లో మధుర్ భండార్కర్ మాత్రమే కాదు అల్లు అర్జున్ మాత్రమే పుష్ప చేగలడంటూ బాలీవుడ్ టాప్ హీరో హృతిక్ రోషన్ అన్నాడు. అతని ఎనర్జీ ఎక్స్‌ట్రార్డినరీ అంటూ యువ హీరో కార్తీక్ ఆర్యన్ పొగిడితే...ఐకాన్‌స్టార్‌తో ఒక్కసినిమాలో అయినా నటించాలని ఉందని బాలీవుడ్ నటి అనన్య పాండే తపిస్తున్నారు. అతని లాంటి డ్యాన్సర్‌ని చూడలేదని టాప్ కొరియోగ్రాఫర్ ఫరాఖాన్ తేల్చేశారు. ఆయన ఎనర్జీ మరెవరికీ సాధ్యం కాదు అని బాలీవుడ్‌లో ఎనర్జిటిక్ హీరోగా పేరున్న షాహిద్ కపూర్ ఒప్పేసుకున్నాడు. అతనో స్టైల్ ఐకాన్ అంటూ మరో బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌లు...అభివర్ణించాడు. ఇలా ఎందరో బన్నీపై భారీ స్థాయిలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న అల్లు అర్జున్ అట్లీల సినిమా పై అంచనాలను వీరి అభిప్రాయాలు మరింతగా పెంచేస్తున్నాయనేది నిజం. ఈ నేపథ్యంలో ఆ స్థాయి అంచనాలను అందుకోవడానికి బన్నీ అట్లీ ద్వయం మరింతగా కృషి చేయకతప్పదు.



## చివరి శ్వాస వరకు నటిగానే ఉంటా.. ‘డాక్టర్’ రూమర్‌పై హీరోయిన్ క్లారిటీ

కోమలి ప్రసాద్ నటిగా తెలుగు తెరపై తనకు వచ్చి అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి నటిగా పేరు సంపాదించుకున్నారు. ఇక త్వరలోనే ‘శశివదనే’ చిత్రంతో తెరపైకి రాబోతోన్నారు. ఈలోపు కోమలి ప్రసాద్ మీద సోషల్ మీడియా, మీడియాలో ఓ అసత్య ప్రచారం మొదలైంది. యాక్టింగ్ కెరీర్‌ను వదిలి పెట్టారని, డాక్టర్ వృత్తిలోకి వెళ్లారని కోమలి ప్రసాద్ మీద రూమర్లు క్రియేట్ చేశారు. దీంతో ఈ వార్తల్ని ఖండిస్తూ కోమలి ప్రసాద్ సోషల్ మీడియాలో పోస్ట్ వేశారు. ‘అందరికీ నమస్కారం. నేను డాక్టర్ అయ్యానని, నటనకు పూర్తిగా దూరం అయ్యానంటూ అసత్య ప్రచారాలు, తప్పుదోవ పట్టించే వార్తల్ని ప్రచురిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు కూడా ఈ రూమర్లను నిజం అన్నట్టుగా ప్రచారం చేస్తున్నాయి. కానీ ఇందులో ఎలాంటి నిజం లేదని అందరికీ స్పష్టంగా తెలియజేయాలని అనుకుంటున్నాను. ఎన్నో కష్టాలు ఎదుర్కొని, ఎంతో కష్టపడి ఇప్పటి వరకు సినిమాల్లో కెరీర్‌ను కొనసాగిస్తూ ఈ స్థాయి వరకు వచ్చాను. ఆ శివుని ఆశీస్సులతో నా కెరీర్‌ను ముందుకు సాగిస్తున్నాను. నాలో, నా శ్రేయోభిలాషులలో అనవసరమైన ఆందోళనలను రేకెత్తించేలా ఈ రూమర్లను ప్రచారం చేస్తున్నారు. ఇలా తప్పుదారి పట్టించే సమాచారం వ్యాప్తి చెందకూడదని నేను కోరుకుంటున్నాను. అందుకే ఈ స్పష్టతనిస్తూ పోస్ట్ వేస్తున్నాను. చివరి శ్వాస వరకు నటిగా నా బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాను. ఈ ప్రయాణంలో నా వెన్నెంటే ఉన్న నా శ్రేయోభిలాషులందరికీ, నా కంటే నన్ను ఎక్కువగా నమ్మిన వారందరికీ ధన్యవాదాలు. నేను ప్రస్తుతం నా స్క్రిప్ట్‌లను జాగ్రత్తగా ఎంచుకుంటున్నాను. త్వరలో కొత్త ప్రకటనలతో మీ అందరినీ చాలా గర్వపడేలా చేస్తాను’ అని కోమలి ప్రసాద్ అన్నారు



## బాలీవుడ్‌లో అవకాశాలు.. నా అభిమానులను బాధపెట్టే సినిమాలు చేయను



మంచు విష్ణు తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పను బాలీవుడ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్‌తో తీశారు. టాలీవుడ్‌లో ఎవరూ దొరకలేదా? అంటే? వరుస ఫ్లాపులు అందుకున్న తనతో కన్నప్ప వంటి మైథాలజీ సినిమా తీసేందుకు ఎవరూ ముందుకు రారని అసలు విషయం చెప్పారు. అందుకే మహాభారత్ సీరియల్ తీసిన ముకేశ్‌తో కన్నప్ప సినిమాను తెరకెక్కించినట్లు వెల్లడించారు. మరి హీరోగా బాలీవుడ్‌లో అడుగుపెట్టే ఆలోచనలేమైనా ఉన్నాయా? అంటే విష్ణు ఇలా స్పందించారు. ఇండియా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు మాట్లాడుతూ.. చాలాకాలం క్రితం హిందీలో సినిమా చేయమని కొందరు నన్ను సంప్రదించారు. కానీ వారు ఆఫర్ చేసినవేవీ నాకు నచ్చకపోవడంతో అక్కడ సినిమాలు చేయలేదు. పైగా నటుడిగా నాకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నాను. అదే సమయంలో అభిమానుల ప్రేమను పొందాను. వారిని నేను గౌరవించాల్సిన అవసరం ఉంది. ఏవి పడితే అవి చేసి వారిని నేను బాధపెట్టలేను. ఉదాహరణకు స్టార్ హీరో అజిత్‌ను తీసుకుందాం. ఆయన ఇండియాలోనే పెద్ద సూపర్‌స్టార్స్‌లో ఒకరు. షారూఖ్ ఖాన్ అశోక మూవీలో ఆయన సైడ్ రోల్ చేశారు. అది నాకు నచ్చలేదు. అజిత్ అన్నతో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు.. మీరు ఇంత చిన్న పాత్ర చేసినందుకు నిరాశచెందాను అని చెప్పాను. అందుకాయన చిన్నగా నవ్వి సైలెంట్‌గా ఉండిపోయారు. కాబట్టి ఏదో ఒక రోల్.. అని లైట్ తీసుకుని సినిమా చేయలేను. జనాలకు నచ్చినా, నచ్చకపోయినా నా ఇష్టమొచ్చిన సినిమాలు చేస్తా అని సెల్ఫిష్‌గా ఆలోచించలేను అని విష్ణు చెప్పుకొచ్చారు. కన్నప్ప సినిమా విషయానికి వస్తే.. విష్ణు తిన్నడు/కన్నప్పగా నటించారు. అక్షయ్ కుమార్, ప్రభాస్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, కాజల్ ముఖ్య పాత్రలు పోషించారు. జూన్ 27న విడుదలైన ఈ చిత్రానికి పాజిటివ్ టాక్ లభించింది.

# కోవిడ్19 వ్యాక్సిన్ వల్ల గుండెపోటు

**ముంబై :** కొన్నేళ్లుగా దేశంలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు సంబంధించి ఉన్న భయాలకు సమాధానం దొరికింది. భారతదేశంలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు కరోనా వ్యాక్సిన్‌కు ఎలాంటి సంబంధం లేదని తేలింది. ఎఐఎమ్‌ఎస్, ఐసీఎమ్‌ఆర్ లు చేసిన కొత్త అధ్యయనంలో ఈ విషయాన్ని తేల్చారు. నివేదిక ప్రకారం, గత నాలుగైదు ఏళ్లుగా ఆకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు కారణం కోవిడ్19 వ్యాక్సిన్ కాదు. కానీ ఇప్పటికే ఉన్న అనారోగ్య సమస్యలు, వ్యాధులు, చెడు జీవనశైలి, వంశపారంపర్యంగా తలెత్తిన అనారోగ్య కారణాలు వల్ల మరణాలు సంభవిస్తున్నాయని ఐసీఎంఆర్, ఏయిమ్స్ అధ్యయనంలో తేలింది. ఎవరికైనా గుండె సంబంధిత సమస్యలు, షుగర్ లేదా అధిక రక్తపోటు వంటివి ఉంటే, జన్యుపరంగా సమస్యలు ఉన్నా.. వెంటనే చికిత్స తీసుకోకపోతే ప్రాణాలు పోయే అవకాశం ఉంటుంది. కనుక దేశంలో ఇటీవల పెద్దలతో పాటు యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు కోవిడ్19 వ్యాక్సిన్‌తో సంబంధం లేదని స్పష్టం చేశారు. తాజాగా అధ్యయనం ప్రకారం కోవిడ్19 వ్యాక్సిన్ సురక్షితమైనదని. కనుక కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వారు దీని గురించి భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. అధ్యయనంలో కరోనా వ్యాక్సిన్‌కు, అకస్మాత్తుగా సంభవించే మరణాలకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. చాలా సందర్భాల్లో గతంలో ఉన్న అనారోగ్య సమస్యలు, ఇప్పటికే ఉన్న వ్యాధులు, వంశపారంపర్య కారణాలు, అనారోగ్యకరమైన జీవనశైలి వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. అదే సమయంలో కోవిడ్19 వ్యాక్సిన్ల వల్ల కలిగే తీవ్రమైన దుష్ప్రభావం చూపడం చాలా అరుదు. ముఖ్యంగా 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిలో గుండెపోటుతో అకస్మాత్తుగా సంభవించిన మరణాలను పరిశోధించడానికి రెండు ముఖ్యమైన అధ్యయనాలు నిర్వహించారు. ఈ శాస్త్రీయ అధ్యయనాలలో యువత, మధ్య వయస్కులోనూ అకస్మాత్తుగా సంభవిస్తున్న మరణాలకు కోవిడ్ టీకాలు తీసుకోవడం కారణం కాదని తేలింది. గుండెపోటుతో పాటు చెడు జీవనశైలి, ఇప్పటికే ఉన్న వ్యాధులు, మనకు తెలియకుండా పెరిగిన అనారోగ్య సమస్యలు, వంశపారంపర్య సమస్యలు కారణాలు కారణమని పేర్కొన్నాయి. మే నుంచి ఆగస్టు 2023 మధ్య దేశంలోని 19 రాష్ట్రాల్లోని 47 పెద్ద ఆసుపత్రులలో ఎఐఎమ్‌ఎస్ ఈ అధ్యయనం నిర్వహించింది. అక్టోబర్ 2021 నుండి మార్చి 2023 మధ్య పూర్తిగా ఆరోగ్యంగా కనిపించిన వ్యక్తులు అకస్మాత్తుగా మరణించిన కేసులను నిపుణులు పరిశీలించారు. ఈ మరణాలకు, కోవిడ్ వ్యాక్సిన్లు తీసుకోవడానికి ఎలాంటి సంబంధం లేదని నివేదిక స్పష్టం చేసింది.ఐసీఎమ్‌ఆర్ ఢిల్లీ, ఎఐఎమ్‌ఎస్ ల రెండో రీసెర్చ్ ఇంకా కొనసాగుతోంది. అకస్మాత్తుగా సంభవించే మరణాలకు గల కారణాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడం ఈ అధ్యయనం ముఖ్య లక్ష్యం. ప్రారంభ ఫలితాలలో గుండెపోటు (మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్) సర్వసాధారణ కారణమని తేలింది. ఈ మరణాలకు వంశపారంపర్య కారణాలు సైతం కారణమని చాలా సందర్భాల్లో గుర్తించారు. ఇప్పటివరకు ఉన్న గణాంకాల ప్రకారం, గత కొన్నేళ్లతో పోల్చితే అకస్మాత్తుగా సంభవించే మరణాల సంఖ్యలో ఎటువంటి అసాధారణ పెరుగుదల కనిపించలేదు.



# నాకు ఇంకేం ఆప్షన్ ఉంది చెప్పండి?

**బెంగళూరు:** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం కొట్టిపారేశారు. ఐదేళ్లపాటు తానే సీఎంగా కొనసాగుతానని, అందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని మీడియాతో అన్నారాయన. అయితే కాసేపటికే ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. "నాకు ఇంకేం ఆప్షన్ ఉంది చెప్పండి. ఆయనకు మద్దతుగా నిలవడం తప్ప.." అంటూ డీకేఎస్ బదులిచ్చారు. "నన్ను సీఎంగా చేయాలని నేరు ఎవరినీ కోరలేదు. నాకు మద్దతుగా మాట్లాడమని ఎవరినీ పురమాయించలేదు. ఆ అవసరం కూడా నాకు లేదు. ఒకరు సీఎం ఉన్నప్పుడు.. ఇలాంటి ప్రకటనలు ఎందుకు?. పార్టీలో నాతో పాటు లక్షల మంది పని చేస్తున్నారు. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం" అని స్పష్టం చేశారాయన. అంతకుముందు.. సీఎం మార్పు ప్రచారంపై సీఎం సిద్ధరామయ్య కాస్త కటువుగానే స్పందించారు. యస్.. ఐదేళ్లు నేనే సీఎంగా కొనసాగుతా. అందులో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. మార్పు ఉందని చెప్పడానికి వాళ్లు(బీజేపీ, జేడీఎస్)ఏమైనా కాంగ్రెస్ అధిష్టానమా? అని మీడియాను ఎదురు ప్రశ్నించారాయన. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తర్వాత.. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా, డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు. అయితే అప్పట్లోనే ఇద్దరూ రెండున్నరేళ్ల చొప్పున పదవిని పంచుకుంటారని ప్రచారం జరిగింది. కానీ, ఆ ప్రచారాన్ని ఇద్దరూ తోసిపుచ్చారు. కట్ చేస్తే.. ఈ ఏడాది జూన్ 29వ తేదీన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్.. 2%-%3 నెలల్లో డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారు అని వ్యాఖ్యానించడంతో అసలు చర్చ మొదలైంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. ముఖ్యమంత్రి మార్పుపై నిర్ణయం హైకమాండ్ తీసుకుంటుంది అని బదులిచ్చారు. అయితే.. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ సెటైర్లు వేసింది. పార్టీ అధ్యక్షుడే హైకమాండ్ కాకపోతే మరెవరు?" అని ప్రశ్నించింది. మరోవైపు జేడీఎస్ కూడా ఈ వ్యవహారంలో కాంగ్రెస్‌ను ఎద్దేవా చేస్తూ సీఎం మార్పు తథ్యమన్నట్లు ప్రకటనలు ఇచ్చింది. ఈ తరుణంలో.. ఇటు సిద్ధరామయ్య, అటు శివకుమార్‌లు ఈ వ్యాఖ్యలను ఖండించారు.



**హుస్సేన్‌కు నోటీసులు ఇస్తాం: డీకేఎస్**

సీఎం మార్పు ప్రచారాన్ని ఖండించిన డీకే శివకుమార్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్‌కు నోటీసు ఇస్తాం. ఆయన వ్యాఖ్యలపై వివరణ కోరతాం. పార్టీ నియామావళికి అందరూ కట్టుబడి ఉండాలి.. క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోకతప్పదు అని డీకే శివకుమార్ హెచ్చరించారు.

## షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్షపడింది. కోర్టు ధిక్కరణ కేసులో బంగ్లా న్యాయస్థానం ఆమెకు ఈ శిక్ష విధించిందని బుధవారం(జులై 2న) అక్కడి మీడియా కథనాలు ఇస్తోంది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. అయితే.. గత ఏడాది అక్టోబర్‌లో షేక్ హసీనా.. రాజకీయ నాయకుడు షకీల్ అకాండ్ బుల్బుల్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ అయ్యింది. అందులో న్యాయవ్యవస్థను బెదిరించేలా ఉన్న వ్యాఖ్యలపై కోర్టు ధిక్కార కేసు నమోదైంది. ఈ వ్యాఖ్యలకుగానూ హసీనాకు ఆరు నెలలు, షకీల్ బుల్బుల్‌కు 2 నెలల జైలు శిక్ష విధిస్తూ జస్టిస్ ఎం.డి. గోలం మోర్తుజా మొజుందర్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం తీర్పు ప్రకటించింది. ఇదిలా ఉంటే.. ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు 30 శాతం కోటా కొనసాగించాలన్న ప్రభుత్వం నిర్ణయంపై నిరుద్యోగులు కిందటి ఏడాది జూన్‌లో ఆందోళన చేపట్టారు. హైకోర్టు ఈ కోటాను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో.. నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. సుప్రీంకోర్టు స్టే ఇచ్చినప్పటికీ, నిరసనలు తగ్గలేదు. క్రమంగా ఆ ఆందోళన హింసాత్మకంగా మారింది. ఘర్షణల్లో 300 మందికి పైగా మరణించగా.. వేలాది మందికి గాయాలయ్యాయి. కర్ఫ్యూ, ఇంటర్నెట్ షట్‌డౌన్, సైన్యం మోహరింపు వంటి కఠిన చర్యలు తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాలేదు. చివరకు.. షేక్ హసీనా రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆందోళనలు ప్రధాని నివాసాన్ని తాకడంతో.. ఆమె అక్కడి నుంచి భారత్‌కు వచ్చేశారు. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఆమె రాజీనామా అనంతరం, తాత్కాలిక ప్రధానిగా నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ బాధ్యతలు స్వీకరించారు.

# మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ రిలీఫ్



ఈ ఏడాది ఆరంభంలో ఆదాయపన్నులో రాయితీలతో వేతన జీవులకు కొంత ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. నిత్యావసర వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) భారాన్ని తగ్గించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని పలు వస్తువులను 5 శాతం శ్లాబులోకి మార్చడం వంటి ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంట పాత్రలు, గీజర్‌లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్‌లు, సైకిళ్లు, రూ.1,000 కంటే ఎక్కువ ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు, రూ.500 నుంచి రూ.1,000 మధ్య గల చెప్పులు, స్టేషనరీ వస్తువులు, వ్యాక్సిన్‌లు, సిరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలు వంటివి జీఎస్టీ తగ్గింపు జాబితాలో ఉన్నట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఈ నిర్ణయం అమలైతే ప్రతిపాదిత జాబితాలోని వస్తువులు తక్కువ ధరకే అందుబాటులోకి రానున్నాయి. ఈ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలపై కొంత భారం తగ్గనుంది.

ఈ మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాపై సుమారు రూ. 40,000 కోట్ల నుంచి రూ. 50,000 కోట్ల భారం పడొచ్చని అంచనా. అయినప్పటికీ, ధరలు తగ్గితే వినియోగం పెరిగి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఇటీవలే పరోక్షంగా సంకేతాలిచ్చిన విషయం తెలిసిందే. రాబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల చివర్లో జీఎస్టీ సమావేశం జరగొచ్చని సదరు వర్గాలు సూచిస్తున్నాయి.

## డాక్టర్లు ఒక నెలరోజులు సామాజిక బాధ్యత

**ముంబై :** వైద్యులు ఏడాదిలో ఒక నెలరోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలని రేవంత్ రెడ్డి కోరారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందన్నారు. హైదరాబాద్ ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్ ను అందుబాటులోకి తెచ్చినం డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఆయన హైదరాబాద్, తెలంగాణకు గొప్ప పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు.డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చింది. అయితే ఆయన భారతరత్నకు అర్హులు అని, ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి నా వంతు ప్రయత్నం చేస్తా అని సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చారు.ఏఐజీ ఆసుపత్రిలో 66 దేశాల నుంచి పేషంట్స్ ట్రీట్మెంట్ కు వస్తున్నారు.. ఇది గర్వకారణం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్ గా ఉంటుందని తెలిపారు.హైదరాబాద్ ను హెల్త్ టూరిజం హబ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నాం, అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందిసెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకి హెల్త్ ప్రొఫైల్ కార్డుని క్రియేట్ చేస్తాం. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయి. ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ ఉంటున్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేసే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి అన్నారు.మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్ కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రపంచదేశాలతో పోటీ పడగలుగుతున్నామని తెలిసేలా చేశాం. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించాం. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో వెళ్తున్నామని తెలంగాణ సీఎం అన్నారు

## విద్యార్థినినీ ట్రాప్ చేసిన లేడీ టీచర్


**ముంబై :** ఒక స్టూడెంట్‌ను లేడీ టీచర్ ట్రాప్ చేసింది. అతడికి ఆందోళన తగ్గించే మందులు ఇచ్చి ఏడాదిగా అత్యాచారానికి పాల్పడింది. విద్యార్థి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు అతడ్ని ఆరా తీయగా అసలు విషయం చెప్పాడు. దీంతో పేరెంట్స్ ఫిర్యాదుతో ఆ ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ప్రముఖ విద్యా సంస్థలో 40 ఏళ్ల లేడీ టీచర్ ఇంగ్లీష్ బోధిస్తున్నది. వివాహిత అయిన ఆ మహిళకు పిల్లలు కూడా ఉన్నారు.కాగా, 2023 డిసెంబర్‌లో స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా డ్యాన్స్ బృందంలో ఉన్న 11వ తరగతి చదువుతున్న 16 ఏళ్ల మగ విద్యార్థి పట్ల ఆ ఉపాధ్యాయురాలు ఆకర్షితురాలైంది. 2024 జనవరిలో లైంగిక సంజ్ఞలతో అతడ్ని కవ్వించింది. అయితే తొలుత ఆ విద్యార్థి ఆసక్తి చూపలేదు. ఆ లేడీ టీచర్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో తన ఫ్రెండ్ సహాయాన్ని ఆమె కోరింది. ఆ విద్యార్థితో ఆమె మాట్లాడింది. మధ్యవయసు మహిళలు, టీనేజ్ అబ్బాయిల మధ్య సంబంధాలు చాలా సాధారణమని చెప్పింది. దీంతో లేడీ టీచర్‌ను కలిసేందుకు అతడు అంగీకరించాడు. మరోవైపు ఆ విద్యార్థిని ఉపాధ్యాయురాలు కారులో ఒకచోటకు తీసుకెళ్లింది. బలవంతంగా అతడి బట్టలు విప్పి లైంగికంగా వేధించింది. కొన్ని రోజులపాటు ఆ యువకుడు ఆందోళన చెందగా యాంటీ యాంగ్జైటీ మాత్రలు ఇచ్చింది. ఆ తర్వాత ఆ స్టూడెంట్‌ను ముంబైలోని ఫైవ్‌స్టార్ హోటల్స్, ఎయిర్‌పోర్ట్ సమీపంలోని స్టార్ హోటల్స్‌కు చాలాసార్లు కారులో తీసుకెళ్లింది. అతడికి మద్యం తాగించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడింది.కాగా, ఆ విద్యార్థిలో మార్పును అతడి పేరెంట్స్ గమనించారు. అతడ్ని నిలదీయగా లేడీ టీచర్‌తో ఉన్న రిలేషన్ గురించి చెప్పాడు. అయితే తమ కుమారుడి చదువు ప్రభావితం కాకుండా ఉండేందుకు కొంతకాలం వారు మౌనంగా ఉన్నారు. అతడ్ని కట్టడి చేశారు. 12వ తరగతి బోర్డు పరీక్షల తర్వాత ఆ విద్యార్థి ఆ స్కూల్ నుంచి వెళ్లిపోయాడు. అయితే తన పనిమనిషి ద్వారా అతడ్ని ఆ టీచర్ సంప్రదించింది. తనను కలవాలని చెప్పింది.మరోవైపు ఈ విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయురాలిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టంతోపాటు పిల్లల సంరక్షణ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు తర్వాత ఆ లేడీ టీచర్‌ను అరెస్ట్ చేశారు. ఆమె వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఉపాధ్యాయురాలికి సహకరించిన ఆమె ఫ్రెండ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## హిమాచల్‌ప్రదేశ్‌కు కేంద్రం సవతితల్లి ట్రీట్‌మెంట్



హిమాచల్‌ప్రదేశ్‌కు కేంద్రం సవతితల్లి తల్లి ట్రీట్‌మెంట్ ఇస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధుల మంజూరులో కేంద్రం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో 2023లో హిమాచల్‌ప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, దాంతో రూ.9000 కోట్ల నిధులు మంజూరు చేయాలని అక్కడి ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని ఖర్గే తెలిపారు. అయితే రెండేళ్లయినా పెండింగ్ నిధులు మంజూరు చేయకుండా కేంద్రం తాత్సారం చేస్తోందని ఖర్గే విమర్శించారు. 2023లో హిమాచల్‌ప్రదేశ్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ రూ.4,500 కోట్లు ఇచ్చిందని, కేంద్రం కేవలం రూ.433 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. 2023 పెండింగ్ నిధుల పేరుతో కేంద్రం ఇప్పుడు రూ.2000 కోట్లు ప్రకటించి క్రెడిట్ మొత్తం తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పుడు కూడా భారీ వర్షాలు, వరదలతో హిమాచల్‌ప్రదేశ్ అతలాకుతలం అవుతోంది. ఈ వర్షాలు, వరదలవల్ల ఇప్పటివరకు జరిగిన వేర్వేరు ఘటనల్లో అక్కడ 51 మంది మరణించారని, మరో 22 మంది గల్లంతయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

## 'సిక్కిం పొరుగు దేశమా?' బీజేపీ చురకతో కాంగ్రెస్ నేత క్షమాణలు



**న్యూఢిల్లీ:** కొందరు రాజకీయ నేతల ప్రసంగాల్లో అప్పుడప్పుడు తప్పులు దొర్లుతుంటాయి. దీంతో వారు అభాసుపాలవుతుంటారు. తాజాగా సిక్కింనకు చెందిన కాంగ్రెస్ నేత ఇదేవిధమైన వివాదంలో చిక్కుకున్నారు. తరువాత క్షమాపణలు చెప్పడంతో పాటు పొరపాటున నోరు జారానని వివరణ కూడా ఇచ్చారు. సిక్కిం కాంగ్రెస్ నేత అజోయ్ కుమార్ సిక్కింను పొరుగు దేశం అని పేర్కొన్న ఒక వీడియో వెలుగులో రావడంతో అతని మాటలు వివాదాస్పదంగా మారాయి. దీనిపై బీజేపీ విమర్శలు గుప్పించింది. దీంతో అజోయ్ కుమార్ ఒక ప్రకటనలో తన నోరు జారడం వల్ల అలా జరిగిందంటూ క్షమాపణలు చెప్పారు. తాను విలేకరుల సమావేశంలో భారత్- పొరుగు దేశాల మధ్య క్షీణిస్తున్న సంబంధాల గురించి మాట్లాడుతూ, పొరపాటున సిక్కింను పొరుగు దేశంగా ప్రస్తావించాను. ఇది అనుకోకుండా జరిగిన మానవ తప్పిదమంటూ అజోయ్ కుమార్ తన తప్పుకు వివరణ ఇస్తూ క్షమాపణలు కోరారు. కాంగ్రెస్ నేత అజయ్‌కుమార్ తప్పుడు వ్యాఖ్యలను సిక్కిం బీజేపీ సిక్కిం యూనిట్ తీవ్రంగా ఖండించింది.. ఒక మాజీ ఐపీఎస్ అధికారి, పార్లమెంటు సభ్యుడైన అజయ్ కుమార్ భారతదేశ చరిత్ర భౌగోళిక స్వరూపంపై నిర్లక్ష్యం ప్రదర్శించడం విచారకరమని బీజేపీ 'ఎక్స్' పోస్టులో పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ ఇటువంటి అవమానకరమైన తప్పులను నివారించేందుకు, వెంటనే పార్టీ నేతలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని సూచించింది. ఈ అంశంపై బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనవాలా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిన్నా అడుగుజాడలను అనుసరిస్తోందని, దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.